వేంకట సుబ్బారాయ, రెంటాల

వరశుల్క నాటకము, అను వాణీ స్వయంవరము

మద్రాసు, 1911

Record no: 9

Vēṅkaṭa Subbārāya, Reṇṭāla

Varaśulka nāṭakamu, anu Vāṇī svayaṃvaramu

Madrāsu, 1911

Record no: 9

## Bibliographic Record Target

వేంకట సుబ్బారాయ, రెంటాల.
వరశుల్క నాటకము, అను వాణీ స్వయంవరము / రెంటాల వెంకట సుబ్బారాయ ప్రణీతము. - 2. కూర్పు. - మద్రాసు : విక్టోరియా డిపో, 1911.
162 p. ; 15 cm.
Record no: 9

Vēṅkaṭa Subbārāya, Reṇṭāla.
Varaśulka nāṭakamu, anu Vāṇī svayaṃvaramu / Reṇṭāla Veṅkaṭa Subbārāya praṇītamu. - 2. kūrpu. - Madrāsu : Vikṭōriyā Ḍipō, 1911.
162 p. ; 15 cm.
Record no: 9



# వరశుల్క నాటకము

## [illegible] స్వయంవరము

[illegible]

[illegible]

[illegible]

[illegible] 4 [illegible]

[illegible]

PRINTED AND PUBLISHED BY R. VENKATA SUBBARA[illegible]
[illegible] THE JANOPAKARINI PRESS
VICTORIA DEPOT, MYLAPORE, MADRAS

*

# పీఠిక

మూడునాల్గు మాసములకు మున్ను నామిత్రుఁడు గురజాడ అప్పారావు పంతులుగారు ప్రీతిపూర్వక నాకొసంగిన వారి కన్యాశుల్క నాటకమును జదివి హా నందించుటయే యీ వరశుల్క నాటకమును రచియింపఁ బూనుటకుఁ గారణము. దీని శైలియు పద్ధతియు నిప్పటి గొప్ప పండితులు రచించెడి తెనుఁగు నాటకముల తెన్నునకుఁ గొంత భిన్నముగనుండుట స్పష్టము. అందఱు నొక్క త్రోవనె త్రొక్కు[illegible]డిన క్రొత్త త్రోవ లేర్పడఁజాలవు గదా — పెద్ద[illegible]న్నించి దరింపరా? ఇందలి పాత్రములు న స్వయం కల్పితములయ్యు వానిం గొన్ని కొన్ని యంశములందుఁ బోలిన స్త్రీపురుషు లుండక పోరు. కావున, లేని పోని యూహలు మనమున నెలకొల్పక యెల్లవార లీనాటకమును జదివియుఁ బ్రదర్శనముల వీక్షించియు సంతసిల్లు దురని నమ్మువాఁడ.

అక్టోబరు 1909 [illegible] సు||



# నాటక పాత్రములు.

పురుషులు.

ఆనందంపంతులు — వాణీబాయి తండ్రి.
వామనశాస్త్రి — సుందరశాస్త్రి తండ్రి.
సుందరశాస్త్రి — వాణీబాయి వరుఁడు.
దామోదరం పంతులు — అంబన్న మేనమామ.
అంబన్న — వాణీబాయి మగఁడు.
మహీపతి — దామోదరంపంతుల స్నేహితుఁడు.
కుశాల్రాం, ప్రసాదం, శర్మ — విద్యార్థులు.
రామావధానులు, కుప్పుసామి, రత్తయ్య, కామయ్య, పిచ్చన్న — బ్రాహ్మణులు.
తర్కసోమయాజులు, అప్పాజీపంతులు, రఘునాథాచార్యులు, శివశంకరశాస్త్రి, బలవంతరావు, బాలకృష్ణశెట్టి, జగన్నాథం నాయుడు — గుంటూరు సోషల్ క్లబ్బు మెంబర్లు.

గురవడు — కూలివాడు.

భజగోవిందస్వాములవారు, శిష్యులు.

కలిపురుషుడు, భిషజ్మణి, సిద్ధాంతి.

స్త్రీలు.

లలితాబాయి — ఆనందపంతుల భార్య.

వాణీబాయి — ఆనందపంతుల కుమార్తె.

గంగ — దామోదరపంతుల కుమార్తె.

తుళశమ్మ — అంబన్న తల్లి.

సరోజిని — స్త్రీమహాసభ ప్రెసిడెంటు.

చంద్రాబాయి, రుక్మిణమ్మ, కమలాబాయి మున్నగు స్త్రీలు.

వెంకి — గురవని పెండ్లాము.

భజగోవిందస్వాముల శిష్యురాండ్రు.

బిచ్చపుపిల్ల.

---

## ప్రదేశము.

ప్రథమాంకము — గుంటూరు.

౨, 3, ౪, ౫ అంకములు — చెన్నపట్టణము.



# కాలనిబంధనము.

—:o:—

ఈ నాటకమును పరిశీలనముతో జదువు బుద్ధిమంతులకీ క్రింద సూచింపబడిన విధమున కాలగమనము స్పష్టము కాగలదు. దీనిని జక్కగ గుర్తించి అయ్యాయి మధ్య కాలములయందు నాటకపాత్రములును విషయములు నెట్లెట్లు ప్రవర్తిల్లెనో యేయే స్థితిగతులయందుండెనో సాధ్యమగువర కూహించుకొన్న నే యిందు ప్రదర్శింపబడిన విషయముల పరస్పర సంబాధమును పాత్రముల మనోభిప్రాయములును చిత్తవృత్తులును అద్దమునందువలె ప్రతిఫలించి యానందమును గొలుపును. అప్పుడే యిది నాటకమను మాట మఱుపుచెంది పఠనమందును ప్రదర్శనమునందును అయ్యాయి పట్టుల రసభావములు మనసునంటును.

---

## ప్రథమాంకము.

౧ - వ రంగము — 1908 సం॥ డిసెంబరు 9 బుధవారము. కీలక సం॥ మార్గశిర బ ౨. అంబన్న ద్వితీయ వివాహదినము.

౨-వ రంగము — డిసెం॥ 10-పెండ్లి మఱుదినము.

౩-వ రంగము — డిసెంబరు 25-ఉదయము.

౪-వ రంగము — ,, భోజనసమయము.

౫-వ రంగము — ,, మధ్యాహ్నము.

## ద్వితీయాంకము.

౧-వ రంగము — 1909 సం॥ జనవరి 6 బుధవారము-ఉదయము. పుష్యశు ౧౫-పగలంపి వేసిన పిమ్మట రెండువారములకు (పెండ్లియైన నాలుగు వారములకు.)

౨-వ రంగము — ఆదినమే-అర్ధరాత్రికి పిమ్మట.

౩-వ రంగము — 1909 సం॥ జనవరి 10 ఆదివారము-సాయంత్రము.

౪-వ రంగము — 1909 సం॥ ఫిబ్రవరి 17 బుధవారము-శివరాత్రికి ముందటిదినము.

౫-వ రంగము — 1909 సం॥ మార్చి 7 ఆదివారము. ఫాల్గుణ శు ౧౫-సాయంత్రము 4 గంటలు కొట్టబోవుసమయము.

౬-వ రంగము — ఆదినమే-4 గంటలవేళ.



## తృతీయాంకము.

౧-వ రంగము — 1909 సం॥ ఏప్రిల్ 5 సోమవారము-సాయంత్రము-చైత్ర శు ౧౫.

౨-వ రంగము — 1909 సం॥ ఏప్రిల్ 6 మంగళవారము-రాత్రి.

౩-వ రంగము — 1909 సం॥ ఏప్రిల్ 7 బుధవారము-పగలు 2 గంటల సమయము.

౪-వ రంగము — 1909 సం॥ ఏప్రిల్ 12 సోమవారము-ఉదయము.

## చతుర్థాంకము.

౧-వ రంగము — 1909 సం॥ మే 14. అర్బతునాటుకంపెనీ దివాలాదీసిన రెండువారములకు. [నాటక సందర్భమున కనుగుణ్యముగ అర్బతునాటుకంపెనీ దివాలాదినము మార్పబడినది.]

౨-వ రంగము — 1909 సం॥ మే 15.

౩-వ రంగము — 1909 సం॥ మే 19. వైశాఖ బ 30.

౪-వ రంగము — 1909 సం॥ జూన్ 3-రాత్రివేళ-జ్యేష్ఠశు ౧౫.

## పంచమాంకము.

౧ - వ రంగము — 1909 సం॥ జూను 21 సోమవారము. [19 శనివారమున రైలు విపత్తు.]

౨ - వ రంగము — 1909 సం॥ జూను 28 - సోమవారము ఉదయము.

3 - వ రంగము — 1909 సం॥ జూలై 1 గురువారము.

---



శ్రీరస్తు.

# వరశుల్క నాటకము.

## ప్రస్తావన.

కలిపురుషుడు సితారు మీటుచు ప్రవేశించును.

పాట - నాదనామక్రియ.

౧.

కలిపురుషుడు మీకండ్లయెదుట నిదె నిలబడియున్నాడు!
వెలవెలబోవక వినుడని మిమ్ముల వేడుచున్నవాడు.

౨.

కలికాలంబని దూషింతురుగద కరుణమాలి మీరు!
కలిని మిమ్ము సకలమ్ము సృజించిన కర్త నెఱుగలేరు.

3.

యుగధర్మములు చెల్లక పిమ్మటియుగము వచ్చు టెట్లు?
యుగములు మారకయుండిన సృష్టికి ఉసురు లేనియట్లు.

౪.

కృతయుగధర్మము కలియుగమందు సమృద్ధిచేయబూని
క్షితిజనులెల్ల వృథాప్రయాసమును జెందుదురేగాని,

౫.

కాలపథమ్మున కర్తశకట మే గతిబోవునొ దాని
చాలు మార్పదరమా నలుమోముల వేలుపునకు నేని ?

౬.

వరశుల్కము కన్యాశుల్కము మఱి వర్ణసంకరంబు
పరిపరివిధముల వైపరీత్యములు ప్రబలుట నిక్కంబు.

౭.

కీడుమేలనుచు చింతించెద రది కించిద్జ్ఞానంబు,
కీడు మేలగును మేలు కీడుగా మూడును తథ్యంబు.

౮.

సుఖదుఃఖములని తలపోయుట యది శుద్ధ వెఱ్ఱిమతము,
అఖిలంబును జ్ఞానమునకు మార్గం బదియే శాశ్వతము.

౯.

జ్ఞానవంతులెందఱో యీయుగమున జన్మించినవారు,
పూనికతో సద్బుద్ధులు నీతులు బోధించినవారు.

౧౦.

పురాణకథలను నాటకములుగా పొందుపఱచినారు,
పురజనంబులకు ప్రదర్శించి యుప్పొంగ జేసినారు,



౧౧.

మహిమీదికి దేవతలను దెచ్చి మహిమ జూపినారు,
మహాపురుషులను స్త్రీమతల్లులను మదిని నిల్పినారు,

౧౨.

మేలు మేలు సేబాస్ భళీ యనుచు మెచ్చుకొందురయ్యా
చాలవగచి మఱిమఱి కలిదూషణ సల్పుచుందురయ్యా!

౧౩.

ఉన్నమాట మీయెదురుగ బల్కెద ఉడుకు చెందవలదు,
అన్నలార! కాలము దూషింపగ న్యాయమేమి కలదు ?

౧౪.

అన్నలార ? కర్మము నిందింపగ న్యాయమేమి కలదు ?
పన్నుగ నూతనసృష్టి యొనర్ప నుపాయమేమి కలదు ?

౧౫.

నరసినమీసము చక్కజేయుటకు నలుపు కప్పు మేలా,
నరసిన దానిని మఱుగుపఱచకను సరిదిద్దుట మేలా ?

౧౬.

ప్రస్తుతకాలపు వారికథలు నలువైపుల జూడుండీ,
వాస్తవముగ జ్ఞానము సమ్మోదము వర్ధిల్లగదండీ!

౧౭.

ఏపెఱుంగని నరులారా! మీ వీక్షణ మది యెంత?
దాపున తప్పులు విను మీచెవులకు దవ్వున బలమెంత?

౧౮.

చూపుమెఱుగుగని భ్రమచెందెడి మీసూక్ష్మబుద్ధియెంత?
రేపు రాగలది తెలియలేని మీ రిత్తజ్ఞాన మెంత?


౧౯.

వేయికనుల గని వేయిచెవుల విని వేయిచోట్ల నెపుడు
పాయక నివసించెడి కలిపురుషుని సాయముచే నిపుడు

౨౦.

చుట్టుప్రక్కలను గలుగుచున్న బలుచోద్యములుగనుండీ
ఒట్టుపెట్టికొని కలి మీహితుడని గట్టిగ నమ్ముండీ!

[కలిపురుషుడు నిష్క్రమించును.]



# ప్రథమాంకము.

—:o:—

రంగము ౧. — గుంటూరు సామీప్యమున ఒక దివ్యస్థలము.

ప్రవేశము :— రామావధానులు, శామయ్య, పిచ్చన్న, రత్తయ్య, కుప్పసామి, మఱికొందఱు బ్రాహ్మణులు.

—:o:—

౧ బ్రా॥ — యేమోయి! యేందొరికిందోయి?

౨ బ్రా॥ — యిదుగో! రుకారం.

౩ బ్రా॥ — నాకూ రుకారమేనోయి.

౨ బ్రా॥ — అందరికీ రుకారంలాగనే వుందోయి.— పిచ్చన్నా! నీకేమిచ్చారోయి?

పిచ్చన్న — గాడ్దెకొడుకు నాకర్థ యిచ్చాడోయి! చాలదని మొత్తుకుంటే మీదు మిక్కిలి మెడబట్టుగు త్రోశేశాడు!

౨ బ్రా॥ — అష్లాగషోయి! కుఱ్ఱవాడవని కామాల్లు అర్థయిచ్చారు.

పిచ్చన్న — కుఱ్ఱవాణ్ణి గొంతుపట్టుగుని తోయ్యామనుండిపోయి? వాడీ మొహాన విశిరి పారేదామనుకున్నాను గాని, కోపం అణుచుకున్నాను. లేకుంటే యివాళ్ల —

రామా॥ — హోహోహో! అత్తబట్టుకు ఛాలా బుద్ధి బత్తుడవే. బొహాల ఘార వెయ్యాలలుగుల్లావుఘా! హో! హేంబో హ్వారిగి తోఛిద్దిచ్చారు — బలవ్ సత్తోషిచ్చి పుచ్ఛుగోవాలిగాలి, దీలిగేద్దండలా యేభిషి? యిధిగో హ్వారిగడుపుఛల్ ల్లహో, పెద్ద బ్రాహ్బడ్డలి లాగు రుగారధ్వాయవ్ దయచేశారు. యెఖ్ఖడిగి తృప్తి? ఆశగు అల్లం లేదల్లారు.— ఘ్ హే! తబ్బుడూ! పొడుగ్గా యేధిరా?

కామయ్య — (పొడుముకాయ అందిచ్చుచు) — ఛాలా భాగానేయిచ్చారు. వకసంచి వదిలిందనుకుంఛాను.

పిచ్చన్న — సంచిగాదు వాడీశార్ధం వదిలింది. నాలుగు వందల బ్రాహ్మణ్యంకూడా తిన్నగాలేరు.

రత్తయ్య — యేదీ, పెళ్లిమాటే యెవరికీ తెలియలేదు. పొద్దున చెరువుదగ్గిర మొహంగడుక్కుంఛుండగా కామయ్య కనపడి చెప్పాడు - ఆపాట్ను యిద్దరం రైలుమీదబడి వచ్చాము. కాస్త ముందుగా తెలి



స్తే రాజాగారి సంభావనకోసరం కని పెట్టుకున్నమందంతా కొట్టుకొచ్చేదే. యేదో, వచ్చినందుకునాస్తి గాకుండా వకత్రుణంసొమ్ము దొరికింది. నాకూ రొండురుకారాలు ముట్టాయి.

౨ బ్రా॥ — హాః! హాః! రుకారధ్వంయం పోయి!

రత్తయ్య — యిదిగో! యిది కేవలం నాతెలివిచాత సంపాయించాను. ఛల్లగా రొండ్రోస్త్రోవలికి దూరాను.

౨ బ్రా॥ — ఘట్టివాడవే!

3 బ్రా॥ — రత్తయ్యంటే యేమనుకున్నావ్? యమఘాతకుడు గాదుపోయి!

కుప్పు॥ — ఎనకూండా యిరండుగూపా శిక్కింది.

౧ బ్రా॥ — మేత్రీటుగారి బ్రాహ్మడవాయెను నీకీడాని కేం? అబ్బాయీ! పంచపాకయ్యొచ్చాడా?

కుప్పు॥ — అహ్వాహ్వాహ్వాహ్వా! పంచపాకయ్య గాదండీ - పంచాపకేశయ్యారు. వాడు రాలేదు — వోరుశీలువాడితో సర్కీటుమేలె పూడ్చాడు.

౧ బ్రా॥ — యేదో ఫ్రా కేశయ్యారు. ఆనాడు నాసంభావనద్రవ్యం యిదిగోయిస్తానని బదులుచ్చుకొనియింకా యీానే లేదు సుమా!

కుప్పా॥ — యిచ్చును, యిచ్చును. బైపడకండి.

పిచ్చన్న — (తనలో) హూఁ! యేదో చచ్చినాడి పెళ్లికి యిచ్చిందే కట్టమన్నారు. పోనీ, రానుపోను రైలు ఖర్చయినా దొరికిందిగదా. రాజాగారి సంభావన లో రత్తిగాడివుపాయమే చెయ్యాలి. లేకుంటే కార్యంలేదు.

రత్తయ్య — అయితేనూ, మామా! తండులంగలవాళ్లే గదా దేవస్తానంలో చేశారేం?

రామా॥ — లాచేతవాగిచ్చాలచ్చాపు. పెళ్లిబీద పెళ్లి హెక్కడఛెయ్ బచ్చావేబిషి? గుల్టూరులో చేస్తే హీంపాటిగి వ్యాడీల్లుదగిలేవే.

రత్తయ్య — ఆహా! యెంత చక్కని పెళ్లికూతురండీ! చూస్తేనే కడుపు నిండిపోయింది!

కామయ్య — మేనరికమేనోయి. తిరుకువరం చెయ్యడానకు పెళ్లిమీద పెళ్లికొప్పుకొని యిచ్చాడు. లేకుంటే యీ ఆడకుంకకు పెళ్లాముండగా పిల్లనెవరిస్తారు? అహా! ఆ పట్టంపిల్ల కేవలం లక్ష్మీవిగ్రహం గదా! యీ నిర్భాగ్యుడికెల్లాదక్కుఛుంది? ఈమధ్య రామేశ్వరయాత్ర చేసుకుని వస్తూ చూచాను. ఆహాహా! రంభెందుకోయి ఆచిన్నదానిముందర?



పిచ్చన్న — అల్లాగైతే నా కప్పించవోయి, వెధవ పెళ్లి చేసుకుంఛాను.

రామా॥ — ఛీ! అప్రాచ్యుడా! హ్వారు యెత్తమోఘ్ఘులు, హ్వారి వాళవెత్త సాంప్రదాయగబైద్ది! అల్లా అట్టే లోట్టో పురుగులు పడతాయి సుబా!

రత్తయ్య — మొగుఁడుండగా వెధవపెండ్లేమిటిరా!

పిచ్చన్న — పోనీ, వూరికే వారింట్లో వుంఛాను.

రామా॥ — ఛీఛీ! గళ్లుపోతాయి సుబా!

రత్తయ్య — ఆ వుండేది అల్లుడివద్దే వుండు, అన్నీకలిశొస్తాయి. పైగా వుళ్లోపనీ.

పిచ్చన్న — వోరిబాబో! వాడి సొమ్మంతా యిచ్చినా నాకు వద్దోయి. యిల్లా బతికితే అంతేచాలును.

[అందరూ నవ్వుదురు.

కామయ్య — యీవివాహం పానకాలస్వామి సన్నిధిని చెయ్యడం ఛాలా ప్రశస్థమైన ఆలోచనే సుమా.

[తిరుగా నవ్వుదురు.

కుప్పా॥ — కామయ్యగారూ! ఆ పట్నంపొణ్ణుకు వయసేమండీ?

కామయ్య — పదిహేను పదహారేండ్లు వుంఛాయి. ఆహా! కేవలం అప్సరసే. ఆ ముఖవర్చస్సూ — ఆ కండ్లూ — ఆ శరీరమూ — ఆ కేశములూ—

పిచ్చన్న — వహ్వా!

రత్తయ్య — (పాడును) — బాల పదియారేండ్లగోలరా.

రామా॥ — హెవరోయి గాస్తపుల్లాలలిపిల్చారూ ?— లువ్వ్యట్రార త్తిగాయిల్లా దగ్ఘిరకొచ్చిపాడరా.

రత్తయ్య — (పాడును).

పాట - మోహన.

---

౧. బాల పదియారేండ్ల గోలరా — దాని
వాలుగన్నులు గండుమీలురా।
చాలవిద్యనేర్చి సంగీతమును నేర్చి
బేలమగని నెల్లజాల నన్నదట॥ బాల॥

౨. మేను మేలిమికన్న మిన్నరా - దాని
కౌనుజాడ చిన్నసున్నరా।
ఏనాటి పాపమో యేడేండ్లకే నీల
వేణికి ఆబ్రహ్మ వెఱ్ఱిమగని గూర్చె॥ బాల॥

3. కలికి పూవిల్తుని ములికిరా - దాని
చిలుక పల్కుల ముద్దు లొలుకురా।

పిచ్చన్న — భలేరా భలే! [రైలుకూత వినబడును.

రామా॥ — హహోహహో! చాల్చాలు. రైలొచ్చిద్ది. యిక్కా పాట విల్చొచ్చుట్టే లాభొగూబల్లోగి దీస్తుద్ది. రడ్డి, రడ్డి.



కామయ్య — పదండి! పదండి! [రైలుకూత తిరుగా వినబడును.

పిచ్చన్న — వేగిరం పదండి! కొంప మునిగేను!

[అందఱును నిష్క్రమింతురు.]

---

రంగము ౨. — గుంటూరు సోషల్ క్లబ్బు.

ప్రవేశము:— తర్కసోమయాజులు, అప్పాజీపంతులు, రఘునాథాచార్యులు, శివశంకరశాస్త్రి, బలవంతరావు, బాలకృష్ణసెట్టి, జగన్నాథనాయుడు.

—○: o :○—

రఘు॥ — ఏమండీ సోమయాజులుగారూ! వూహకున్నారేం? మన స్మృతుల్లో పద్ధతులన్నీ మహామంచివని వాదిస్తారే, యిప్పుడు వాటి మంచీచెడ్డా మీకూడా స్పష్టంగా కనపడ్డదిగద! యే డెనిమిదేళ్లకే పసిపిల్లలకు పెళ్లిళ్లుచెయ్యడం, మొగుడుచస్తే మళ్లా పెళ్లి పనికిరాదనడం, పెళ్లాముండగానే మళ్లీపెళ్లి చేసుకోవడం, యివన్నీ మంచిపద్ధతులేగద? మన దేశానికీదుర్గతి యెందుకు పట్టిందనుకున్నారు? అనాథస్త్రీల నిరంతరదుఃఖం వల్లనే - దానికి లేశమూ సందేహం లేదు.

వనజాక్షికంటినీ రొలి।
కినచో సిరి తొలఁగు దైవకృపయుం దొలఁగుర్।

— అని వూరికే అన్నాడూ కవీశ్వరుడు? ఆహాహా!

పురుషోత్తం పంతులుగారి అయిశ్వర్యం యావత్తూ నేటితో సరని ఘట్టిగా నమ్మండి. ఫలానానాటి సాయంత్రం గుంటూరు సోషల్ క్లబ్బులో రఘునాథాచార్లు చెప్పాడని జ్ఞాపకముంచుకోండి. అయ్యాయ్యో! యేమండీ యీఘోరకలి! ఆ ఆణాంగి లేకి వెధవ ప్రాణానికి ప్రసూరుమంటూ వకరు యేడవడంచాలక యింకోర్ని కూడా యెట్లా అంటగట్టారండీ! యేమండీ నాయుడుగారూ! యీవిషయంలో మనం యేదైనా మీటింగు జేసి ఘట్టిపని చెయ్యకపోతే అవమానం కాదుటండీ? యిట్లాంటిసమయంలో యెవరిమట్టుకు వారు తటస్థంగా వూరుకుంటే మన జన్మెందుకండీ? ఆ తాగుబోతుముండాకొడుకును దామోదరంగాణ్ణి తక్షణం బహిష్కారం వేయించొద్దటండీ?

బల॥ — ఆఁ! ఆఁ! మెల్లిగా! మీపుణ్యం మెల్లిగానండీ!

శివ॥ — ఆచార్లగారూ! మీరు చాలా తొందరమనుష్యులుగదా! కొంచెం నిధానించి మాట్లాడవలెను. లేకుంటే యేదో వకతంటా తెచ్చుగుంటారు.

రఘు॥ — యింకా నిధానమేమిటండీ, వల్లకాట్లో నిధానం

అప్పా॥ — కాదండీ! మీటింగు చెయ్యాలన్నారు బాగా



వున్నది. కాని, (మెల్లగా) తాగుడుమాట మనకెందుకండీ? తాగుతాడో లేదో యెవరు చూచారు?

రఘు॥ — నే రుజువుచేస్తా. పిల్లగారిషాపులో పద్దే బైటికి లాగిస్తా.

శివ॥ — ఆపంజేస్తే యింకా యెందరిబతుకులు బైటపడతాయో?

రఘు॥ — పణ్ణియ్యండి.—ఆఁ! మీరనేది గ్రాహ్యమైందిలెండి - వెధవలు యిట్లాంటికుంకలు కులంలోవుండేం లేకేమండీ?

తర్క॥ — (చిరునవ్వుతో) — ఆచార్లగారి కోపం రాదంటే రెండుమాటలు మనవిచేసుకుంటాను.

రఘు॥ — (కొంతశాంతించి) — యెబ్బే! నా స్వభావంచాత అట్లామాట్లాడతానే గాని యిట్లాంటి విషయాల్లో కోపమేమిటండీ? మనకేం విరోధంటండీ? తమవంటి పెద్దలు శెలవియ్యాలి, మావంటివాళ్లు వినాలనేగా!

తర్క॥ — అయితేనూ, ఆచార్లగారూ! — (మెల్లగా) — సురాపానదో[illegible] వున్న వారినం[illegible] బహిష్కారం చేయిం[illegible]

రఘు॥ — [illegible]ను.

తర్క॥ — యేమోభ్రష్టులు, వాళ్లసొమ్ము తగలేసుకుంటారు, వాళ్లేచెడిపోతారు - యితర్లకు నష్టంకలగజేసి బాధించేవాళ్లమాట చెప్పండి — (మెల్లగ) — అయ్యో! వ్యభిచారదోషం వున్నవారినందరినీ బహిష్కారంచెయ్యవలశిందంటారా యేమంటారు?

రఘు॥ — చెయ్యవలశిందే.

తర్క॥ — స్త్రీపురుషులను సహా?

రఘు॥ — ఆహా.

తర్క॥ — ఆబాలవృద్ధులను?

రఘు॥ — సందేహమేమిటి? పెద్దలైతేనేమి చిన్నలైతేనేమి?

తర్క॥ — మరొక్కమాట. శీమకు వెళ్లొచ్చినవారిని బహిష్కారంచెయ్యవలెనా వద్దా? మన బాలిష్టరు గారిని —

రఘు॥ — విద్యాభివృద్ధికోసరం అన్యదేశాలకు వెళ్లనీకపోతే మనదేశం యెట్లాబాగుపడుతుందండీ?

తర్క॥ — విద్యకొఱకుగాదు, వినోదార్థం వెళ్లుతారు?

రఘు॥ — అన్యదేశాలకు వెళ్లివస్తే బహిష్కారమేమిటండీ? పూర్వం స్టీమరుమీద చెన్నపట్నం వెడితేనే బహిష్కారం అనేవాళ్లు. రంగు —కు వెళ్లేవారే



గారు. యిప్పుడు జపానువెళ్లొచ్చినవారూ లండన్ వెళ్లొచ్చినవారూ సహా అందరితో కలిసి నిరాక్షేపణగా భోంచేస్తున్నారు. హేమాహేమీలెవరూ కూడా ఆక్షేపణచెయ్యడంలేదు.

తర్క॥ — సంతోషమే. కాని, వారక్కడ యేంభోంచేశారో, వారికి యెవరు వండిపెట్టారో?

రఘు॥ — అదంతా మనము విచారించవలసిన పనేమిటండీ? తిరిగీ వారువచ్చి యథాప్రకారం మనలో వున్నారాలేదా — అంతే మనక్కావలిశింది.

తర్క॥ — అయితే, చాటుగా మద్యపానంజేశేవాళ్లమాటా, వ్యభిచారం చేశేవాళ్లమాటేనా మనక్కావలిశింది? (అందరు నవ్వుదురు). పోనియ్యండి - ప్రస్తుత విషయాన్నిగూర్చి మాట్లాడుదాము. మీ అభిప్రాయం అతి బాల్యవివాహములు కూడవనా?

రఘు॥ — అతిబాల్యమేమిటి, బాల్యమేమిటి? ఆడపిల్లలకు యుక్తవయస్సువచ్చి వారికి బుద్ధితెలిసినపిమ్మట వివాహంచెయ్యడం నాతాత్పర్యం.

తర్క॥ — చెయ్యడమేమిటి, చేసుకోవడమనండి. అప్పుడు వారు స్వయంగా వరించుకోవడమేగా?

రఘు॥ — అవును, అయితేనేమి? మంచి చెడ్డలకు పెద్దవాళ్లసలహా యెల్లప్పుడూ వుంటూనే వుంటుంది.

బల॥ — నిశ్చయంగా, యీ బాల్యవివాహాలవల్లేనండీ అన్ని అనర్థాలూ మూడుతూవున్నవి. ఆడపిల్లలకు విద్యాభివృద్ధి లేకపోవడానికి బాల్య వివాహాలే ముఖ్యకారణము. వాటివల్లనే మనదేశం వితంతువులతో నిండిపోయింది. యీమాట ప్రతిమీటింగులో చెప్పిచెప్పి నానోరు కాయగాశింది.

తర్క॥ — రావుజీగారు బాగా శలవిచ్చారు! బాల్యవివాహాలు మానితే వితంతువు లుండరుగాబోలు!

బల॥ — బాలవితంతువు లుండరు.

తర్క॥ — వయసువాళ్లే వుండనియ్యండి. ఆమాట పోనియ్యండి. ఆడపిల్లలు చక్కగా చదువుకొని యుక్తవయస్సువచ్చి బుద్ధితెలిసి వారు వరించిన వరులను వివాహమాడడమే సర్వోత్తమం అంటారు?

రఘు॥ — ఔను.

తర్క — యేజాతివాణ్ణయినా సరేగాదూ?

బల॥ — అదెట్లాగండీ? ఆయాజాతుల్లో శాఖభేదం లేకుండా యిష్టంవొచ్చినవాణ్ణిపెళ్లిచేసుకోవచ్చును- అంతకంటె పైకి పోలేము.



తర్క॥ — రావుజీగారూ! స్వయంవరంలో మన ఆక్షేమిటండీ? యుక్తవయస్సువచ్చి, చక్కగా విద్యనేర్చి జ్ఞానంయేర్పడ్డతర్వాత, బ్రాహ్మణచిన్నది నాయుడుబిడ్డను వరిస్తుంది. తమబోటి పెద్దలంతాచేరి శాయశక్తులా వద్దని బోధించినా వినక ఆచిన్నవాణ్ణే పెళ్లాడుతుంది. యేమిగతి?

రఘు॥ — బహిష్కారమే.

తర్క॥ — మీకడుపు ఛల్లగా నిజమైనమాట శలవిచ్చారు. సరే బాగానే వున్నది. చిక్కులేదు. అయితేనూ, ఆచార్లగారూ! రావుజీగారూ! వకమాటడుగుతాను కోపంవొద్దుసుమండీ. తమపిల్లకాయలకు యీడువచ్చినతర్వాతనే వివాహాలు గాబోలును?

రఘు॥ — ఫదిమందీ చేరితే అట్లాగే. లేకుంటే వకరిద్దరుమాత్రం గోతిలోదూకి యేమిప్రయోజనం?

తర్క॥ — గోతిలో దుమకడమైతే పదిమంది చేరడంకంటె వక్కరు దుమకడమే వుత్తమంగాని, ఆచార్లగారూ! పదిమంది చేరలేదని వకరిద్దరుమాత్రం సాహసించడం తప్పయితే, జాతివారందరూ చేరనిది పదిమందిమాత్రం సాహసించవచ్చునా? అట్లా సాహసించనివారిని ఆక్షేపించవచ్చునా?

అప్పా॥— అందరూ చేరవలెనని కనిపెట్టుకుంటే యేకార్యమూ సాగదు. వితంతువివాహాలు మొట్టమొదట వకరితోనే ప్రారంభమైనవా వెయ్యిపెళ్లిళ్లు యేకముహూర్తాన అయినవా? యిప్పుడు అవి సర్వసామాన్యముకాలేదూ? అట్లాగే అన్నీ మొట్టమొదట కష్టమే. మీరు విన్నారో లేదో మొన్న నెల దినాలకిందట చెన్నపట్నంలో పెద్దపెద్దలంతా కూడి రిఫారండిన్నరులో కలిసి భోంచేశారట.

తర్క॥— అదేమిటా సంగతి?

అప్పా॥— చాలామందికి తెలిసిన సంగతే - రహస్యంకాదు. రిఫారం డిన్నరనగా - అయ్యర్లు, అయ్యంగార్లు, రావుజీలు, పంతుళ్లు, శాస్త్రుల్లు, నాయుళ్లు, మొదల్యార్లు, మలయాళీలు, మహమ్మదీయులు, క్రిస్టియన్లు - వీరందరూ కలిసి సహపంక్తిని మాట్లాడుకుంటూ వకర్నొకరు చూచుకుంటూ తాక్కుంటూ భోంచేశారట. శివశంకర శాస్త్రులవారి వియ్యంకులూ మరికొందరు మన వృత్తరాదివారూ అందులో వున్నారట. యిదంతానాకు మరెవరో గాదు గోపాలంగారు చెప్పారు. పాకంమాత్రంబ్రాహ్మణపాకమేనట. యిట్లాగే యింకా పదిడిన్నర్లు



జరిగితే జాతిభేదం కూర్చుంటుందిటండీ?

తర్క॥— యీ సువార్త నేను విననేలేదండీ. గోపాలంగారే చెప్పారూ! వారుకూడా——?

అప్పా॥— ఆహా.

శివ॥— యథార్థం యింకా తిన్నగా తెలియలేదు. రెండు మూడు విధాలుగా చెప్పుకుంటూవున్నారు.

తర్క॥— నింపాదిమీద అదే తెలుస్తుంది లెండి. తొందరేమిటి?

శివ॥— అయినా మన గ్రంథాల్లో దృష్టిదోషం చెప్పి వున్నట్టులేదు. కాశీ ఆవైపులను —

తర్క॥— మన గ్రంథాలు తగలబెట్టండి. యవళ్లో వెర్రిముండావాళ్లు యేనాడో చేశినవి మనకు ప్రమాణాలుటండీ? ఆ కాలానికి తగినట్టు వాళ్లు వ్రాశారు. యీ కాలాని కనుగుణ్యాంగా మనం మార్చకపోతే యెట్లాగు? వూరికే అనడంగాదు - నిశ్చయంగానే తమవంటి బుద్ధిమంతులందరూ చక్కగా ఆలోచించి యిది ప్రశస్తమని యేర్పరిస్తే ఆ ప్రకారం జరిగించడమే నా అభిప్రాయం.

అప్పా॥— యీ రిఫారం డిన్నర్లనుగురించి నేను మూడేళ్లబట్టి మొత్తుగుంటూ వున్నాను. ప్రతిచోటా తె

క్చర్లిచ్చాను. యీవూళ్లో పెద్ద మనుష్యులు యెవరికి వారు చాటుచాటున రిఫారం డిన్నరుకు వప్పుకుంటూ రేగాని పబ్లీకుగా రారు. బందర్లోమట్టుకు నాబోధ కొంచెం ఫలించింది. యిప్పుడిప్పుడు కొంచెం ధైర్యంచేస్తూ వున్నారు.

తర్క॥ — బందరు వారిమాట కేం లెండి? అక్కడ జంధ్యాలే విసర్జిస్తూ వున్నారట. తద్దినాలుమానడం చాలా దినాలనుంచి జరుగుతూ వున్నదట. దొంగతనంగాగాదు, పబ్లీకుగా సుమండీ!

అప్పా॥ — వచ్చినతంటే అదీ. కాస్తవదిలితే గంగలోకే యీడ్చుకుని పోతామంటారు.

తర్క॥ — అయితే పంతులుగారూ! తమతాత్పర్యం తద్దినాలు పెట్టవలెననేనా?

అప్పా॥ — కాక?

తర్క॥ — వితంతువివాహాలు చేసుకున్న వారుసహా?

అప్పా॥ — ఆహా. వితంతువులను వివాహమాడొచ్చునన్నాంగాని మతం వదిలిపెట్టమన్నామటండీ?

తర్క॥ — రిఫారంవిందులకు మతవిషయమైన ఆక్షేపణ లేదంటారు?

అప్పా॥ — వాటికీ మతానికీ యేమిసమంధమండీ?



తర్క॥ — అయితేనూ, వితంతు వివాహాల విషయంలో యేజాతివారు ఆజాతిలోనే పెళ్లాడవలెను గాబోలు

అప్పా॥ — శాఖభేదంమాత్రం పట్టింపులేదు.

తర్క॥ — ఆ వివాహాలు అక్షతల కేనా అందరికీనా?

శివ॥ — ఆ తర్కమంతా యిప్పుడెందుకండీ?

అప్పా॥ — అడగనియ్యండి. అక్షతలేమిటి, క్షతలేమిటి, అందరికీ నండీ.

తర్క॥ — వయస్సుతో నిమిత్తం లేకుండానే?

అప్పా॥ — లేకుండానే.

తర్క॥ — బిడ్డతల్లులుకూడా?

అప్పా॥ — ఆహా! వాళ్లకు కోరికుంటే చేసుకోవచ్చును. చిక్కులు కలిగితే వాళ్లే అనుభవిస్తారు.

తర్క॥ — అంతా అనుభవానికేగాదండీ? మంచిది పంతులుగారూ! యీవితంతు వివాహాలు చేసుకున్న వారికి ఆడపిల్లలు కలిగితే వాళ్లకు చిన్నతనంలోనే పెళ్లిళ్లా, యీడువచ్చి జ్ఞానం తెలిసిన పిమ్మటనా?

బల॥ — తల్లులకు యీడువచ్చినతర్వాత పెళ్లిళ్లుచేసి పిల్లలకు బాల్యవివాహాలు చేస్తారటండీ?

అప్పా॥ — అవును - యీడువచ్చిన పిమ్మటే పెళ్లిళ్లు?

తర్క॥ — స్వయంవరాలే కాదూ?

అప్పా॥ — ఆవును.

తర్క॥ — తిరుగా వెనుకటిదారికే వచ్చారు. అన్యజాతిలో వరించి పెళ్లిచేసుకుంటే?

రఘు॥ — బహిష్కారమే.

తర్క॥ — శాబాష్!

జగ॥ — నేను చెప్పేదదేగా, మీరులక్షువిధాలచూచినా జాతిభేదం నశించేవరకూ మన ప్రయత్నాలన్నీ నిష్ఫలం, నిష్ఫలం. బుద్ధిమంతు లందరూ చేరారుగా, యోచించి చూడండి.

తర్క॥ — అయితే నాయుడుగారూ! జాతిభేదం చూడకుండా వివాహాలు జరగవలెననా తమ తాత్పర్యం?

జగ॥ — సందేహమా?

తర్క॥ — చిత్తం. తమచిన్నవాడు చెన్నపట్నంలో చదువుకుంటున్నాడు గాదండీ?

జగ॥ — చెన్నపట్నంలో కాదు, రాజమండ్రిలో.

తర్క॥ — అతడు యవరైనా చదువుకున్న క్రీస్తుపడుచును వరించి వివాహమాడితే తమకు సమ్మతమే అనుకుంటాను?

జగ॥ — మాజాతిలో చదువుకున్న పడుచులు దొరక్కపోతేగద?



తర్క॥ — దొరికితేనేమండీ - యెవరిపిచ్చివారిదీ. నాకళ్లెట్టుకు చూడుమన్నాడు. అతడు క్రీస్తుపడుచునే ఘట్టిగా వరిస్తాడు. తమకు సమ్మతమేనా?

జగ॥ — మనమతం విడిచి అన్యమతంలో పెళ్లిచేసుకోవచ్చునని చెప్పానా యేమిటి?

తర్క॥ — చేసుకుంటే పై మాట?

రఘు॥ — బహిష్కారమే.

తర్క॥ — పోనియ్యండి, క్రీస్తుపడుచునుగాదు హిందూకన్యనే వరిస్తాడు?

జగ॥ — ఏజాతైనాసరే పెళ్లిచేసుకోవచ్చును - నా అభ్యంతరం వుండదు.

తర్క॥ — అది యెవరో మాలజాతి చిన్నదైనాసరే?

జగ॥ — యేమో బ్రాహ్మణకన్యనే వరిస్తాడేమో?

తర్క॥ — వరిస్తే సంతోషమే. అన్యవిధం తటస్థమైతే?

జగ॥ — యేమో అప్పటిమాటప్పుడూ.

తర్క॥ — కాదు, మీరు ఆమోదిస్తారా అని అడుగుతాను. అతనితో భోంచేస్తారా లేదా చెప్పండి.

రఘు॥ — యెట్లాభోంచేస్తారండీ? బహిష్కారమే.

అప్పా॥ — సరిసరి! యిదేమి వృథాప్రసంగము—శాఖభేదానికి కుదరడంలేదుగాని, జాతిభేదంచూడకుండా

వివాహాలు జరగడం యెక్కడిమాటండీ? ఈ దామోదరంపంతులు కుమార్తెనే బందరులో వామనశాస్త్రిగారి కుమారుడి కిప్పించాలెనని విశ్వప్రయత్నంచేశాను. అందరూ వప్పుకుని చిట్టచివరకు కట్నందగ్గిర తెగిపోయింది. ఫదివేలురొఖ్ఖం తెమ్మన్నాడు! అక్కడికీ దామోదరం పంతులు ఐదువేలవరకూ యిస్తానన్నాడు.

రఘు॥ — యీమాట మీరెట్లానమ్మారోగాని, అది వట్టిదొంగమాటండీ. మొదటినుంచీ దామోదరంగాడికి మేనల్లుడిమీదనే కన్ను. బావగారు బతికున్నమట్టుకు వీడి ఆటసాగిందికాదు. ఆయనచచ్చాడు, వీడికి అదృష్టం పట్టింది. అప్పముండకంట్లో కలికం వేసి ఆ పిచ్చికొడుక్కు రెండో పెళ్లి చేసి సొమ్మంతా మింగెయ్యాల్ననే తల్లిలేనికూతుర్ని పదమూడేళ్లొచ్చిందాకా పెళ్లిచెయ్యకుండా వుంచాడు. వామనశాస్త్రిగారి కొడుక్కిస్తానన్నమాట వట్టివేషమే గాని నిజంకాదు. వామనశాస్త్రిగారి కొడుక్కిస్తే వీడి కేంలాభిస్తుంది? పైగా కట్టం యెక్కడినుంచి తెస్తాడు?



అప్పా॥ — కాదు, కాదు. రాయభారం జరిగినమాట వాస్తవమే. కట్నానికి కావల్సినసొమ్ము అక్కగారిస్తానన్నదట.

రఘు॥ — అట్లాగైతే, అల్లుణ్ణి వెధవనుజేసి సొమ్మంతా గుటకాయస్వాహా చేతామనుకున్నాడేమో.

బల॥ — ఆచిన్నవాడు యితనికి లోబడేవాడుకాడు. పట్నంలో డాక్టరు పరిక్షకు చదువుతున్నాడు. చాలా తెలివిగలవాడట.

శివ॥ — అవును. మంచి బుద్ధిమంతుడూ స్ఫురద్రూపీ కూడాను. ఆనందంపంతు లింటనే బస. వారికీ వామనశాస్త్రిగారికీ బాల్యస్నేహం.

బల॥ — ఆనందంపంతులంటే మన అంబన్న —

శివ॥ — అవునవును, వాడిమామగారే. ఆయనకూతురే వాణీబాయి. వక్కతే కుమార్తె. పాపం! మగపిల్లవాడు రెండు సంవత్సరాలకింద చనిపోయినాడు.

బల॥ — అయ్యోపాపం! అయితేనూ, బాల్యస్నేహమంటిరే ఆచిన్నదాన్ని వామనమూర్తిగారి కుమారుడికియ్యక యీ ఆడంగిలేకి అంబన్నకిచ్చారేమండీ?

శివ॥ — అక్కడా శాఖభేదమే కంఠంపట్టుకుంది. పైగా పురుషోత్తంపంతులుగారి సమంధ మెక్కడమించి

పోతుందోఅనీ, యింకా నాలుగేళ్లు తాళిచేస్తే పెద్దకట్నం తెమ్మంటారనీ, ఆవెధవ పన్నెండేళ్లవాడయ్యుండగాయిచ్చి పెళ్లిచేశారు. యీపుణ్యం ఆనందంపంతులు అత్తగారు కట్టుకుంది.

అప్పా॥ — నాకుంటేమాత్రం పదివేలుకట్నం తెమ్మనకుండా వామనమూర్తిగారు చేసుకునేవాట్టండే? యెక్కడనైనా బావా అనుమంటాడుగాని నంగ తోటలో మాత్రం వద్దంటాడు.

బల॥ — చిన్నది చాలా చక్కనిదటగా?

శివ॥ — చిదిపి దీపంపెట్టవచ్చును.

అప్పా॥ — ఆయనకు చక్కదనమెందుకు? కట్నమే ప్రధానం.

బల॥ — అయితేనూ, దామోదరంపంతులు కూతురిని చేసుకోవడానకు కొడుకొప్పుకొన్నాట్టండీ?

అప్పా॥ — కొడుకిష్టమేమిటి? ఎదురుమాట చెప్పితే చదువుకు డబ్బు పంపనంటాడు. భార్యా రూపవతీ శత్రుః - అన్నాడు కాబట్టి పెండ్లాము అనాకారిగానే వుండవలెనట. అయన ప్లీడరువాదానికి శాస్త్రుల్లుగారే జవాబు చెప్పాలెగాని యెవరికిచాతవుతుంది?



బల॥ — ఫదివే లడిగారంటిరే, ఆయన సొమ్మే కట్టుకుపోయి నంతుందిగా?

అప్పా॥ — ఉందా! రూపాయీ తొమ్మిదణాల వడ్డీకి తిరుగుతూవుంది. వున్నవాళ్ల కేనండీ మరింతాశా. డబ్బుగల అల్లుడు వూరికే దొరుకుతాడా, నా అల్లుడికి నన్నూరు నవరసులు నేను గుమ్మరించలేదా, అంటాడు. మొన్న విశాఖపట్నంనుంచి వెంకట శాస్త్రిగారు వెయిన్నీనూటపదహార్ల కట్నంతో తమ మనమరాలి నిస్తామని కబురుపంపిస్తే, మూణ్ణెల్లు తిప్పితిప్పి చిట్టచివరకు మావాడికిప్పుడు పెళ్లి చెయ్యమని జవాబు చెప్పాడు.

బల॥ — అంతా డబ్బులాగడానికే!

అప్పా॥ — మరెందుకనుకున్నారు?

బల॥ — ఏమాశ్చర్యమూ! కన్యాశుల్కాలుపోయి వరశుల్కాలు వర్ధిల్లుతూవున్నవిగదా! ఆ చిన్నవాడు చదువు సాంతం కాగానే స్వతంత్రించి యువతైనా చక్కని బాలవితంతువును పెళ్లాడితే వామనమూర్తిగారు యేంజేతురో?

అప్పా॥ — యేంజేస్తారా! దేముడా అని సప్తమస్వరం పాడుతూవుంటారు.

రఘు॥ — ఆగోల మన కెందుకు, మనగోల తేలనిత్తురూ.

అప్పా॥ — చిత్తం చిత్తం, క్షమించండి! మనగోలమాట చెప్పానుగాదూ? నాయుడుగారిమాటల కేమి, జాతి భేదం చూడకుండా వివాహాలుజరగడం యెన్నటికో? ప్రస్తుతం భోజనాలుసాగితే గొప్ప.

తర్క॥ — నాయుడుగారూ! నలుగురూ సమ్మతించిన మట్టుకే పోనియ్యండీ. జాతిభేదం చూడకుండా భోజనాలు మీకు సమ్మతమే గద?

జగ॥ — హె-హె-హె! అదికూడా అడగవలెనా?

తర్క॥ — పంతులుగారిని అడగనే పని లేదు. — ఆచార్లగారికి సమ్మతమేగాదూ?

రఘు॥ — అందరూ సమ్మతిస్తే నాకూ సమ్మతమే.

తర్క॥ — తామో, శాస్త్రులవారు?

శివ॥ — దృష్టిదోషం లేదని నే నిదివరకే చెప్పాను.

తర్క॥ — రాపుణీగారు, తమమాటో?

బల॥ — నేనేనా వద్దనేది?

తర్క॥ — శెట్టిగారు మాట్లాడారుకారు.

బాల॥ — కానియ్యండి - ఆ పైమాట చెప్పండి.

తర్క॥ — అప్పైమాట నేమీ లేదు. నాస్వంత ఖర్చు మీద రేపు ఆదివారంనాడు రిఫారంవిందొకటి యేర్పాటుచేస్తాను. తామందరూ భోజనానికి దయ చేయవలెను.



బల॥ — మీరుకూడా మాతో భోంచెయ్యవలెను.

తర్క॥ — నామాట కేంలెండి? ఛాందసుణ్ణి నన్నింకా పూర్వాచారమే పట్టుకు యేడిపిస్తావుంది. నేను భోంచెయ్యకపోతే నేం గనక, నావల్ల మీరు ఆ తీర్థ్యంపొందవలెనని నాకోరిక. ప్రస్తుతం యింత మట్టుకు సాగనియ్యండి.

అప్పా॥ — సరే, యీవిందెక్కడ యేర్పాటు చేస్తారు? మీయింట్లోనేనా?

తర్క॥ — మాయింట్లో యేర్పాటు చెయ్యడానికి, నాకంటె ఛాందసురాలు నాభార్య. ట్రావెలర్స్ బంగాళాలో యేర్పాటుచెయ్యవలెనని యోచిస్తున్నాను.

శివ॥ — అది చాలా ప్రశస్తమైన ఆలోచనే. వూరికిదూరంగా, లేనిపోని గల్లంతు లేకుండా, యేదో పిక్‌నిక్ పార్టీలాగుంటుంది. పాకం బ్రాహ్మణపాకమేగద?

తర్క॥ — ఆహా! పిండివంటలకు మట్టుకు శనగపల్లి వెంకమ్మ నేర్పరుస్తాను.

శివ॥ — శనగపల్లి అనగా మనకోమటి —— ?

తర్క॥ — అవును, అయితేనేమి? ఆమె పకోడీలు జగ త్ప్రసిద్ధే గదా? తక్కిన భక్ష్యాలస్వారస్యంకూడా చూతురుగాని.

బల॥ — వడ్డనెవరు?

తర్క॥ — వడ్డనకు నాయుడుగారి నౌకరును పెడుతా మనుకుంటున్నాను.

జగ॥ — వాడు ఛాలా శుచిమంతుడు. కావలెనంటే వకరోజుముందుగానే మీవద్దికి పంపిస్తాను.

తర్క॥ — నాయుడుగారి నౌకరుకుతోడు డాక్టరుదొర సానిగారి బొాల్లెరునయినా సిస్టరు కల్యాణిగారి బొ ల్లెరునైనా వుంచవలెనని అనుకుంటున్నాను.

జగ॥ — బొాల్లెరెందుకండీ? మావాడొక్కడే ఫదిచేతుల పనిచెయ్యగలడు.

తర్క॥ — వుంటేమంచిది. కాఫీపాకం, టీపాకం, వాళ్ల కు బాగా తెలుసును. కాదండీ శాస్త్రులవారూ?

శివ॥ — సరే, మీయిష్టము.

తర్క॥ — మీపంక్తికి యింకా ముగ్గురు పెద్దలనుకూడా పిలవదల్చుకున్నాను.

బల॥ — వారెవరు?

తర్క॥ — బసవయ్యనాయుడుగారొకరూ.



జగ॥ — కేవలం సానిదాని—

తర్క॥ — అదేంమాటండీ? వారి వుద్యోగమూ మర్యా దాచూడండి.

శివ॥ — సరే రెండోవారెవరు?

తర్క॥ — సారా యిజారాదార్ అరుణాచల గ్రామణి గారు.

జగ॥ — వారివర్ణమేమిటో మీకు తెలుసునా?

తర్క॥ — నాయుడుగారు పరాకుగా వున్నారుగాబోలు!

బల॥ — మూడోవారెవరు?

తర్క॥ — మూడోవారికి యెవరి ఆక్షేపణావుండదు. అ తడు చాలా పరిశుద్ధుడూ యీశ్వరభక్తుడూ.

అప్ప — దాసరి రంగప్పకాడు గద?

తర్క॥ — సందేహమెందుకూ? అతడే.

జగ॥ — సరే, మీవిందు యేర్పాటు చెయ్యండి - ఆవేళ కు వీలున్నవారు వస్తారు.

తర్క॥ — అట్లాఅంటే కాదండి. వస్తామనేవారు వక కాగితంమీద సంతకాలుచేశి నూరేసి రూపాయీ లు డిపాసిట్ వుంచవలెను. ఆవేళకు రానివారిసొ మ్ము శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంకు చెల్లేట ట్టు కరారూ.

రఘు॥ — సరేలెండి! యీకర్రాల్లా యీడిపాసిల్లా కుదిరినట్టే. యేవో మాటల్లోకి దింపి ప్రస్తుతవిషయం వుళ్లక్కి చేస్తూవున్నారు.

తర్క॥ — ప్రస్తుతవిషయానికి శెట్టిగారే మిగిలారు. కర్తవ్యము వారే శెలవియ్యవలెను.

బాల॥ — శెట్టిగారికంతా అయోమయంగావుంది. ముందుకుబోతేనుయ్యి యెనక్కుపోతేగొయ్యి - యేం శెయ్యమంటారు? కొద్ది కొద్దిగా సంస్కర్షణం శేదామంటే, యేది శేశినా మర్నాడే పెద్దభావిలోకి యీడుస్తుంది. పోనీ యెనక్కుమళ్లుదామంటే, మనంతవ్వుకున్న గొయ్యే మింగేస్తుంది. యిదంతా ఆలోశించే కామాల్ను మాదీక్షితులు మాకూడా యేదాలు ముఖ్ఖైమన్నారు. వారుచెప్పిన ప్రకారమైనా అందరూ బ్రాహ్మలవుతారేమో అంటే అదీ కుదరదు. నా నామాలు మీకొస్తాయా, మీయీబూది నాకొస్తుందా? నాది జుట్టూ, మీది పిలకా, వాఁడిది దారబోడీ, యీరిడి తురకబోడీ - యియ్యన్నీ యెట్టావొకటవుతాయి? పడుచాడు పెళ్లాం లేక యాడవడం ముసలాడికి యిద్దరు పెళ్లాలూ పెళ్లాం సదువుకున్నదీ, మొగుడు మొద్దూ - మొ



గుడు సదువుకున్నోడు, పెళ్లాం యేబ్రాశీ - యియన్నీ యెట్టా అతుకుతాయి? కాని, ఆలోశించగా ఆలోశించగా, నాబుద్దికోటి తోచింది. మావాళ్లు తిట్టినాసరే శెప్పమంటే శెపుతాను.

రఘు॥ — చెప్పండి శెట్టిగారూ! చెప్పండీ!

అప్పా॥ — ఇంత శేపు మీరు మాట్లాడకుండా వూరుకుంటే అప్పుడే అనున్నాను, యేదో ఆలోచిస్తూవున్నారని.

బల॥ — శెట్టిగారి యుక్తికి మించిందుండదు.

తర్క॥ — నేననలేదూ, కర్తవ్యం శెట్టిగారే శెలవియ్యాలనీ?

బాల॥ — నిజంగా శెప్పమన్నారా?

జగ॥ — చెప్పండీ.

బాల॥ — సరే, నలుగురితోపాటు నేనూ నారాయణా అంటాను. యీ కలికాలంలో వక్కటే సూత్రం వున్నదండీ. అందుంటే యేదీ అడ్డదు.

శివ॥ — ఏమిసూత్రం ?

బాల॥ — అది వక్కటిగనక యేర్పడితే, ఆపైన మీ యిష్టమే యిష్టము. జాతిభేదాలూ వుండవు, బాల

యితంతువులూ వుండరు, ఆడోళ్లకు సదువులేదని గోలావుండదు. అన్నీ నిముషంలో కుదిరిపోతాయి

శివ॥— ఏమిటాసూత్రం?

బాల॥— యేమిటా? యితంతువులు పెళ్లాడొచ్చునని గౌనరుమెంటోరు సట్టంశేశారా లేదా?

శివ॥— చేశారు.

బాల॥— అట్టాగే యింకోసట్టం శేస్తేసరి.

శివ॥— యే విషయమై?

బాల॥— క్రమమైన కారణాలుంటే పెళ్లిళ్లు రద్దుశేసుకోవచ్చునని.

రఘు॥— మగవాళ్లేనా ఆడవాళ్లుకూడానా?

బాల॥— అందులో భేదమేమిటండీ?

రఘు॥— ఆహా! అట్టాంటి చట్టంవుంటే యిప్పుడు ఉపయోగించేది గదా!

బాల॥— మించిపోయిందేమిటండీ?

తర్క॥— ఆహా! శెట్టిగారూ! మీరు యెవరో అవతార పురుషులుగాని వట్టివారుగారండీ. కేవలం నారద స్మృతిలో కలియుగాధ్యాయంలో వున్న మాటకని పెట్టివేశారు.

శివ॥— నారద స్మృతిలో కలియుగాధ్యాయ మెక్కడిదండీ



తర్క॥— వున్నది, వున్నది. వెల్లడైన ప్రతుల్లో అదియెవరో బుద్ధిమంతులు చింపివేశారు. మాముత్తాత గారి ప్రతి మాయింట్లో వున్నది. దానిలో యీ అధ్యాయంవున్నది. చదీవిచూస్తిని గదా, కలియుగంలో మన అభివృద్ధికి కావలసిన వుపాయాలన్నీ, చెప్పివున్నవి. వెల్లడిచేస్తే ఆచారాలు వల్లకాడైపోతవని యిన్నాళ్లూ వూరుకున్నాను. యిప్పుడు బైటపెడుతాను. కలిమార్గం అడ్డడం మనతరమా!

జగ॥— ఆ అధ్యాయంలో యేంజెప్పివున్నదండీ?

తర్క॥— మీమాంశే - సరిగ్గామీమాంశే. జాతిభేదం నశించగానే యీదేశానికి గొప్పదశ వస్తుందని.

జగ॥— ఆఁ! ఆఁ!

తర్క॥— జాతిభేదం మనకు తెలియకుండా చల్లగా నశించే వుపాయముకూడా అందులోనే చెప్పివున్నది.

శివ॥— ఏమిటావుపాయం?

తర్క॥— ఏమిటా? శ్లోకమే చదువుతాను, వినండి.

"బహుభార్యా నిషేధశ్చ
ద్వాహబంధ విమోచనం।
ఏతద్ద్వయేనలోకే స్మిన్
జాతిభేదో వినశ్యతి॥"—

బహుభార్యా నిషేధము, వివాహబంధ విమోచనము - యీ రెంటికీ మార్గాలేర్పడితే, కలియుగంలో జాతిభేదం నశిస్తుందన్నాడు.

శివ॥ — ఏదీ ఆశ్లోకం యింకోసారి శలవియ్యండీ.

తర్క॥ — “ బహుభార్యా నిషేధశ్చ
ద్వాహబంధ విమోచనం।
ఏతద్ద్వయేనలోకే స్మిన్
జాతిభేదోవినశ్యతి ॥ ”

శివ॥ — గొప్ప ప్రామాణికవాక్యమే సుమండీ.

బల॥ — ఇక నేమీ లేదు, యీ విషయంలో చట్టం యేర్పడేలాగు మనం పనిచెయ్యాలండీ.

రఘు॥ — ఆచట్టం యేర్పడితే అన్ని అనర్థాలు పోతాయి.

అప్పా॥ — ఇది భలే వుపాయమండీ. విషయాలుచూడబోతే అందరూ ఆమోదించేటట్టున్నవి - పర్యవసానం అనంతం!

జగ॥ — పర్యవసానమా! వక్కటేవర్ణం యేర్పడడమే.

శివ॥ — ఇండియాలో అంతటా వక్కటే హిందూజాతి అనండి. వక్కనేషన్ యేర్పడి మనదేశమాతకు పునహా మహాదశ రావడానికి అభ్యంతరమేమిటి?



బల॥ — మనకౌన్సిలు మెంబరుగారినిపట్టి, యీ విషయం ఆయన తలకెక్కిద్దాము.

రఘు॥ — (లేచి) — ఆహా! సంతోష బాష్పాలు ఆపజాలనండీ. యిప్పటికి యింటికి పోదాము.

బల॥ — మనమెంబరుగారిని యిక్కడికి పిలిపించి వచ్చేవారములో పెద్దమీటింగు చేదాము. [అని లేచుచున్నాడు

జగ॥ — ఆయన మనదారికి రాకపోతే, యింకోసారికి శంకరశాస్త్రిగారిని మెంబరుగా కోరుకుందాము.

రఘు॥ — ఆహా! నాకు నిశ్చయంగా చాలా సంతోషంగా వున్నది.

అప్పా॥ — కీడున మేలన్నాడు.

తర్క॥ — తథాస్తు!

[అందరూ నిష్క్రమింతురు.]

---

## రంగము 3. — గుంటూరులో దామోదరం పంతులు ఇల్లు.

ప్రవేశము :— దామోదరంపంతులు (నగలపెట్టె ముందిడుకొని).

——: o :——

దామో॥ — “ వినాశకాలే విపరీతబుద్ధిః ” - అని పెద్దలన్నమాట యెన్నటికి వ్యర్థముకాజాలదు. అవివేకపుశుంఠలు! స్వభాషనైన చక్కగ మాటాడనేరని

వీరికీ మీటింగులేమి, యీ వెఱ్ఱి ప్రసంగములేటికి? ఇన్నాళ్లు వితంతూద్వాహముల పిచ్చి హెచ్చిహెచ్చి కిరసనాయిలు చిచ్చున రగిలి యిప్పుడు దిగుముఖమునకు వచ్చియున్నది. కాని, యీకలికాలమున జాతినకాలు నిలువద్రొక్కుకొను టెక్కడిది? పిచ్చికుదిరినది రోకలి తలకు జుట్టుమన్నట్లు, ఇప్పుడీదేశమును బాగుచేయగల త్రోవలు రెండు కనుపడినవట. బహుభార్యానిషేధమట—వివాహబంధ విమోచనమట! భళిరే! యెంతటి సూక్ష్మదృష్టి? నిశ్చయముగ సూక్ష్మమే! వెఱ్ఱికి వేవిధములు గదా! లేకున్న ఈకలియుగము నానాటికి గడచి యంతరించు టెట్లుపొసగును? * * * పెండిలి మఱునాడే క్లబ్బులో ఈబోడులుగూడి క్రిందుమీదు చూడక యేమేమో మాటలాడిరట. నిన్నటిసభయే పదియారవనాటి పండుగని ప్రేలిరట! అంతటికిని రఘునాథుడే సారథి. తమ్మునికి సారాయికమ్మదనమ్ము చవిచూపి మఱదలి నంటితినని అతనికి నాపైననుమానము. అనుమాలమేల, ఏలున్న నన్ను రూపుమాపవలెనని కోపమే. * * * నామాల రాయడు! నన్ను వీడేమిచేయగలడు? అందరుచేరి



మాత్ర మేమిచేయగలరు? అన్నయ్యలార! చేయుడు, ఇచ్చవచ్చినట్లు మీటింగులుచేయుడు! సభలు, ప్రసంగములు, చట్టములును చేయుడు, చేయింపుడు! మీ కత్తుకలకు మీరే యురులు వెట్టికొనుడు! పనిలేని మంగలి పిల్లతల గొరిగెనట! పాములు పిల్లితలయని చెప్పుదురు. కాదు, కాదు, పిల్లతల! ఎచ్చటను పనిదొరకక, యింటిపిల్ల—తన పెండ్లాము—తలయే గొరిగెనట! * * * షాపులో పద్దు చింపివేయించితి గదా? ఇంకమీద వలయునదెల్ల రొక్కమునకు పట్టణమునుండియే రప్పించుకొందును. త్రిపురసుందరి యనుగ్రహమున నిటుపైన కాసునకు గరవుండదు. ఏనాడుండెను? ఆగర్భశ్రీమంతుండనై పెరిగి హద్దులేని వితరణచేతను కొంతవఱకీ కూడని పీడచేతను రెండుమూడేండ్లుగ అప్పులపాలైతిని. కాని, అమ్మపూజ వ్యర్థమ్ముకాదను నానమ్మిక నేటికి నిజమైనది. అమ్మ యర్చనమ్మునే గదా యీ సారాయమ్ము రుచి యలవడి నానాటికి వర్ధిల్లినది? ఒప్పుకొనక తప్పదు, తప్పే - కాని, యిప్పుడు తప్పింప దరముకాదు. మేలుకీడులన్నిటి కాయమ్మదే భారము. ఇరువదేండ్ల నుండి నాయర్చ

నగౌని కాపాడిన జనని యిప్పుడు ముప్పున ముంచు
నా? ముంచదు ముంచదు. భవానికృపయుండిన
యీ భడవాలను భస్మముచేయు టెంతపాటిపని?
* * * ఒక్కకుంకయింటను పేరున
కైన దేవతార్చన లేదుగదా! వీరికి దైవభక్తి
యెక్కడిది? ముక్తి యెక్కడిది? తర్కడుగూడ ఈ
దరిద్రపు క్లబ్బులోజేరి చెడిపోయినాడు. మతము
మంటగలిపి వేదాంతులను వెక్కిరించుచున్నారు!
పండితులను ధిక్కరించు చున్నారు! పాటకులను
పరికించుటే లేదు. అభినయము నీతిబాహ్యమట!
జావళీలు వినదగదట! కృతులలో హెచ్చుసంగతు
లు కూడవట! పల్లవి పాడనే పనిలేదట! అహాహా
యెట్టి రసజ్ఞత యేర్పడినది! మొన్నటి తంజావూరి
పాటకునికి శంకరశాస్త్రి రెండు రూప్యములు చేత
బెట్టి మీకును మీపాటగును దండమని పంపివేసె
నట! అక్కడి కాతడు సరసుడే. నూట పదార్లు బ
హుమతి యొసగితినని రఘునాథుడు నన్ను పొడుపు
మాటలనెనట! పండితుల పట్టున నుందునని నాపై
నందఱికి గుఱ్ఱె. గ్రామ్యభాషయే మాటాడవలెనట.
వేంకటరత్నము వెఱ్ఱివాడట. గ్రంథము లామూ



లాంతము వాడుక మాటలనే రచియింపవలెనట! అ
ట్లే ముద్రింపవలెనట! భారతభాగవతములు సుబో
ధములుగావట, మృదుమధురశైలి గల వచనము
ను రుచిలేదట! వెల్లుల్లియు తిలపిష్టమునే విందట!
లబ్బున సంతోషముబ్బుట యబ్బురమా? * *
* * [పెట్టె తెఱచి కాగితముతీసి చూచుచు]—
నహావ్వా! యేమి చక్కని యక్కరములు! యెట్టి
ముద్దు మాటలు! ఈ విధవలందరు దీనిగని సిగ్గుపడ
వలయు. పండితురాలని బిరుదీయ దగియున్నది.
మహీంపతి మాటలు సత్యమే. అతడెంతో శ్రమ
పడి మనపట్టున పనిచేయకున్న ఈకాగిత మిప్పుడు
మనకు లభించియుండదు. ఈ సొమ్ములు నింత వేగి
రమువచ్చునని నమ్మను. అతనికి మనమీబోవ్వు బహు
మానము నిశ్చయముగ కష్టార్జితమే. * * ఆహా!
ఎంతధైర్యము! ఏమిస్వేచ్ఛావృత్తి! ఈ చిన్నది కలి
కాలపు కన్నెగ గాన్పింపదు. * * అమ్మా! గంగా!

ప్రవేశము — అంబన్న.

అం॥ —యెందుకు మావయ్యా! అదేంటి ఆ పెట్టిలోది
నాకు చూపించా?

దామో॥ — నిన్నెవ్వరు పిలిచిరి? అమ్మా! గంగాబాయి!

అం॥ — అది నాకోటియ్యా ?

దామో॥ — ఛీ ! ఆవల నుండుము.

ప్రవేశము — గంగ.

గంగ — యెందుకు, నాన్నగారూ !

దామో॥ — మీ అత్తయ్య నొక్కతూరి యిటురమ్మను.

గంగ — అత్తయ్య మడిగట్టుకు పూజ్జేసుకుంటున్నారు.

దామో॥ — పట్టు బట్టేగా, ఒకనిముసము వచ్చిపొమ్మని చెప్పు. [గంగ నిష్క్రమించును.

అం॥ — ఆ అడ్డబాస నాకియ్యా ?

దామో॥ — నోరు మూసికొని యుండకున్న — ఇదియేమో చూచితివా ? [అని బెత్తము చూపుచున్నాడు.

ప్రవేశము :— తుళశమ్మ, గంగ.

అం॥ — అమ్మా, అమ్మా ! మన్నగలోచ్చాయి ! నాకేదన్నావోటిప్పించా ?

తుళ॥ — తాకుతావు ! దూరంగా నుంచో !

దామో॥ — ఇదిగో ! యిక్కడ — ఇంకా దూరముగా ! అక్కడినుండి కదిలితివా — ఆఁ ! భద్రం ! — తుళశమ్మా ! ఇల్లివిగో మన సొమ్ములన్నియు ఈపెట్టెతోఁ గూడ శంకరశాస్త్రిగారివద్ది కంపిరి. వారు నన్ను పిలిపించి నాచేతికిచ్చిరి — యీకాగితముతోఁ గూడ.



తుళ॥ — కాగితమేమిటి ?

దామో॥ — ఇదిగో, చదివెద వినుము.

"మదరాసు, ముత్యాలపేట - తారీఖు.

శ్రీకందుకూరి ఆనందంపంతులుగారి కుమార్తె వాణీబాయి స్వబుద్ధిచే వ్రాసినది.— లేశము జ్ఞానములేని చిన్ననాఁడు సముద్దేశముతోడనె తలిదండ్రులు నాకు గావించిన పెండిలి నంగీకరింపనేరక, తన్మూలమున నాకు లభించిన సొమ్ములును వస్త్రములు నిందుతో నంపివేయుచున్నదానను. నాఁటఁగోలె నా గళమునఁ గట్టియున్న మంగళసూత్రము గూడఁ బంపితిని. ఎద్దియు వేఱొక్కరు కఱపిన బుద్ధిచేత నేఁ జేసినది కాదు. నా వరియింపని పతికి సతిని గాఁజాలనను నా మనోనిశ్చయమే యీకార్యమునకు నన్నుఁ బురికొల్పినది. ముమ్మాటి కిది సత్యము. నా యీప్రవర్తనమువలనఁ తలిదండ్రులు దుఃఖింతురుగాక, బంధుగులు నిందింతురుగాక, లోకులు నగుదురుగాక, న్యాయాధికృతులు నా స్వేచ్ఛా[illegible] నడ్డుదురుగాక, యేమి కాన[illegible] నా[illegible] నాకు నాయీ [illegible] సాక్షిగనుంచుకొని [illegible]నాను. జీవనాంశము [illegible] వలయునని [illegible]మెవ్వరిని...వేడఁబోను

సరేగదా, యిష్టపడనివా రిచ్చినను బుచ్చుకోనని చెప్పఁబనియుండదు. ఇట్లు నిష్కళంకబుద్ధితో—

కం॥ వాణీబాయి."

ఆభరణముల వివరము— * * ఒకటి, రెండు, మూడు, అన్నియు పన్రెండు సొమ్ములు.

తుళ॥—మనకథంతా వొక రామాయణంగా వుంది!

దామో॥—రామాయణమా? నాటకమను. కాని, అక్కా! ఏమి చక్కని యక్కరములమ్మా! ఈ యీడున నింత పాండిత్యముగల యాఁడుది మగని తోడ గాపురముసేయు టెక్కడది? ఆపుణ్యాత్ముడు శంకరశాస్త్రి మంచిమాటచెప్పి వ్యాజ్యము తప్పించెను. వ్యాజ్యమువలన నేమి ప్రయోజనము—రద్దిరవ్వ, పరువు ప్రతిష్ఠలెల్ల పాడగుటయుదక్క? మహీంపతి మనకీతరుణమున మంచిసాయము చేసెను. అతని కేమిచ్చినను మన ఋణము తీరదు. రెండువేలడిగెనుగాని వేయినిశ్చయమని మొన్న పెండ్లినాఁడు చెప్పితిని. * * * *

[తుళశమ్మతో మెల్లగా]—ఆచీరలపెట్టె అటనుండియే రయిలుస్టేషనుకు గొనిపోయి మహీంపతిసాని కంపితిని.



పాపము! బిడ్డలతల్లి, పసుగుసు కూతులకును బాచి యిచ్చి సంతోషించనిమ్ము.

తుళ॥—అయ్యో! అన్నినా? మీ బావగారు వెయ్యి రూపాయిలెట్టికొన్నారు.

దామో॥—బావగారిబుద్ధి బండలైనది! వేయిగాదు పదివేలయిననేమి, కట్టినవి మన మాటరాము. అవి మనయింటికిరారాదు. ఆభరణములంటివా?—అవి లక్ష్మీ స్వరూపములు. సువర్ణమునకు రత్నములకు అంటులేదు—ఇదిగో, చంద్రహారము! ఇది మీ ముత్యాలహారము

తుళ॥—మెళ్లోవేసుకో అమ్మా. [గంగ మెడలో వేసికొనును.

దామో॥—ఇద్దిగో వడ్డాణము. ఆహా! యెంత చక్కని మణులు!

తుళ॥—పెట్టుకొని చూడమ్మా.

గంగ॥—(పెట్టుకొని)—సరిగ్గావుంది!

దామో॥—ఇదిగో మంగళసూత్రము-మెడకు గట్టుకో.

తుళ॥—ఛీ! వద్దు, వాగాయిత్తంగా వుంటుంది.

దామో॥—మనకేమి? మఱింత మాంగల్యసిద్ధి గదా! అధికస్యాధికం బలం-అన్నారు. ఇదిగో కమ్మల జత. ఆహా! ఎట్లు మెఱయుచున్నది! ఎంత పెద్దది!

తుళ॥ — పట్టదు - చెవులు పెంచుకోవాలి.

దామో॥ — ఇదిగో బేసరి. ఇది ముక్కుపుడక. ఇది బులాకు. ఆహా! ఏమి దీని ప్రకాశము!

అం॥ — నా కియ్యా?

దామో॥ — అదిగో! ఆఁ! —

అం॥ — పోనీ! అన్నీ మీరే తీసుకోండి. [అని వెళ్లుచున్నాడు.

దామో॥ — ఇవిగో ఉంగరములు - రవ, పచ్చ, కెంపు - మూడు. ఇయ్యది రోజాపుష్పము. ఆహా! పుష్పమేయని తలచితి గదా!

తుళ॥ — మంచి రత్నాలు. రెండువేలో మూడువేలో గ్యాపకం లేదు.

దామో॥ — అన్నియు బదివేలుండవచ్చును.

తుళ॥ — పదిహేనువేలు. — అమ్మాయీ! నగలన్నీ ఆ పెట్టెలోబెట్టి బీర్వాలో భద్రంగాదాచుకో. జాగ్రత! [నగలపెట్టె తీసికొని గంగ నిష్క్రమించును.

దామో॥ — ఇక్కడికిది ముగిసినది. చీరలమాట మహీపతితో ముచ్చటింపకుమా-అతడు చిన్నబోవును. అతనివద్దనుండి జాబు వచ్చినది. నేడో రేపో రాగలడు. అచ్చట హైకోర్టులో పెద్దపెద్దలాయర్ల సలహా యడుగుమంటిని. మన ప్రస్తుతసందర్భ



ములలో ముందుముం దెవరివల్లను ఎట్టి తకరార్లును రాకుండ భూస్థితి సర్వము విక్రయించి మన యిరువురి పేర బ్యాంకిలో వడ్డికి వేసికొనుట సర్వోత్తమ మని నుడివిరట.

తుళ॥ — అయ్యో! యిల్లూ, వాకిలీ, అగ్రహారమూ, అన్నీనా?

దామో॥ — ఛీ దాగా. పిచ్చిదానవు, ఈయిల్లు చాలదటమ్మా? అంబన్న యదృష్టమింతంతా! పిచ్చివాడని, వెఱ్ఱివాడని, దాయాదులు తంటాలు పెట్టవచ్చునట.

తుళ॥ — యీగోడంతా నాకేం తెలుసును? నీయిష్టం, నువ్వేం జేశినాసరే. నీపిల్లనిచ్చింతర్వాత నీగ్గాదా యేమిటి? [తలుపు చప్పుడు వినబడును.

దామో॥ — ఎవరో తలుపుగొట్టుచున్నారు. మహీపతి యేమో? [అని వెళ్లుచున్నాడు.

(ప్రవేశము—మహీపతి (రైలుసంచితో).

తుళ॥ — అన్నగారికి వెయ్యేళ్లాయుస్సు! యిప్పుడే తమర్ని తల్చుకుంటున్నాము.

మహీ॥ — నిన్ననే వచ్చేదానికుంటిని — కూడా యాల పోవలా అని నిలిచి పోతిని. అబ్బా! వారింటనాకు చాలుచాలాయెను. — నగలు వచ్చి చేరిందో?

దామో॥ — ఆహా - తమ దయవల్ల. శాస్త్రిగారివద్దికి నిన్నటిదినమే వచ్చెనట. నేడు నన్ను పిలువనంపి నాచేతికిచ్చిరి.

మహీ॥ — సంతోషం! ట్రంకువచ్చెనో?

దామో॥ — ఆహా. — [తనలో] మన సాని యింటికంపి నది తెలియలేదుగద!

మహీ॥ — [సోఫామీద కూర్చుండి]—అబ్బా! నేటికిదా నా మనుసు చింతల్యాక వుంది.

దామో॥ — మామీది అనుగ్రహాము.

తుళ॥ — పొద్దెక్కింది, స్నానాలు చెయ్యండి. భోంచేశి మాట్లాడుకో వచ్చును. అన్నగారు రాత్రి భోంచేశారో లేదో. [అని లోనికి బోవుచున్నది.

దామో॥ — అవును, స్నానమునకు లెండి. మధ్యాహ్నము సిద్ధాంతిగారిని రమ్మంటిని. వారితో చాల పని యున్నది.

మహీ॥ — నాదెంత వక ఘట్కా! తాము కానియ్యండి తమకు జపం తపం—

దామో॥ — ఇదిగో అంతయు మూడు నిమిషములలో ముగింతును. [అని లోనికి బోవును.



మహీ॥ — చేశిన కార్యం గవ్వ కాసు ల్యాకపోయినా ముండావాడు నమ్మినాడు. కాకుంటే, పట్నంనించి యీవూరికీ యీవూరినించి పట్నానికీ తిరిగి అల్లాడేదానికి నా గ్యాచారమా?

వాకిట ప్రవేశము — బిచ్చపుపిల్ల.

బిచ్చపు పిల్ల — (పాడును).

“అమ్మమ్మా తెలుగుట్టా
ఓయమ్మా తెలుగుట్టా
అమ్మా శిన్నిగుడ్ల తేలే
అమ్మా వొంటికనుపు తేలే
అమ్మా నరానికెక్కిందే
అమ్మా నడుములో కెక్కిందే
అమ్మా బాయిలోపడుదూనా
అమ్మా గుంటలో పడుదూనా

మహీ॥ — ఛీ! యెవరే అది?

బిచ్చపు పిల్ల — “అమ్మా వూరికి వుత్తరానా
అమ్మా దారికి దచ్చినానా
అమ్మా మొలకమీసమోడే
అమ్మా నూగు మీసమోడే

మహీ॥ — శబాష్ !

[గంగ దోసిట బిచ్చముగొని వాకిటికి బోవును.]

బిచ్చపు పిల్ల — "అమ్మా కుంభర గుఱవయ్యో
అమ్మా పిల్చక రా పొయ్యో
అమ్మా పెరటితలుపు తియ్యో
అమ్మా వాకిలి గెడె యెయ్యో."

[గంగ బిచ్చముపెట్టి మరలి వచ్చును.]

మహీ॥ — అమ్మణ్ణి! యిదో యిదో! — *

[గంగ చిరునవ్వుతో పారిపోవును.

బిడ్డతల్లివాలె వుంది! నలుపుంటే వుండిపోనీ, బాగా ద్రఢంగా వుంది. * * * * * *

కొంచెముసేపుతాళి ప్రవేశము — గంగ.

గంగ — బాబుగారిని స్నానం చెయమంటున్నారు.

మహీ॥ — అమ్మణ్ణమణ్ణి ! వక్కముద్దు ! వఖ్ఖటి ! — [లేచి దగ్గరకుపోయి] — ఒక్కముద్దు పెట్టవూ !

గంగ — [వెనుకవైపుచూచి నవ్వుచు కొంచెము ముందునకు కదిలి సిగ్గు నభినయించును.]

మహీ — ఒక్క చిన్నిముద్దు ! [గంగ చేతులుసాచి సమీపింప] — అబ్బా ! — ఆహా! — ఇంకోటి! — [అని ముద్దిడి ఆలింగనము చేసికొనుచున్నాడు] — ఇకమీద



బాబూ అని పిలిస్తేపోనీ, మనుసులో మామా అనుకో ! — [అని మరల ముద్దుగొని విడుచుచున్నాడు.]

గంగ — స్నానానికి వేగిరం లెండి. [అని లోనికి బోవును.

మహీ॥ — ఎదుకదికే సంతోషించమన్నాడు. భలేచాలక్ పిల్ల !

[అని స్నానమునకు పోవుమ.]

---

రంగము ౨. — గుంటూరులో
దామోదరంపంతులు ఇల్లు — చావడిగది.

ప్రవేశము :— అంబన్న, రత్తయ్య — (బల్లమీద కూర్చుండి.)

—: o :—

రత్త॥ — యెక్కణ్ణయినా అడ్డబాసకోసం యేడుస్తారుట్రా ?

అం॥ — ఊం ! ఊం ! నాక్కావాలి.

రత్త॥ — నీ కన్ని కావాలి. ఆడ పుటకైనా పుట్టావూ ?

అం॥ — పోనీ - నాకో రెయిక తెచ్చిపెడతావ్ ?

రత్త॥ — ఛీ ! రవికెందుకురా ?

అం॥ — నాక్కావాలి-మావయ్య చూడకుండా తొడుక్కుంటా.

రత్త॥ — నీపెళ్లాంరవిక తొడుక్కో. యేదీ యిల్లా పిల్చుకురా, పాట చెప్పాలి.

అం॥ — యివాళ్ల చెప్పుకోదట - మయిపతిమాం వొచ్చాడు. [తలుపు చప్పుడు వినబడును] — కామయ్యగారు వాల్లు.

* * * * *

[అని వెళ్లుచున్నాడు. రత్తయ్యబట్ట ముసుగువెట్టికొని పండుకొనును.]

ప్రవేశము — కామయ్య.

కామ॥ — పంతులుగారేం జేస్తున్నారోయి?

అం॥ — భోం చేతున్నారు.

కామ॥ — అల్లాగైతే, సిద్ధాంతిగారు మూడుగంటలకొస్తామన్నారని చెప్పు. నేను పోవాలి. — ఆ పండుకుందెవరు?

అం॥ — [మెల్లగా] — రత్తయ్య.

కామ॥ — నువ్వొట్రా, రత్తిగా! ఊహూం! యిక్కడ జేరావుా!

రత్త॥ — [లేచి] — యిప్పుడే వచ్చానోయి. భోం చేస్తున్నారంటే కాస్త వొరిగాను, కునుకు పట్టింది.

కామ॥ — నేనవసరంగా పోవాలి. [అని పోవుచున్నాడు.

రత్త॥ — నేనూ వస్తున్నానోయి. [అని వెంబడించును.

[అంబన్న తలుపుమూసి లోనికిబోవును.]



రంగము ౫. — గుంటూరులో

దామోదరంపంతులు ఇల్లు — చావడి.

ప్రవేశము :— దామోదరంపంతులు, మహీపతి, సిద్ధాంతిగారు.

——: o :——

దామో॥ — వాక్స్థానమున బృహస్పతిగలడే, ప్రత్యక్షఫలము వ్యత్యాసమగుట కేమి కారణమందురు?

సిద్ధాం॥ — అది శని వీక్షణముచే గల్గినది. సౌమ్య, సాధారణ, విరోధికృత్తు, పరీధావి - యీ నాలుగు సంవత్సరములు పోనిండు. ప్రమాదీచలో బృహస్పతి నిజబలము మీరే చూడగలరు.

దామో॥ — మీకు గట్టి నమ్మకమే?

సిద్ధాం॥ — ఆహా — శాస్త్రమా, వట్టి —?

దామో॥ — అది సరే. ఇరువది రెండవ యేటగండము మాటేమందురు? అంగారకదోషము లేదంటిరదేమి? — „ధనే వ్యయేచ పాతాళే, జామిత్రే చాష్టమే కుజే" — అని గదా చెప్పియున్నాడు.

సిద్ధాం॥ నిజమే — అగస్త్య సంహిత అట్లే యున్నదిగాని, „అర్కేందు క్షేత్రజాతానాం। కుజదోషోనవిద్యతే" - అని వచనమున్నది. దాని ప్రకార మీజాత

కుని కంగారక దోషము చెప్పుట శుద్ధ అజ్ఞానము. అయినను పంతులుగారూ! ఇప్పుడేల తమ కీవిచారము? సందియమున్న నేచెప్పినచొప్పున గ్రహశాంతి గావింపుడు. హెచ్చుతగ్గు వచ్చిన ఈత్రోడా తీసివేయుదును.

దామో॥ — సిద్ధాంతిగారి వాక్కు ఋషివాక్కే. చిత్తము! తమకీ ప్రొద్దు చాల శ్రమ యిచ్చితిని. మాపై బరిపూర్ణానుగ్రహముతో దీనిని బరిగ్రహింప వలయు. [అని బహుమతి సహితముగ తాంబూలమిచ్చును.

సిద్ధాం॥ — దాన కర్ణులు, మీయింట నీవికి గొఱత యెన్నడు? ఇదే మాకు వేయినూట పదార్లు. శ్రీపరమేశ్వరార్పణమ్! [అని తాంబూలమును బహుమతియు గొనుచున్నాడు.] — ఇంక మాకనుజ్ఞా?

దామో॥ — చిత్తము, చిత్తము! — [సిద్ధాంతిగారు వెళ్లుచున్నారు.] — వీరు జ్యోతిశ్శాస్త్రమునందు మహాపండితులు. మన చక్రవర్తిగారి పట్టాభిషేకమును గూర్చి ——

మహీ॥ — వో! వుణ్ణు, వుణ్ణు.

దామో॥—కాని, మనమాట. పిట్టను పట్టగలమందువు?



మహీ॥ — చూడండిమీ! అయిదారుమాసం కుయ్యకుండా గమ్మున వుండండి. అప్పుడు మహీంపతి యిట్లాంటివాడని మీరే చెప్పబోతారు.

దామో॥ — యుక్తికి నీకెవ్వరు సరిలేరు. ముందుగ ఆ చిన్నవాని కచ్చటనుండి యుద్వాసన —— ?

మహీ॥ — ఒక్క ఛట్కా! దానికిదా యిప్పుడు బందరు పోతాను. వొక కార్యం తలపెట్టామూ అంటే కడావరకూ సాధించే తీరవలా.

దామో॥ — ఏమో, నాకు నమ్మకము చాలదు.

మహీ॥ — అంతదానా! ఆరుమాసంతాళి యీ మీసం గొరిగివెయ్యండి! వీడెవడు? హెం - ఎం - ఏం! మహీపతి అని తలవండి! పొద్దయింది, పోయివస్తాను.

దామో॥ — బందరునుండి యీ త్రోవనేగదా ?

మహీ॥ — అడగవలెనా? వుసురంతా మీతావునే వుంచిపోతాను. మీరెక్కడికీ పయనం లేదే ?

దామో॥ — గ్రామమునకు పోవలసినపని కొంచెమున్నది. అయిననేమి మాయిల్లే మీయిల్లు. నీవు వచ్చి కబురంపిన తత్క్షణము మరలి వత్తును.

మహీ॥ — పొద్దయింది, వస్తాను. [అని పోవుచున్నాడు

దామో॥ — మంచిది! — * * తగినవాడు దొరకి యున్నాడు. దైవానుగ్రహమున అన్నియు సలక్షణముగ నెరవేరిన ఈగాడిదెలకు వేయుగ చెప్పుదెబ్బ పనిలేదు. * కాని, అంగారకదోషము మాత్ర నన్ను పీడించుచునే యున్నది. ఈవిషయమున సిద్ధాంతిగారికన్న తెలిసినవా రెవ్వరు? కలికాలమున జ్యోతిషము ఫలించుటయు నెక్కడిది? అయిన, రెండువేలు వెచ్చపెట్టి గ్రహశాంతి చేయింతును. ఆపై నిది తలవ్రాలు. అయ్యది తప్పింపగలవారును చదువగలవారును లేరుగదా!

చం॥ అది యిది యంచు రేఖలను హస్తమునం గని మేలుకీడు సెప్పుదురుగ నెందఱో జనులు- పుట్టినకాలముం బట్టి సర్వముఁ విదితముగాఁగఁ జెట్టలకు నేర్తురు శాంతులుదెల్పఁ గొందఱుఁ నుదుటం గలట్టి వ్రాల్గను ఘనుండొకఁడేనియుఁ గానవచ్చునే॥

[అని లోనికి బోవుచున్నాడు.]



# ద్వితీయాంకము.

—:o:—

రంగము ౧. — చెన్నపట్టణము.

ఆనందంపంతులు ఇల్లు — మిద్దెచావడి.

ప్రవేశము :— [సోఫామీదకూర్చుండి] ఆనందంపంతులు, లలితాబాయి.

—:o:—

ఆనం॥ — ఎల్లప్పుడు ఈవిచారమునబడియుండిన మూలగూలుదువుసుమా! ఉన్న చింత చాల కదియొండు గూడ తెచ్చిపెట్టకుము.

లలి॥ — నాకు విచారమె లేదు. ఉన్నది నే బ్రదికియుండగ దీరునదియుగాదు. ఆ పాపిష్ఠిదైవము నిక్షేపమువంటి బిడ్డ నెత్తుకొనిపోయెగాని, నన్ను గొనిపోయిన ఏవిచారమును లేక యేగియుందు గదా! — [అని కండ్ల నీరుపెట్టుకొనుచున్నది.]

ఆనం॥ — [చేయిపట్టుకొని]—లలితా! ఏల మనదుఃఖమంతయు నిట్లు దిరుగదోడెదవు? నీకును నాకేనా యీ భూమిపై విచారము కలిగినది? మన మెంతటివారము? బరోడా రాజుకంటె గొప్పవారలమా, మైసూ

రు మహారాణికన్న మిన్నలమా? వారలకు గలిగిన విచారములు వింటివి గద! మఱి యేల యీ వెఱ్ఱిని బడియెదవు? మనబ్రదుకెంత, యీ ప్రపంచమున మన మెన్నో యంశము! భగవంతుడు సేయునదెల్ల యేదో మేలుకొఱకెగాని యెన్నడు గీడునకయ్యుండదు. అయినను మన మేమిచేయగలము? అల్పులము, అజ్ఞానులము, అన్నిట ఆయనయాజ్ఞకు లోబడి నడచుకొనవలయు వారము. రక్షించిన శిక్షించిన ఆయనయే గతి యని ఖేదము మానుట నీతిగదా!

లలి॥ — భగవంతుడు కలిగించిన విచార మట్లే మ్రింగుకొనవచ్చుగాని, మనము చేజేత బుద్ధిపూర్వకముగ దెచ్చుకొన్నది చిచ్చువలె రగులుచు — [అని దుఃఖపడుచున్నది.]

ఆనం॥ — అదిగో అదే యజ్ఞానము. మన చేతిమీదుగ జేయునది యొకటి కలదా? అంతయు నా భగవంతుని మాయయే - అందఱము నాతనిచేతి కీలుబొమ్మలమే. ఈ మాట గట్టిగ నమ్ముము.

లలి॥ — ఈ వేదాంతము చెప్పుట సులభమే. మగవారు మీ కే విచారము లుండును? పగ లంతయు పదిమందితోడ గలసి యేదోవ్యవహారమున బడియుండు



వారలకు మీ కేవిచారములును జ్ఞప్తికి రాజాలవు. ఎల్లప్పుడు నింటివద్దనుండెడి మా కెట్లు మరపువచ్చును? ఇంటికెవ్వరు వచ్చినను వాణీబాయి క్షేమ మారయువారె గదా! అందఱును దానిగని జాలి చెందువారలే. పేరంటమన్న పెద్దపులిగజూచెదను. అమ్మాయిని బంపుట తలవంపులేసరి, నేను బోవుటయును జచ్చినచావుగ నున్నది. దాని నప్పుడప్పుడు చూచువారె కన్నీరు గార్చుచుండ ఎల్లప్పుడుచూచు దానికి నా కెట్లు — [అని దుఃఖపడుచు] — అందులో దానిరూపము, దానిచదువు, సంగీతము — ఓ రామయ్య తండ్రీ! — [అని కండ్లుమూసికొని నిట్టూర్పు విడుచుచున్నది.]

వాణీ॥ — [తెరలో] — అమ్మా!

ఆనం॥ — [కండ్లుమూసికొని కన్నీరాపుకొనుచు, నిట్టూర్పు విడిచి] — శ్ శ్ శ్ — వెఱ్ఱిదానా! మనమేమి చెయ్యగలమే?

ప్రవేశము - వాణీబాయి.

వాణీ॥ — అమ్మా! యేమి వెఱ్ఱిదాననమ్మా? నాయనగారికి విచారములు లేవని యెంచితివా, ప్రొద్దున లేచి యీసోదె మొదలుపెట్టితివి? — నాయన[illegible]!

మీరుకూడ ఏమిటీలాగున? ఎన్నిసార్లు మొక్కి వక్కాణించితని, నిశ్చయముగ నా మనసున విచారమే లేదని!

ఆనం॥ — [వాణీబాయిని చేతదాకుచు, గద్గదస్వరముతో] — తల్లీ! నీవు విచారపడకున్నను నేజేసినతప్పు నన్ను—

లలి॥ — మీరేమి చేసితిరి? అంతయు ఆ పిచ్చిముండ మాయమ్మ కట్టుకొన్న పున్నెము.

ఆనం॥ — చచ్చి స్వర్గమున నున్నది, పాప మామెను నిందింపనేల? ఎవ్వరు చేసినదియు లేదు - సర్వము భగవదాజ్ఞయే.

వాణీ॥ — నాయనగారూ! ఏటికీ విచారపుమాటలు? భగవంతుని దూరవలసినదియు మీరు దుఃఖపడవలసినదియు నాకెద్దియు గాన్పింపదు. ఏనాడో నాకును మీకును దెలియక చేసిన పెండిలి కింతవంత పడనేల? ఆచింత యొక్కింతయు నాయంతరంగమున లేదని యెన్నెన్నిసార్లు తెల్పితిని? నాకు పెండిలియే వలదు - బ్రదికిన నాల్గుదినములు మీబిడ్డగ మీ చెంతనుంటయే నా సంతోషము.

లలి॥ — అయ్యో, యేమి పిచ్చిదానవమ్మా! కలకాలము [illegible]యనయు అమ్మయు బ్రతికియుందురా? మాఘట



ములు శాశ్వతములా? అటుపై నొంటరిగ నెట్లు జీవింతువు? ఇంత నీ జీవనమునకు స్థితిగతు లేర్పరచి పోగలరుగాని మీనాయనగారు—అయ్యో! నాసికాంతమున కుడికన్నదరుచు మృత్యువును సూచించుచున్నదిగదా! వలదన్న కొలది మంగళవారమునాడు మంగళ సూత్రమును దెగద్రెంచి యూపాడు నగలతోడ బంపివేసితివి. నాటనుండి యీరెండు వారములు నా కవశకునములే పొడకట్టుచున్నవి. మగడు బ్రదికియుండ మంగళసూత్రమును ద్రెంచుట మనకే—

వాణీ॥ — మరణ సూచకమని యెవ్వరేని చెప్పిరా? కావచ్చును - లోకానుభవమున కనుగుణ్యముగ దటస్థించిన మీకును నాచింత తొలగిపోను గదా?

లలి॥ — అమ్మా! — [అని దుఃఖముతో వాణిబాయిని తాకును.]

వాణీ॥ — కాకున్న నివి యేటిమాటలమ్మా? మంగళసూత్రము ద్రెంపివేసితినట, మరణ శకునము లగుపడుచున్నవట! దాని నిన్నాళ్లు నామెడను ధరించినదే గొప్ప తప్పిదము. మంగళవారమునాడు కాదు, నేటికి నాలుగు వారముల క్రిందట పెండిలివర్తమానము తెలిసిన నిముసమే దానిని ద్రెంపి నగలపెట్టెలో బెట్టి

తిని. ఇప్పుడు నీ యనుమానము సగము దీరెనా? ఇంక నన్ను గూర్చి చింతయు వంతయు మానుము. నాకు పెండిలి లేదన్న విచారము మీకేల? నావలన మీకెట్టి యపకీర్తియు రానీయను. ఆ మాట గట్టిగ నమ్ముడు.

లలి॥ — దొరసానివలె నుందువటమ్మా!

వాణీ॥ — అయిన నేమమ్మా? పెండ్లాడుటయే ఘనకార్యమా? పెండిలి మాని లోకోపకారముకై పాటుపడుచున్న స్త్రీపురుషులెందఱు లేరు? అట్లు పాటుపడిన వారి సచ్చరిత్రము లెన్నెన్ని లేవు? నన్ను బుత్రునిగ భావించి నావిషయమైన విచార మిటుపై మానగదమ్మా.

లలి॥ — ఎట్లు మానుదును తల్లీ! రేపు నాఘటముహారి యన్న, వెఱ్ఱిదానవు మీనాన్నగారి ప్రేమ యిట్లే నిల్చునటమ్మా? సవతి తల్లి పోటుపడి యింటనుండ జాలక యే క్రైస్తువారిలో జేరిపోవుదువో, యేయపకీర్తిపాలగుదువో, యని తలచితలచి విలపించెదను.

వాణీ॥ — అమ్మా! నీకడుపున బుట్టిన బిడ్డపై నిట్టికొఱమాలిన యనుమాన మేటికి బెట్టికొనియెదవు? నీ



తోడు! నేనెన్నటికి నీ కపకీర్తి కలిగింపనమ్మా! —

[అని తలిదండ్రులమధ్య గూర్చుండి తల్లిని గౌగిలించుకొనుచున్నది.]

ఆనం॥ — మాతల్లికి మారుతల్లిని దెచ్చిపెట్టితినా? ఈతల వేయిచెక్కలు గావలదా? — [అని వాణీబాయి శిరముపై తన శిరము జేర్చును.

[తెఱ దింపవలయును.]

---

రంగము ౨. — చెన్నపట్టణము.

ఆనందంపంతులు ఇల్లు - మిద్దెగది, బయలు.

ప్రవేశము :— వాణీబాయి.

——:o:——

వాణీ॥ — ఆహా! ఈశ్వరుడు పరమదయాపరుండు గదా! ఎంత చక్కని పండువెన్నెల! ఎట్టి చల్లనిగాలి! ఏమి నిశ్శబ్దానందము! అహాహా! ఎక్కడివీ కమ్మనితావులు? పూదోటలోని మల్లెల మహిమ కాబోలు — కాదు, కాదు, సంపంగి — కాదు, దవనము — ఔను అన్నియు జేరియున్నవి. * * ఇప్పుడయ్యది వేఱుగ నున్నదే — కడుంగడు నోహరించుచున్న దేమి వింత! * * ఓహో! తెలిసెదెలిసె. పనస చెట్టున బండుచుండు పండ్ల ఘుమఘుమ — అ - హా! * * ఇట్లనుభవింప నింద్రియవర్గము గల్పించి మా

నవకోటికి శక్తిజ్ఞానము లొసంగిన భగవంతు నెట్లు కొనియాడుదును! కొన్నిట నశక్తియు అజ్ఞానమును గల్పించినందుల కెంత వినుతింపవలయు! ఎన్నెన్నో విషయములు కనుట వినుట తెలిసికొనుట లేమిం జేసిగదా సుఖమబ్బుచున్నది! అన్నియు దెలిసిన — అయ్యో! యెట్టి విపత్తు! ఎన్ని విరోధములు! ఎట్టి విచారములు! * * నాతలిదండ్రు లిప్పుడు గాఢ నిద్ర దగిలి నా తెరగు తెలియనివారు-కాకున్న నాకైయెంత చింతకు లోనగుదురో! నాతలపు లెఱింగిన నెంతసంతాపమునకు పాల్పడుదురో! ఆహా! ఏ ధనమైన చూరగొనవచ్చుగాని మనోధన మంటిచూడనైన మానవులకు శక్తిలేదు గదా! నేటి యుదయమునాబుద్ధి యెట్లుండెను? నా తలిదండ్రులతో నేమని పల్కితి? పెండిలియే వలదు, నా కా విచారమే వాడమదంటిని. నాయనగారిచింత యొకింత దరిగెగాని అమ్మకు నా మాటలవలన లేశము సంతోషము జనియింపదయ్యె. స్త్రీ హృదయము స్త్రీలకెగదా దెలియవలయు! ఏ యీడున ఏకాలమున ఎద్దియెట్లు నియామకమో యది చెల్లుట క్రమమేగదా? బాల్యమున నిట్లు వైధవ్యముతో —



ఛీ! వివాహేచ్ఛ వదిలి — బ్రదుకుట దుస్తరమే. పట్టుపుట్టములు దాల్చి యడవుల కరిగి తపమున బడియున్న నేమో, పడుగురిలో దిరుగుచు ఏ యనుభవము గోఱంతగాకయున్న వివాహ వైరాగ్యమబ్బునా? కనుక నేయచ్చమాంబ చిఱుతనాడు యొల్లయు వయసున వివాహమును సుఖవర్గమున బేర్కొని యున్నది. ఎన్నడు కలియుదునో ఆమె యష్టావధాన శక్తినిగూర్చి నే విన్నది మొదలుగ నా రహస్యము గ్రహింపవలెనని యభిలాష మీఱినది.
* * చదువుచు గొంతప్రొద్దు వ్రాయుచు గొంత, పాడుచు గొంత సేపు వీణవాయింపున గొంత, చెలులతోడ ముచ్చటల నొకింత తడవును గడపితిని. వలదన్న వినక రెండు నెలలనుండి రాత్రిపూట వంటపని నేనే చేయుచుంటిని. ఆ యలపుచే నిన్ని నాళులు సులభముగ నిదుర యలవడుచుండె. నేడేల యింకను గునుకు రాకున్నది! * ఆహా! మాటిమాటికి నా హృదయము సుందరశాస్త్రి మాటలనే పాటించుచున్నది గదా! నేటిసాయంకాలమున జరిగిన విద్యార్థుల మీటింగు విశేషములు వినవలెనని మనసెంత తల్లడిల్లుచున్నది! ప్రొద్దు

పోవును నేటిరాత్రి యింటికి రానని యతడు చెప్పి
నప్పుడే యెళ్లేని రమ్మని యేల కోరనైతిని ? హృద
యమా ? నీ వృత్తి యెంత కపటము ! ఈ ప్రాణ
ము లాతనిపై నిలిపితినని యత డెఱుగునా ? ఎఱు
గడు. నాయనయు నెఱుంగడు. అమ్మ కనుమాన
ము గలిగియుండ వచ్చుగాని నావర్తనమ్మున నామె
కు నెఱనమ్మికయే. * * నా మనమున
మాత్రమేమికలదు ? ప్రియమా ? ప్రేమా ? మో
హమా ? విచారమా ? సుందరశాస్త్రిని గని యత
ని గుణసంపత్తి యెఱింగినవారి కతనియెడ బ్రీతియు
సంతోషము గల్గుట గొప్పా ? అట్టి వరుని బెండ్లి
యాడియుండిన — కాదు, అతనినే పెండ్లియాడ గ
లిగిన—సుఖము లభించునని యెంచుకొన్నుతప్పా?
* * దీనిని మించి యేమి తలంచితి ? తలంచినను
నాపిచ్చి భ్రమల కేమి ? విద్యార్థుల మీటింగులని,
స్త్రీల సభలని, పెద్దపెద్దల చర్చలని, క్రొత్త చట్ట
మని — సుందరశాస్త్రి కేల అంత యుత్సాహము !
అయ్యో, యేమి వెఱ్ఱి ! * * * ఆహా ! ఎ
డమకన్ను దురుచున్న దేమి సుఖము లభింపగలదో ?
అమ్మకు గుడికన్న దిరెనే, రెంటికి నెట్లు పొసగును ?



సరి సరి, నాకోర్కె ఫలించిన ఆపెకు దుఃఖమని సూ
చన ! * * ఛీఛీ ! ఎంత దుర్మార్గురాలను ! నా
సుఖమునకై యొరులను దుఃఖమున ముంచుటకన్న
నేనే యీ బ్రతుకు చాలించిన మేలుగదా ! ఎంత
విద్యయు జ్ఞానము నున్న నేమి అమ్మయు నాయనయు
తెగించి సంఘసంస్కరణమున కీకొనజాలరు. కావు
న నా తలంపులు — [గడియారము కొట్టుచున్నది] — ఒకటి,
రెండు. అబ్బా ! యింకను నిద్దుర రాకున్నదిగదా !
* * * ఈ పున్నమ చందురునిజూడ వసు
చరిత్రములోని పద్యములు జ్ఞప్తికి వచ్చుచున్నవి.
ఆ గాలి గుడియు నెంత యొప్పుచున్నది ! ఇంతకు
మున్ను వ్రాసిన పిచ్చిపద్యములకు దో డింకొకటి
యల్లుదునా ? పత్రికకు బద్యములు వ్రాసి యంపు
మని చంద్రాబాయి చంపుచున్నది గదా - కానీ,
యాపెకే చెల్లునట్లల్లెద. తలిదండ్రులు విద్యావం
తులు నీవును పండితురాలవని నన్ను మాటిమాటికి
స్తోత్రము చేసినందున కిది లాభము. సత్యవతీ పత్రి
కయందు సత్యమెగదా యుండవలెను ! మంచిది.
* * ఒక్కింతతడ వింద గూర్చుండెద — [అని
కుర్చీలో గూర్చుండి యాలోచించు చున్నది.] *

ఆహా! ఎంత వేగిరము కుదిరినది! ఇంకను యోజించిన చెడును — [అని లేచి గదిలోనికిబోయి మేజా బల్ల వద్ద గూర్చుండి, దీపము వెలిగించి వ్రాయుచున్నది ] * * * * *

చం॥ అమృతకరత్వముఞ్, విషధరాగ్రత, మిత్ర
పరాఙ్ముఖత్వముఞ్। హిమజనిత ప్రతాపము, ననేక
కళాచపల ప్రసిద్ధి, పూర్ణిమరమణీయసంపద ధరించి
భరించెడు నీకు నాకళంకముఞ్ బరివేషదోషమును
గల్గుట వింతయె? పూర్ణచంద్రమా!

* * * *

ఇందెన్ని వంకలున్నవో? ఉండనిమ్ము - వ్యాఖ్యానమేల? గోరువంకకు సరసార్థము గల్పించిన చంద్రాబాయికి శ్లేషలు దెల్పవలయునా? ఆపె వాక్కున గల యమృతధార నాకెట్లబ్బును? అబ్బిన నెన్నటికో! ఆపె రచించిన శతకము చదువ జదువ నానందబాష్పములుగురియు గదా! ఆహా, యెట్టి మృదు హృదయము! పాప మాపెకు గూడ సంతాపము గలిగె! ఇది కలియుగ విధానము గాబోలు! * * ఈతూరి యీ పద్యమొక్కటె యంపెద. ఎండమావులగూర్చి వ్రాసిన కందము లంపను — అవి



నాతాపమున జనించెనని గ్రహించి నెచ్చెలి విలపించును. * * * * *

క॥ తాపమధిక; మంతఃపరి
తాపమపారము; ప్రయాణదార్ఢ్యమఱెన్; పిపా
సాపీడయు దుస్సహ; మే
పాపమొ! మృగతృష్ణ యేల బాధించెడినో!

వలదు వలదు. ఈసారికి పున్నమచందురుని కొక చంపకము చాలును. ఇంక బోయి శయనించి యెట్లేని నిద్రనూరించెద.

[అని దీపమార్పి లోనికి బోవుచున్నది.]

## రంగము 3. — చెన్నపట్టణము, సముద్రతీరము.

ప్రవేశము:— మహీపతి (బెంచిమీద కూర్చుండి.)

—:o:—

మహీ॥ — యట్లా వాణ్ణి అరిచేతిలో బంబరంవాలె తిప్పుతును, ఆ శాస్త్రిరి దెగ్గిర మన ఆట నడిచిందేకాదు — ఆచ్చర్యం! వాడు మహీపతిని మింగేవాడుగాదా వున్నాడు - యే విదానకాన్నీ కొంచకూడ బయపడ [illegible] సుంగోసందేహమే పెట్టడే, యేంచెయ్యొచ్చు? [illegible] విస్వాసం - వుణ్ణో, వుణ్ణో. [illegible] లేసుగా విడిచుడిచేవాడు కాదు.

ఆపక్కన తోవ తగలకపోతే యీపక్కన తగులుతుంది, యిప్పుడు మునిగిందేమి? పోనురాను రేలు చార్జీదా లాబం! గుంటూరులో నిలిచిందానికి వొఖ్ఖప్రయోజనం కానకపాయె. నెలకులోగానే శమర్త! అదీవొఖమేలే అని పెట్టుకో. పిల్ల భలే చాలక్! నాడే బాబుదెగ్గిర పాట్టు చెప్పుకోవలానింది. సిద్ధాంతివచ్చునని యింకోనాటిక్కానీ అంటిని. ఇంకమీద యెన్నిసార్లు పోయిరావలనో. ఇక్కడ శాస్త్రి కొడుక్కు దారం కట్టేదే మంచియోచన. అదిదా అన్నింటికీ అనుకూలం. వాడు వొఖమ - ఆదిరి పిల్లకాయ, నన్నంతగా గవనించేది లేదు. కానీ, దానికీ తోవ కద్దు. ఎవ్వరా వచ్చేది? కుశాల్ రాం పంతులా? - వా! తల్చిందే వచ్చెను! — * *

ప్రవేశము — కుశాల్ రాం.

గుడీవ్నింగ్, పంతులూ!

కుశా॥ — గుడీవ్నింగ్!

మహీ॥ — చూచి నిండ దినాలాయెను. క్షేమందానా? నాడు లాకాలేజివద్ద చూచిందే —

కుశా॥ — ఆఁ! తర్వాత మీయింటికి రాలేదుటండీ — నేనూ, శర్మా, ప్రసాదం, ముగ్గురమ్మూ కలిసి.



మహీ॥ — [జ్ఞప్తికి దెచ్చుకొనుచు] — ఊఁ - ఉ!

కుశా॥ — ఆవేళ మీ పెద్దమ్మాయి అభినయంకూడా —

మహీ॥ — ఓ! — ఔనౌను. జ్ఞప్తికి వచ్చెను. క్షమించవలె. ఆబిడ్డ తమరిచ్చిన మోదరం కని సదా తమ మాటే తలవడం.

కుశా॥ — ఈమధ్యెక్కడా కనిపించారే కారు — మీకోసం వెతికాను కూడాను.

మహీ॥ — కొంచ పనితగిలి గ్రామాంతరం పోయివుంటిని. నిన్నదా వస్తిని. వచ్చిందే బిడ్డ తమ మాటేఅడిగా. రండిమీ పోదాము - ఆదివారందానే?

కుశా॥ — యివాళ్లగాదు, యింకో అదివారంవస్తాను, తప్పకుండా వస్తాను. [తనలో] — వట్టిచేచుల్తో వెడితే యేంలాభం? రేపో యెల్లుండో గాని యింటివద్దినుంచి మనీఆర్డర్రాదు.

మహీ॥ — ప్రెసాదంగారూ శర్మగారూ క్షేమందానా?

కుశా॥ — ఆహా, వాళ్లుకూడా రెండుమూడుసార్లు మీ మాటడిగారు. యివాళ్ల కనపడ్డారని చెబుతాను.

మహీ॥ — తమదయ! నిల్చున్నారే, కూచోండిమీ! యేంవిశేషాలు త్రేవే? [కుశాల్రాం కూర్చుండును.

కుశా॥ — యేమున్నాయి, మిథ్యునిచూడడమే విశేషం.

మహీ॥ — అంథా తమదయ! మన్న బుదవారం పిల్లకాయలంతా యేమో దడబిడలుగా మీటింగుచేశినారటనే — యేం సమాచారం?

కుశా॥ — ఓ, అదా? వాళ్ల మొహం, వాళ్ల మోరాని యెవడో నాయకుడుచేరి ఆడిస్తూవుంటే సరి ఆడతారు, వాళ్లకేమన్నా ఆలోచనా, వల్లకాడా? హిందూ డివోర్సు లెజిస్లేషన్ట, వాళ్లపిండంట, వఖ్ఖడూ అంటులో లాముక్క తెలిసిన వెధవ లేడు. అంథా ఆ సుందర శాస్త్రిగాడూ యింకా వోరిద్దరు పిచ్చి ముండావాళ్లూ చేసినపని.

మహీ॥ — అతడేమి అంత గెట్టిపిల్లకాయనో?

కుశా॥ — గట్టేమిటి వోశేమిటి, మీటింగులో సొగుసుగా మాట్లాడతాడు. పైగా మావలె గడేకారి వేషాలు వెయ్యడని రిఫార్మిస్సోసియేషన్ మెంబర్లకు వాడిమీద కొంచం గురి.

మహీ॥ - మీరూ మెంబరుదానే?

కుశా॥ — నేనన్నిటిలోనూ మెంబర్నే — లేకుంటే వా యేముంది? మీ యింటికివచ్చి నాచ్ చూస్తుంటే, అంటీనాచ్ లో మెంబర్ను గాన్సా?



మహీ॥—[వీపు చఱచుచు]—హే-హే-హే-హే-హే.

కుశా॥ — యింతేనా, విడోమారేజ్ లాటరీలోనే మెంబరుగాచేరాను-మన టర్న్ వచ్చినప్పుడు చూదాం పొమ్మని.

మహీ॥ —ఆదేం లాటరీ అండీ? టికెట్టెత్తినవాడు విడోను తీయవలనో?

కుశా॥ — ఔను.

మహీ॥ — అయితే, దాంట్లో నన్నుకూడా చేర్చండిమీ.

కుశా॥ — యేమనుకున్నా రేమిటి, పెళ్లి చేసుకోవలెను!

మహీ॥ — అమ్మాడి! అయితే పనిలేదు. [illegible]ండేదే చాలును. హోటల్ నుండికూడా తరిమేద[illegible]నా?

కుశా॥ — [నవ్వుచు] — ఆ లాటరీ [illegible] పోయింది — భయపడకండి.

మహీ — అంతదానా!

కుశా॥ — మరేం చెయ్యడం, మొదటిటర్న్ [illegible] ళ్లిచేసుకోను పొమ్మని మెంబర్ షిప్ రిజైన్ చేశాడు.

మహీ॥ — చబాష్!

కుశా॥ — టక్కరువె[illegible]డి మూలంగా లాటరీ డిజల్వాయిపోయింది.

మహీ॥—మీరు మెంబరం[illegible] మీకు [illegible]ండ్లాయెనుగా?

కుశా॥ — అది యేకుంక కనుక్కున్నాడు, మెళ్లో జంఝప్పోచ వఖ్ఖటే వుండడం చూచారుగాని?

మహీ॥ — అడాడాడా! వొంటి జందెమా!

కుశా॥ — యిదుగో చూడండి! యిదీ ముప్ఫయిముళ్లలో!

మహీ॥ — శివ శివా!

కుశా॥ — నామెళ్లో యిదన్నావుంది. మాహాస్టల్లో కొందరు వెధవలు జంధ్యాలు తీసి పెట్టెల్లోనే దాచి వుంచారు.

మహీ॥ — అడాడాడా! అయితే సంధ్యావందనం, గాయత్రీ—

కుశా॥ — సరి! అవుపోసరం వకటి పటితేగద! అసలు వస్తేగద!

మహీ॥ — డీ. జీ. ని పెట్టుకున్నా నేనే వాశిగావుందే!

కుశా॥ — వెయ్యిరెట్లు. మీాకేం, మహారాజులాగ గాంధర్వ వివాహం చేసుకున్నారు — దాంట్లో తప్పేముంది?

మహీ॥ — హె - హె - హె - హె —[అని వీపు చఱచుచు]— అయితే వొఖపని చెయ్యండి మీా. నాచ్ గర్ల్ లాటకీ వొఖటి యేర్పాటుచేశి మనకు అల్లుళ్లు సంపారించండిమీా. పదిముండలున్నారు - పా



వళ్లు కుట్టించేదానికే నిండా సంకటపడతాను.

కుశా॥ — దానికేం భాగ్యం? కావలసినంతముంది. వాళ్లూ గాంధర్వవివాహమే చేసుకుంటూ మంట్రారు.

మహీ॥ — గెట్టికాన్ పయ్యు! — [అని వీపుచఱచి] — పొద్దయింది, పోదాము. ట్రాం దుడ్డుకూడా కొంచు రాలేదు.

కుశా॥ — నాదగ్గిరుంది, యిస్తా పుచ్చుకోండి. [అని జేబునుండి రూపాయతీసి యిచ్చును.]

మహీ॥ — యింత యేలండీ?

కుశా॥ — ఫర్వాలేదు తీసుకోండీ — మనకు భేదమేమిటి?

మహీ॥ — [రూపాయ జేబులో వేసికొనుచు] — పోదాము. అయితే ఆ సుందరశాస్త్రిని చల్లగా నాచ్‌లోకి దింపండిమీా.

కుశా॥ — అది మనతరంగాదు. వాడు అసాధ్యుడు.

మహీ॥ — చీకటయింది పోదాము. [అని లేచును.]

కుశా॥ — [లేచుచు] — తిరుగా ఆదివారం దర్శనం.

మహీ॥ — యీా తావునే — [అని షేక్ హాండిచ్చుచు] — గుడ్ నైట్!

కుశా॥ — గుడ్ నైట్! డోంట్ ఫర్‌గెట్!

[అని యిద్దరు చెరియొకదారిని బోవుదురు.]

రంగము ర. — చెన్నపట్టణము, కాలేజి హాస్టెల్

ప్రవేశము :— కుశాల్ రాం.

—:o:—

కుశా॥ — భారతంలో వూరికే అనలేదు — "వెలది జూదంబు పానంబు" అని. నిన్నమట్టుకు నిన్న వొట్టెట్టుకుంటిని, యిఖమీద వెళ్లగూడదని. ఆది, సోమ, మంగళ, బుధ — నాలుగు రోజులైనా తిన్నగా కాలేదు, రేపు శలవని అప్పిడే కాలు సాగిస్తిని — యింకా బాగుపడేదేమిటి? యిక్కడికి రెండేళ్లయింది, యీ యేడుకూడా ఫువరం అయితే యిఖ శకండ్ గ్రేడ్ ప్లీడరీకి యేడవ్వాలిశిందే! యేమో వెలగబెడతానని పాపము యింటివద్దినుంచి పాతికె రూపాయిలు మణీ ఆర్డరుపంపిరి. వాళ్లు పంపడంలేదని వ్రాస్తే జక్కిస్తూ అత్తవారుకూడా పాతికె పంపిరి. కష్టానికి కట్టమూలాగి యిల్లాకూడా దోచడం నాకే న్యాయంగావుండలేదు. కాన్‌షెన్సుకు విరోధమైనపని యెన్నడూ చెయ్యగూడదు. యీ బైలో ముష్ఫయి అప్పిడే యెగిరిపోయినాయి! ఛీ ఛీ! యీ పని యివాళ్లతో కట్టిపెట్టి, రేపు శివరాత్రి గనుక



రేపటినించి కొత్తబుద్ధి స్థిరపరుచుకొంటాను. ప్రమాణంగా నేటితో ఆఖరే. పైగా "తాజెడ్డకోతి" అన్నమాట నిజంచేస్తూ వున్నాను. ప్రసాదం కేమి, వాడు నన్ను తలదన్నినవాడేగాని శర్తనుకూడాయిందులోకి దింపడంఛాలాఅక్రమం. [జేబుగడియారము తీసిచూచి.

ఓ! టిజ్ ఆల్రెడీ ఫయివ్ — ప్రసాదం! ఏమోయి! చీరె శింగారించడమే పదేళ్లు పట్టేటట్టుందే!

ప్రవేశము - ప్రసాదము.

అబ్బా! యెంతసేపోయి?

ప్రసా॥ — నేను డ్రెస్సేసుకుని పావుగంటైంది. శర్తకోసం కనిపెట్టుకున్నాను. అతను దొడ్డికెళ్లి యిప్పుడే వచ్చాడు. యెంత పిల్చినా రానన్నాడు. ముత్యాలపేటకు వెడతాట్ట.

కుశా॥ — వాణ్ణిచూస్తే యిందుకే నాకు వొళ్లుమండుకొచ్చేది - పదిమాట్లు సాగదీసి బతిమాలించుకుంటాడు. ఎప్పుడూ ప్రెకాషనేగాని సిన్‌సెరిటీ అన్నమాటలేదు. మనదగ్గిర శ్రీరంగనీతులు చెబుతాడుగాని, యిప్పుడు ముత్యాలపేటకు యెందుకు వెడతాడనుకున్నావు? అక్కడ ఆనందంపంతులింట్లో పెద్ద యెత్తు వేస్తూవున్నాడు - అంతమాత్రం వూహించు

కోగలను. వెయ్యేసీ వెయ్యేసీ, సుందరశాస్త్రిగాడు
వీడినోట కరక్కాయ గొడతాడులే.

ప్రసా॥ — చీ చీ! అదిగాదోయి. ఆనందంపంతులుభార్యా
నెల్లాళ్లబట్టీ ఖాయలాతో మంచమ్మీదుండట. చూ
చిరాకపోతే బాగుండదని వెళుతూవున్నాడు. నేను
కూడా మైలాపూరు వెళుదామా అని యోచిస్తు
న్నాను.

కుశా॥ — నీకోసం మీ అత్తయ్య బెంగెట్టుకుందా యే
మిటి? డామిట్! యెవ్వరూ రాకపోయినా సరే
నేను వెడతాను. యివాళ్లతో ఆఖరూ. యింకో
సారి మీరు బతిమాలినా రాను. మీ టవుతామని
ప్రామిస్ చేసి మాటతప్పగూడదనిగాని, యీ నెల్లో
యిది మూడోసారని నేనూ లెక్క పెట్టుకుంటూనే
వున్నాను. యీసంగీతాల్లో పడిపోతే పరీక్షగుడ్డెట్టి
ముప్పెత్తుకోవలిశిందే. కాసీ, రేపు హాలిడేగదా —
[జేబు గడియారము తీసిచూచి] — ఫయివ్ కే బీచి
వద్ద వుంటామని చెపితిమి, నౌటిజ్ నియర్లీ హాఫ్ పా
స్టుఫయివ్! యేం, నీవైనా వస్తావా రావా, వకటే
మాట చెప్పు.



ప్రసా॥ — ఓ యబ్బ! యింతలోనే యెంతకోపమోయి?
వొకవేళ నీవు పిలిస్తే వస్తాడేమో —

కుశా॥ — హాంగ్ హిమ్! లెట్ స్ గో. హిల్ బీ వెయిటిం
గ్ ఫరస్

[ఇద్దఱూ నిష్క్రమింతురు.]

---

రంగము ౫. — చెన్నపట్టణము.

ఆనందంపంతులు ఇల్లు, మిద్దెవసారా.

ప్రవేశము :— ఆనందంపంతులు.

—:o:—

ఆనం॥ — నేటికి రెండు నెలలకుమున్నే యీ తీరున గష్ట
ము సమకూరునని యనుమానపడితిని. ఆహా! యేమి
విచిత్రము! మనోవ్యాధికి మందు లేదన్నమాట వట్టి
దికాదు. డాక్టరుగారు ఆంగ్లేయ వైద్యశాస్త్రము
ననుసరించి తాముచేయగూడినది మఱేమియు లేదని
నుడివిరి. వ్యాధిస్వభావమే యిట్టిదని బోధపడ లేద
నిరి. వారిమాటనుబట్టి శివరాత్రి గడచుటయే వట్టి
దని తలచితిని. గడచినపిమ్మటగూడ పదిదినములు వ
రుసగా శివరాత్రులే యయ్యెగదా! ఆయుర్వేద
మార్తాండులువచ్చి చూచినది మొదలు గుణము

కనుపించుచున్న దేమి వింతో? ఆంగ్లేయవైద్యము నేర్చుకొనుచున్నను ఆయుర్వేదమే సర్వోత్తమమని వాదించుచు సుందరశాస్త్రి మొదటినుండి భిషగ్మణి గారినే పిలిపించుమని పోరెను. కాని నేనే డాక్టరు గారిపై గురి విడువజాలనైతిని. నేడు గడువవలెనని గదా పండితులవారు సెలవిచ్చిరి. దైవానుగ్రహమువలన ఈ నాల్గుదినములనుండి మేలుగుణము లే కాన్పించె నింక భయములేదను నమ్మికపుట్టినది. కన్నకొడుకుకన్న మిన్నగ పాటుపడుచున్న సుందరశాస్త్రి ఋణమెట్లు తీరును? అయ్యో! అమ్మాయి నిచ్చి పెండిలిసేసియుండిన ఏ విచారము గల్గక యెంతసుఖప్రదముగా, సంతోషకరముగా, నుండును! కాని, యిప్పుడు నోటికి తాళము వేసికొనవలయును. మనసా! విలపించకు. * * కర్మము గడువంగరాదు గద యెవ్వరికిన్ * * ఆహా! నేటియుదయము బుడుబుడుక్కలవాడేమేమి వింత మాటలు పల్కిపోయెను! ఎన్నిమూలల వర్తమానములు వాక్రుచ్చెను! ఈయింటిగ్రహపాటు తొలగిపోయి సంతోషము లభించునని వచించెనే, ప్రాతగుడ్డకై పలికిన ప్రీతిపలుకులని తెలిసియు నాయుల్ల



మెంత రంజిల్లినది! ఏమో, బిడ్డలవాక్కును బిచ్చగాండ్రవాక్కును ఆదిశక్తి నిలిచి పలికిన బలుకవచ్చుగదా! అల్పజ్ఞానముచేతను అజ్ఞానముచేతను ఇది కలదిది లేదని చెప్పుదురేగాని యీలోకమున సర్వజ్ఞుడెవ్వడు గలడు? ఇద్దరు పెండ్లాల మగల కిరికటమని పలికె— చట్టముమాట యెవ్వరేని చెప్పియుండబోలు. చెప్పనేల? హిందూ స్త్రీలు సేయబోవు మహాసభమాట వినని ప్రాణియు గలదా? * * క్రొత్త చట్టమువలన మేలేయని పలికి యేమేమో విపత్తులు వాక్రుచ్చె, నవి నిజమగునా? లోకులసొమ్ము కోట్లకొలది మునిగిపోవుననియు, ప్రాణులు ఘోషిల్లుననియు, రయిలుబండి యాపదలనియు, ప్రజానాశమనియు - అబ్బా! వాని వాక్కులు తలచిననే గగుర్పాటు పొడముచున్నది గదా! * * ఛీ ఛీ! బిచ్చగాని పిచ్చిమాటలను విశ్వసించి యేటికీ విచారము? వాకిట బండి చప్పుడైనది, పండితులవారు కారుగద? రాహుకాలము రాకమునుపే— నాలుగు గంటలకే— వచ్చెదమని సెలవిచ్చిరి. సంశయమేల, వారే. అదిగో సుందరశాస్త్రి గబగబ మెట్లెక్కి వచ్చుచున్నాడు.

ప్రవేశము :— సుందరశాస్త్రి.

సుం॥ — భిషజ్మణిగారు వేంచేసియున్నారు, ఒక్కనిమిషము తాము క్రిందికి దయచేయవలెను.

ఆనం॥ — ఆహా, ఇదిగో వచ్చితిని.

[ఇద్దఱును క్రిందికి పోవుదురు.]

---

## రంగము ౬. — చెన్నపట్టణము

## ఆనందంపంతులు ఇల్లు, క్రిందిచావడి.

ప్రవేశము :— లలితాబాయి (మంచముపై బండుకొని), వాణీబాయి (మంచముప్రక్క గుర్చీపై గూర్చుండి), ఆనందంపంతులు, భిషజ్మణి (రెండవప్రక్క గుర్చీలపై గూర్చుండి), సుందరశాస్త్రి (నిలువబడి).

భిష॥ — పంతులవారిటుపై నిశ్చింతగా నుండవచ్చును. దుర్గుణములన్నియు గట్టువడి ఆరోగ్యనాడి యాడుచున్నది. ఇంక బలము పట్టుట యొక్కటే కొఱత. దానికీ సువర్ణపానకము పరమహంసక్రియ.

ఆనం — అంతయు తమ యనుగ్రహము. దుఃఖసముద్రమున మునిగిపోనున్న వారలము తమదయవల్ల దరిగాంచితిమి.

భిష॥— ఆ పరమాత్ముని కృపగాని మనయత్నమెంతటిది? [చిరునవ్వుతో]— భిషక్కులుసేయునది భేషజమని సుప్రసిద్ధమేగదా!



ఆనం॥ — తమబోటి భిషజ్ఞులు కేవలము పరమాత్మస్వరూపులని భావించెద. క్రొత్తసంవత్సరము లేదని నిశ్చయించికొన్న మాకు నూతనజీవమొసంగితిరి.

వాణీ॥ — ఈ సువర్ణపానకమిచ్చిన యరగంటసేపటికా—

భిష॥ — అమ్మణీ! అది సుందరశాస్త్రి జాగ్రత్తసేయును. [సుందరశాస్త్రి చెవిలో]— ప్రస్తుతమొక్కటి చాలును. కొంచెము పాలలోగాని కాఫీలోగాని కలిపి.

సుం॥ — చిత్తము.

లలి॥ — అయ్యో! - అది - పుచ్చుకో - లేను - ఇదొకటే - చాలును.

భిష॥ — అమ్మగారు నన్ను మన్నించి వారము పదిదినములు చెప్పినట్లు వినవలయును. పిమ్మట మీయిష్టము. నేడు పున్నమగదా, యిక రెండువారములకు — సంవత్సరాదికి — మీయింట నంతయు సంతోషకరముగా నుండును, నామాటచూడుండి.—[లేచును] — ఇంక నాకనుజ్ఞ దయసేయవలయు.

లలి॥ — చిత్తము. [అని నమస్కరించుచున్నది.]

సుం॥ — ఇదిగో తమరిచ్చిన నాడీ రత్నమాల. ఈనాడీభేదములజ్ఞానము నాబోటి సామాన్యులకీ జన్మమున లభింపజాలదని తలచెదను.

భిష॥ — అంతయు ననుభవసాధ్యము. మొదలు మీ పండితు లిన్ని నాడీభేదములున్నవని యొప్పుకొనజాలరు గదా? నాడివలన కాలువాపును శూలనొప్పియు నెట్లు తెలియగూడునని కేరడము సేతురు! మా గురువులవారు మయిసూరు మహారాజులవారికి వారము దినములలో గోరుచుట్టు లేచునని నాడి పరీక్షవల్లనే చెప్పి మెప్పువడసిరి. మహానుభావులు అట్టివారు మఱి పుట్టబోరు.

సుం॥ — ఆయుర్వేద మర్మము లాత్మకు దెలియదగినవే గాని స్థూల పరీక్షకు గోచరములు కాజాలవు.

భిష॥ — నాయనా! నిశ్చయమైనమాట పల్కితివి. మనశాస్త్రమునకును ఆంగ్లేయశాస్త్రమునకునుగల తారతమ్యమే అది. అద్దములు, గొట్టములు, కత్తులును లేక వారిచేతులు గట్టువడును. కాని, వారి మార్గము సుబోధమును సులభమునగుటచే అనేక విషయములలో ఆయుర్వేదమున కాంగ్లేయవైద్యమత్యంతసహకారిగా నుండును. అది నీయట్టి బుద్ధిమంతుడు సాధించవలయు కార్యము.

సుం॥ — చిత్తము, పరీక్షయైన పిమ్మట తమవద్దనే —

భిష॥ — పరమసంతోషము! — ఇంక బోవలయు. అమ్మ



ణ్ణీ! పోయివచ్చెద! అమ్మా! సంతోషముగా నుండుడు. పంతులవారూ! సెలవు. [అని పోవుచున్నాడు.

ఆనం॥ — చిత్తము, చిత్తము!

వాణీ॥ — బాబుగారికి వందనములు!

భిష॥ — [వెనుకకుతిరిగి] — తల్లీ! చల్లగా వర్ధిల్లుము!

[తెఱ దింపవలయును.]

# తృతీయాంకము.

—:o:—

రంగము ౧.— చెన్నపట్టణము.

ఆనందంపంతులు ఇల్లు - మిద్దెబయలు.

ప్రవేశము :— వాణీబాయి.

—:o:—

వాణీ॥ — ఆహా! ఈ మిద్దెపైనిలిచి చంద్రోదయ మిట్లు కన్నులార గనుట యెంతటి గొప్పభాగ్యము! సముద్రగర్భమునుండి పసిబాలునివలె జన్మించిన యీ చందురు డెంత సుందరుడు! తనివిదీర కవుగిట గ్రుచ్చిన నెట్టి సౌఖ్యమబ్బునో గదా! ఏమి యీ లే వెన్నెలనగవు! దుర్భరమని చంద్రాబాయి పద్యమునవర్ణించె నది వట్టిమాట కాదు. * * ఔరా, చంద్రా! చంద్రాబాయి! ప్రాణసఖీ! ఈ నీప్రతిమ నాకసమునగని యెంత పరితపించుచుందువో! * రేపటిదినము నీవు వచ్చినతోడనే — కాదు, కాదు, మాపటివేళ—ఈ మాయవెన్నెలలో—మన మొండొరుల గాగిట బిగించికొని—అబ్బా! తలచుటయు



నెంత దుర్భరము! చంద్రమా! నేడే రమ్మని వ్రాసితి గదా, యేలరావైతివి? మఱచితి, మఱచితి. నరసమ్మకై నరసాపురముననిలుతునంటివి. కానిమ్ము, రేపు మీయిరువుర గని యానందింతు గదా! ఎల్లుండి సభలో నెందరెందఱో సుందరీమణుల దర్శనమబ్బును - ఆహా, యెట్టి సుదినము! ఎంతెంతదూరము నుండి యెంతటి విద్వాంసురాండ్రు రానున్నారు! వారి విద్యలో నాకు గల చదువెన్నోభాగము! అయ్యో! నన్నేల ప్రసంగించువారిలో జేర్చియున్నారు? నేనేల యొప్పుకొంటిని? * * ఆయాప్రదేశములనుండి దాదాపు మున్నూరుమంది ప్రతినిధులు వత్తురనియు, ఇంతవరకు రెండువేలమంది స్త్రీలు టిక్కట్లు తెప్పించుకొనిరనియు గదా పత్రికయందున్నది? * [పత్రిక విప్పిచూచుచు] — బందరు స్త్రీసమాజము వారందరు రానున్నారట. విద్యాభిలాషయందు బురుషులదలదన్నునతరుణీమణులలో మున్నుగ నెన్నదగిన సదమల చరిత్రలు, వారినిగూర్చి పిచ్చిమాట లుచ్చరించిననోళ్లు పుచ్చిపోవలయు. రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము, శ్రీకాకుళము, బరంపురము, గుంటూరు, నెల్లూరు, బళ్లారి

అనంతపురము, గుడివాడ, బాపట్ల, వంగవోలు, తుని, పిఠాపురము, పార్వతీపురము, సోంపేట, రాజాము, బెజవాడ, యేలూరు, తంజావూరు, చిత్తూరు, నరసారావుపేట, బెంగుళూరు, మైసూరు, నాగపూరు, శికింద్రాబాదు, శిరువంచ—ఆహా! యెంతెంత దూరమునుండి! * * జానకీబాయమ్మ, లక్ష్మీబాయమ్మ, సీతాబాయమ్మ, రాజ్యలక్ష్మమ్మ, రాజేశ్వరమ్మ, సరస్వతమ్మ,ఆదెమ్మ, జోగమ్మ, సింగమ్మ, బంగారమ్మ, కనకమ్మ, కాంతమ్మ, కామేశ్వరమ్మ, వరాలమ్మ, భారతమ్మ, శాంతాబాయమ్మ, శేషమ్మ, త్రిపురసుందరమ్మ, సీతాదేవమ్మ, మహాలక్ష్మమ్మ, వరలక్ష్మమ్మ, ఏరలక్ష్మమ్మ, మీనాక్షమ్మ, లక్ష్మీనరసమ్మ, వెంకటనరసమ్మ, సుభద్రమ్మ, సుబ్బమ్మ, సూరమ్మ, కృష్ణమ్మ, కావేరమ్మ, దుర్గాంబ, శారదాంబ, అచ్చమాంబ, మాణిక్యాంబ, కమలాబాయి, రాజాబాయి, రామాబాయి, కౌసల్యాబాయి, చంద్రమతి, సత్యవతి, సరోజిని—ఓహో! యెందఱెందఱు విద్వాంసురాండ్రు! వీరియెదుట నేనేమి ప్రసంగింపగలను? ఇప్పుడే భయమొదవుచున్నది, యెల్లుండి సభలో నెట్లుండునో! కానీ, ఒప్పుకొన్న పిమ్మట తప్పదుగదా! * * *



కడచిన పూర్ణిమకు మును పందఱము ఆపత్సాగరమున మునిగియుంట నీ మహాసభకు పోగల భాగ్యము నాకు లేదనియే తలంచితిని. కాని, దైవానుగ్రహమున సంవత్సరాదిని సంతోషము గంటిమి. నేడీ పండువెన్నెలలో భోజనము తలపెట్టుచుంటి, దానికి విఘ్నమయ్యె—ఐనను చింత లేదు. * * * * * సుందరశాస్త్రిని తక్షణము రమ్మని తండ్రిగారు తంతియంపిరేల? ఈ నాలుగైదు దినములు కాలేజికి సెలవని రమ్మనిరా? పెండిలి విషయమా? స్త్రీమహాసభదినమున అతడిచ్చటనుండగూడదనియా? తండ్రిగారియాజ్ఞనుల్లంఘింపజాలక గాని, యతనికి పోవలెననియే లేదు. నా ప్రసంగమును పత్రికమూలమున నే చదివి సంతోషింపవలెనని యతడు పల్కినపుడు మనోభావము వెలువడెగదా, వివాహ విషయమున తండ్రిగారిబలవంతమునకు లోబడజాలనని యతడు మాటలతో నుడువవలెనా అతడు వచ్చిన పిమ్మట నాతలపెట్టిన వెన్నెలవిందు — అపుడు చంద్రాబాయిగూడ —

ప్రవేశము:—లలితాబాయి.

అమ్మా! నాయనగారు వచ్చిరా?

లలి॥—సుందరమును బంపుటకు రైలువద్దికిబోయియుండురు. వచ్చు వేళమైనది. ఆ పత్రికలో జూచితివా, యెందఱెందఱు విద్వాంసురాండ్రు వచ్చుచున్నారో రేపటి మహాసభకు? చిన్నదానవు, నీ ప్రసంగము వలదన్న మానవుగదా, నీ స్వానుభవమును గూర్చి మాటాడినట్లు తలంతురనియు నెంచవు.

వాణీ॥—తలచిన నేమమ్మా, నేజేసిన తప్పిదమేదియు లేదుగదా? అనుభవమువలన చెప్పగలదే సర్వోత్తమమని నన్ను నొక వక్తగ నియమించిరి-తప్పించుకొనుట ధర్మమా? చంద్రాబాయి ప్రసంగించుటకు వెనుదీయునా? అమ్మలక్కల పొడుపుమాటలకు వెఱచునా?

లలి॥—ఏమో, నీ యిష్టము తల్లీ! మీతండ్రియు నీ మాటేసూటిగ——

వాణీ॥—వారుగో, నాయనగారు.

ప్రవేశము:—ఆనందంపంతులు.

ఆనం॥—సుందరము నంపివచ్చితి. అతడు పోలేకపోయెను-ఎల్లుండి సభ విశేషములు వెంటనే వినజాలనని విచారము కాబోలు. తంతియేల యంపిరో తెలియకున్నది, నిన్నటిదినము జాబే వ్రాసియుండవచ్చు.



లలి॥—వివాహవిషయమని తలచెదను.

ఆనం॥—నాకు నదియే తోచినది. అమలాపురమునుండి ఆంజనేయశాస్త్రిగారు కుటుంబసహితముగ బందరునకు వచ్చియున్నారట, వారి చిన్నది యెక్కువ చక్కనిదని వింటిని.

వాణీ॥—అతని యదృష్టము.

లలి॥—అంజనేయశాస్త్రిగారు కట్నమునకు వెనుదీయువారునుగారు.

ఆనం॥—అదేమో వామనశాస్త్రిగారు కట్నమే కోరలేదట. సుందర మొప్పుకొనుట యొక్కటే యవశిష్టమట.

లలి॥—సరి! ఆయవశిష్టము తీరినట్టే.

వాణీ॥—అటులేని,యతడు పెండ్లికొడుకుగనే రానోపు.

ఆనం॥—అది యిప్పుడెక్కడ? ఆదివారమే యతడు మరలి రావలయు-సోమవారమున కాలేజికలదు.

లలి॥—ఆహా! యెంతచక్కని వెన్నెల!

ఆనం॥—నేడిచ్చటనే భోజనము చేసిన——

వాణీ॥—అబ్బబ్బా! వలదు. ఈమంచున అమ్మకు శైత్యము చేయును. రండు, లోనికి బోవుదము.

[అందఱు నిష్క్రమింతురు.]

రంగము ౨. — చెన్నపట్టణము, ఒకయింటివాకిలి.

ప్రవేశము :—గురవడు.

—:o:—

గుర॥ — [తలుపుగొట్టుచు] — వోలెంకే! వొల్లెంకే! దీనెమ్మా చిగ్గొయ్యా! దీనికి దినాం యిదే తెగులు. యింకా గుండెయ్యా లేదు, పండక నిదరోతాది — [తిరుగా తలుపుగొట్టుచు] — వొల్లెంకే! సచ్చావాయేంటే? కొట్టిగొట్టి శెయ్యాగిలింది.

వెంకి — [తెరలో] — వో రా మణిసి? నోరడిపోయిందా యేంటి తలుపిరగ నూకుతుండారు?

గుర॥ — యెంచేపేయి?

వెంకి — [తెరలో] వోరా మణిసి?

గుర॥ — వోరా? నీయెమ్మా మొగుడు.

వెంకి — [తెరలో] — ఆడు శిన్నప్పిడే సచ్చాడు.

గుర॥ — ఆడుగాడా డెనకటోడు.

వెంకి — ఆడూసెత్తినోడి జిమ్మడాలి! [తలుపుతీయును.]

గుర॥ — యెంచేశావ్? గెడేస్క లో నేం శేత్తుండావు? శౌశికూశి నోర్మినిగిండి.

వెంకి — యేం శేత్తుండానా, రంకుమోణ్ణిట్టుకోని పండుకొండాను. దినాం అనుమానంతో సస్తావు!



గుర॥ — [క్రింద చతికిలబడుచు] — యీయామెన్నెల్లోనీడ నూకుందాయి, గెంజేడరు మట్రాయే - ఆకలి బాగబాగ చాశేస్కమోతోందది.

వెంకి — నూకలేడియి గెంజికి? వోదుగ్గాడైనా యెంకిశేతిలో మెటితేగా గెంజొస్తాది? యెంకేమో వోటెంటా పనిశేగూడదు - గురవడేమో కూలిదుడ్లు తాగెయ్యాలి!

గుర॥ — వోశి నీయెమ్రి గాలా! పెమానికెంగా యియా లోసుక్కంటితే ఆ శెప్పునగొట్టే. యిదుగో కాలు రూపాయా—పరకరూపాయా — వఖణా — [వెంకి చేతికిచ్చును] — పువ్వాక్కయినా వోదుడ్డెత్తుకోలేదేయి. అయిదరాబాకం అమ్మోరొచ్చినయీల — అదేం జనా లేంజనాలు - యీ దంతాపూలే! యెంకి మెల్లో దండేశి ముద్దాడదామని మణుచైందే యిదుగో తెచ్చాను - వోమూరాజు తాంబూళంకూడా యిచ్చాడు. [పూలదండ యియ్యబోవును.

వెంకి — వుండుండు, గెంజెతుకొత్తాను [లోనికి బోవును.

గుర॥ — లంజకాపే [illegible] యే శినడు, గుర[illegible] త్తే ఆల్సెంగావొత్తే [illegible] గె డేస్క పం[illegible]

ప్రవేశము :—వెంకి [గంజిగిన్నెతో].

వెంకి — రుక్కినెమ్మోరి పున్నెమాని కూత్తి నూకలిత్తే గెంజికాచాను. [అని గంజిగిన్నె ముందిడును.

గుర॥ — నీగెంజేడేయి?

వెంకి — నాకేడుండొస్తాది? నూతాగితే అంతేచాన.

గుర॥ — యెంకికి లేకుండునా! యెంకిముంగలా, యెనకాల గురవడూ కాదంటేయి? [అని గంజిగిన్నె వెంకి ముందిడును.

వెంకి — అమ్మోరోముద్ద బువ్వెడితే తినొచ్చాను. నాకొద్దు, నూతాగే.

గుర॥ — నూతాక్కుంటే నాకూవొద్దు. యీగెంటెడు తాగే. [అని గరిటెడు గంజి వెంకినోట బోయును.

వెంకి — చాల్ చాన! యికనూతాగే.

గుర॥ — [గంజిత్రాగి] — వోలేయెంకే, యియ్యాలేం తమాచా యేంతమాచా — యీదండ మెల్లోయేచుకో. [అని పూదండ యిచ్చును.

వెంకి — మెల్లోవొద్దు, కొప్పులెట్టుకుంటా. [అని కొప్పున బెట్టుకొనును.

గుర॥ — అదేంతమాచా, యేంతమాచా! పీపిలుపార్కంతా అమ్మోర్లే! శీనాబజారంతాఅమ్మోర్లే! బీశంతా అమ్మోర్లే! యేడుండొచ్చారో — అందరూ సదువుకుండమ్మోర్లేనంట.



వెంకి — రుక్కినెమ్మోరు శెప్పినట్టు ఆరుసదివిశేశిన మెక్కేవేంది? యెంకిదారికే వత్తుండారు. యీరణ్ణొదిలేశి యెంకేమో గురవణ్ణి కట్టుకుంది. అలిమేలేమో గురవణ్ణొదిలేశి శెంచణ్ణి తోడకపోయింది. దీనికి సట్టమెందుకు సరుకోరెందుకు - మణుచాడగలిత్తే ఆడే సట్టం.

గుర॥ — కాదే, గౌనేరుదొర గట్టి పట్టుపట్టుండాడంట. సట్టమైతేనేమో అమ్మోర్లను మనోళ్లుకూడా బబిలీగా కట్టుకోవొచ్చంట - అప్పుడు మాలచ్చిమ్మగారికి యే ఆచ్చేపం వుండదు.

వెంకి॥ — అమ్మోర్లను మనోళ్లు గట్టుకుంటే, అయ్యోర్లేమో మనోళ్లనంటుకుంటారు.

గుర॥ — యిప్పుడూరుకుండారంటే? అచ్చయ్యోర్ని అగ్గిలో మడేశినా పాపముంటదా శెప్పూ.

వెంకి — నీకుండ దొమ్మేయిది - అనుమానంతోనే సస్తావు. నాకేం కూకో, తెల్లార్లూ యిడే కూకో. [అని లోనికిబోయి తలుపు వేసికొను చున్నది.

గుర॥ — నిన్నల్లేదేయి — గడేకేయి. వోలెంకే! వొల్లెంకే! తాంబూళమేస్కాని చరుసోలాడుదామేయి! రాయేయి.

పాట — ముఖారి.

తియ్యోతలుపూ — తియ్యో-ఎ-ఏ తలుపూ — తియ్యో
తలుపూ॥

౧. అయ్యోర్లమాటాలు - ఆశిగాల కంటేనీ।
శెయ్యాలో శెయ్యేశి - శెప్పనే వోలెంకీ॥ తి॥

౨. యియ్యాల యెన్నెల - యెంతో బాగుండాది।
చగ్గాటలాడుదాంయి - చరుసోలాడుదాంయి॥
తియ్యో॥

3. శీరాగట్టిరాయే - శేరీముద్దాడుదాంయి।
వోంకోరుసుట్టీ - పెక్కాకేస్కుందాంయి॥
తియ్యో॥

౪. యెంకిలేకపోతే - యెన్నెలశీకాటే।
యింకలేశిరాయే - యెందుకే అలిగేవూ॥
తియ్యో॥

౫. జరిజీలు కలకటేర్లు — శానా వుండేరుగాని।
గురవప్ప బాగ్గేము — గొప్పోరి కేడాదే॥
తియ్యో॥

ప్రవేశము:—వెంకి (మంచిచీరగట్టికొని.)

గుర॥ — రాయే, శిలకా! వోల్లోకిరాయే! శీరగట్టాం చావంటే — యేం వగలాడే, యేంవగలోడే! పో



యినపానం లేశొచ్చిందే - వోల్లోకి రాయే! —
[అని చేతులు సాచును. వెంకి చిఱునగవుతో గురవనియొడిలో గూర్చుండ ఇరువురు నాలింగనము చేసికొందురు.]



[తెరదించవలయును.]

రంగము 3. — చెన్నపట్టణము, ఒక పెద్దహాలు.

ప్రవేశము:—సరోజని (ప్రెసిడెంటు), చంద్రాబాయి, వాణీబాయి, సీతాబాయి, కమలాబాయి, రుక్మిణమ్మ, దుర్గమ్మ, లక్ష్మీ నరసమ్మ, మఱికొందఱు స్త్రీలు.

—:o:—

వాణీ॥ — కావున, అమ్మలారా! ఈ విషయమున మన మందఱ మేకాభిప్రాయులమై దొరతనమువారికితోడ్పడుట విధిగా దలంపవలయును. దానివలన మేలొనగూడుట కొక్కింతయు సందియములేదు. చిరకాలమునుండి యీదేశపులచ్చి ముసుగువెట్టికొనిమూలగూర్చుండియున్నది. స్త్రీవిద్యయు స్త్రీల స్వేచ్ఛావృత్తియు పురాణకథలైనవి. భార్యలు బానిసలైరి. బిడ్డలు బానిసబిడ్డలైరని వేఱుగ జెప్పవలెనా? స్త్రీపురుషులొండొరుల తోడ్పాటులేకను స్థితియందుండ లేరనుట స్పష్టము * * [వినుండి! వినుండి!] — ఏ దేశమందును ఉయ్యాల యూపులగు

వృద్ధి క్షీణములలో స్త్రీ పురుషులు జంటగ గూడి
యుంట సృష్టివిధానము. క్రిందుమీదుగ చిరకాల
ముండజాలరు సరిగదా, యది శ్రేయస్కరమును
గాదు. నేడు స్త్రీలధోగతి పాలైరిపో, పురుషుల
కేమి పరువు, యేమి లాభము ? ఎక్కడి సౌఖ్యము
ఏటిసంతోషము, అది యెంత కాలము నిలుచును ?
స్త్రీలకు జ్ఞానసంపద యుండిననే పరంపరగ బురు
షుల జ్ఞానమునకు వికాసము గల్గును. స్త్రీలకు స్వా
తంత్ర్యముండిననే పురుషుల స్వాతంత్ర్యము నామ
కార్థము గాకయుండును. స్త్రీ హృదయములు రం
జిల్లి సంతసిల్లిననే పురుషులకు సదా సంతోషము
నిలుచును. అప్పుడే వారలు సర్వకార్యములు జక్క
గ నిర్వహించి యీ దేశమును తొంటి గౌరవస్థితి
యందుంచగలరు. మనదేశమాతయు మంచుకొం
డల మఱుగునడాగి కన్నీరు మున్నీరుగ గార్పక
కన్నుల పండువుగ నలుగడల నాట్యము సేయుచు
ఆనందతరంగములు సిమ్ముచుండును. అక్కలారా!
మఱొక్కమాట. మనకన్న నెన్నోమడుంగు లె
క్కుడుగ జ్ఞానముగల్గియున్న మన యన్నలు దం
డ్రులు నీదేశమెల్లెడల సభలుసేసి చట్టమును గట్టిగ



గోరుచుండ మనము వలదనుటయు నూరకుంటయు
నెంతో సంతాపకరముగదా ! దూరదృష్టి చాలక,
యీ శాసనమునమేలు రాజాలదనువారల మాట
పాటించుట ముమ్మాటికి మూఢభావము. అన్నలా
రా! నాయీపలుకన్నెముగ నెంచక నన్నుమన్నిం
చి ప్రస్తుత విషయమున మీరెల్లరు నేక గ్రీవముగ
నభిప్రాయమొసగి దేశాభివృద్ధికి దోడ్పడి కీర్తిదెచ్చి
కొనుడు ! (విశేషము చప్పట్లు.)

సరో॥ — [లేచి] — సభ్యులారా ! ప్రస్తుతము మనము నిర్ణ
యింపబూనిన విషయమున రెండుభాగములున్నవి.
(౧) బహుభార్యానిషేధము (౨) వివాహబంధ వి
మోచనము. ఈ రెండవభాగము వర్జనీయమని రు
క్మిణమ్మగారి మార్పు. దానినిగూర్చి సాధకబాధక
ములు వినియున్నారు గదా —

రుక్మి॥ — [లేచి] — అగ్రాసనాధిపతిగారును సభ్యులు నం
గీకరించినపక్షమున నామార్పునువదులుకొందును.
వివాహబంధ విమోచనశక్తి యేర్పడుటవలన గొ
న్నికొన్ని బాధకము లుండునట్లు నాకు దోచియుం
డెనుగాని, చంద్రాబాయిగారి సయుక్తివాదముచే
నవి మాయమై పోయినవి. మఱియు వాణీబాయి

వాగమృత మహిమచే నాబుద్ధికిప్పుడు మైకముగమ్మి
యున్నది. కావున నామార్పును వదులుకొన సెల
వు వేడికొందును. (అంగీకారపు చప్పట్లు.)

సరో॥ — మఱి యెవ్వరును మార్పులు గోరువారు లేరేని.

వెంకాయమ్మ — [హాలులోనుండి లేచి] — అద్దద్దద్దద్దా! వస్తున్నా.

ప్రవేశము — వెంకాయమ్మ.

వెంకా॥ — [ప్రెసిడెంటుగారి కెదుఱుగానిలిచి] — చిన్నలంతా చెప్ప
డమైందిగదా, పెద్దముండను నన్నుకూడా రొండు
ముక్కలు చెప్పనియ్యండి.

హాలులోనుండి కొందఱు — ఆర్డర్! ఆర్డర్!

వెంకా॥ — [సభవారి కెదుఱుగదిరిగి] — మీ యింగిరీ
షుమాటలు నాకు తెలియవు. అదేమిటో తెనుగు
తో చెప్పండి. (సభలో నవ్వు)

కమ॥ — మార్పేమో ముందుగ దెలుపనిది మాటాడుట
క్రమమేనాయని నాయాక్షేపణ.

వెంకా॥ — నన్నాక్షేపిస్తే నేనూ ఫదింత లాక్షేపించగ
లను. నాచాంత గాలేకపోలేదు. నేనూ కాస్త పె
ద్దమనుషుల్లోనే పుట్టి పెరిగాను.

(మాట్లాడండి, మాట్లాడండి - అని సభలో కేకలు)

కమ॥॥ మిమ్మాక్షేపించుట కాదండీ——



వెంకా॥ — ఆక్షేపిస్తేమాత్రం నాకేం భయమనుకున్నా
రా యేమిటి? (సభలో నవ్వు)

సరో॥ — సభ్యులారా! ప్రసంగపు నిబంధన లొక్కింత
వదిలి యీయమ సెప్పబోవునది సాంతముగ విను
ట ప్రశస్తమని తలచెదను. (ఔను, ఔను - అని సభలో కేకలు)
అవ్వగారూ! ఇక మీ ప్రసంగము కానిండు. మీ
పేరు?—

వెంకా॥ — పేరా? నాపేరు వెంకమ్మ. మాఆయన వుయి
ల్లో వెంకాయమ్మని రాశిపోయినారు. అంతమట్టు
గు సంతోషిస్తున్నాను—వారి పుణ్యమాని బాయో
టి తగిలించి పోలేదు. [సభలో నవ్వు]. మావూరు బా
పట్ల. పుట్టిల్లు బందరుదగ్గిరఘంటసాల. నావొడ్డూ
పొడుగూజూచి మొగాణ్ణనుకుంటారేమో, యిదు
గో యీ శాలువు మునుగుతీశేస్తే ఆసందేహం తీరి
పోతుంది — [అని శాలువ తీయబోవును. వద్దు, వ
ద్దు - అని సభలో కేకలు] - యిట్టాంటి మహాసభ
లోకి బోడితలతో రాగూడదనే యిదోటి మునుగె
ట్టుకొచ్చాను. [సభలో నవ్వు] - ముశిలిముండను నా
మాటకేంగాని యీ సభలో వారందరూ నాకళ్లకు
మొగాళ్లుగానే కనపడుతున్నారు — [సభలో నవ్వు] —

చొక్కాలూ టోపీలు వెలిశి నాగరీకంమీరడంచా
త మునుపటి మోస్తరు మారిపోయిందని వూహిం
చుకుంటూను— [తిరుగా సభలో నవ్వు]. వినండి, వినకపోం
డి, నే చెప్పదల్చింది ముఖ్యంగా మూడేమాటలు.
నేనూ మీ శ్రేయస్సు కోరేదాన్నే గాని మిమ్మన్నా
క్షేపించి మీ యెత్నాలు పడగొట్టేదాన్ని గాను.
ఆమాట ఘట్టిగా నమ్మండి. ఝాము శేపట్నించి మీ
ప్రెసంగాలన్నీ శ్రద్ధగా విన్నాను. అదుగో ఆ పెద్ద
మ్మాయి మాటలూ విన్నాను — యీ చిన్నమ్మాయి
పలుకులూ విన్నాను. అన్నీ నిజమే అని వొప్పుకుం
టాను. నలుసంతకూడా అబద్ధం లేదు. * * పె
ళ్లాం వుండగా మళ్లీ పెళ్లి చేసుగోవడం మొగముం
డా కొడుకులకేం పెద్దరోగమా? అమ్మాయిల్లారా!
నాకూ యిక్కడికి అరవయ్యోపడి నిండొచ్చింది.
పెళ్లాంవుండగా మళ్లీ పెళ్లి జేసుకున్నవాళ్లలో సు
ఖపడి చచ్చినవాళ్లొక్కళ్లూ నాకళ్లబడలేదు. అస
లోదాన్ని సుఖపెట్టి చచ్చారుగనక నా యిద్దరు కా
వాల్ను? యెక్కడోగాదు. మావాళ్లల్లోనే పెళ్లి
మీద పెళ్లి చేసుకుని ముగ్గురు పెద్ద మనుషులు
మూడో నెల్రాకమునుపే ముక్తిపొందారు. మా



పెత్తల్లికూతురు - ఆవెడ మహాపతివ్రతల్లో చెప్పా
ల్సినమనిషి— మొగుడు వట్టిపోకిరీ - యెంభయ్యేళ్లొ
చ్చిందాకా అక్కడాక్కడా ఛడదిరిగి, అప్పుడు
సంతానం కోసం వో పల్లెటూళ్లో చిన్నముండను
పెళ్లి చేసుక్కున్నాడు!—[సభలో ఛీ ఛీ ధ్వనులు].
ఛీ ఛీ అంటే యేం కార్యం — మా అక్కయ్యంత
కంటె మెక్కువపనే జేశింది. ఆ శుభవర్తమానం
చెవిని పడడంతోనే భజంత్రీవాణ్ణి పిలిపించి నా
వలె చేయించుకుంది — [సభలో నవ్వు - శబాష్,
శబాష్ - అని కేకలు]. ఫది రోజుల్లోగానే అతడూ
మాటదక్కించుకున్నాడు. [సభలో నవ్వు]. యి
ట్లాంటి వెన్నో చూచాను, అవన్నీ యిప్పుడెందుగ్గ
నక? యిద్దరు పెళ్లాలు కూడదన్నారు. ఆమాట
బాగానేవుంది. కాని, అమ్మాయిల్లారా! పెళ్లిళ్లు
రద్దుచేసుకోవడమ్మాట నామనసు కేమ్మీ నచ్చలేదు.
ఆకూర్చున్నిల్లాలాక్షేపణ చెయ్యడమూ విన్నాను,
అమ్మాయిలు సమాధానం జెప్పడమూ విన్నాను.
విన్నాగానీ నాకు నచ్చనేలేదు. అమ్మాయిలు చెప్పి
నమాట లేమో నాస్తవమే. యవడో అంట్లవెధ
వకు చిన్నతనంలోనే కట్టిపెట్టి, చస్తే వాడితోచా

వు, లేకుంటే పుని స్త్రీగాక వెధవాగాక బతకమన
డం ఛాలా అన్యాయమే - వొప్పుగుంటాను. కాని,
మీరు ఛేశిన ఆలోచన యంథమాత్రం దానికి తగ్గ
క్రియ కానేకాదు. పెద్దదాన్ని, అనుభవంచాత్త
చెబుతాను, నామాట రవ్వంత మీ చెవిని బెట్టండి.
పెళ్ళిళ్లు రద్దుచేసుకోవడమనేది కేవలం తెలివి త
క్కువాలోచన. రద్దుచేసుకుంటే యెవరికి నష్టం?
మొగాడికేం యెన్నేళ్లు మీదబడ్డా దుంగముక్క
ల్లే వుంటాడు, కడుపా కానుపా, నలభయ్యేళ్లవాణ్ణి
కూడా వయసుపిల్ల మోహిస్తుంది. నలభయ్యేళ్ల
ఆడదాన్ని యేముండాకొడుకు వరించి పెళ్లిచేసు
కుంటాడో నాకు చెప్పండి. మొగుడుగ్గోపమొ
చ్చి పెళ్లి రద్దుచేసుకుంటే నలభయేళ్ల ముండగతి
యేంగాను? నలభయ్యేళ్లదాకా ఖర్లేదు, పాతి
కేళ్ల —

చంద్రా॥ — తగినకారణములు లేనిది —

వెంకా॥ — వోశ్నీ కారణారూ గీరణాలూ అట్టాకట్టిపెట్టు
దూ! అంథాన్యాయం వెలగబడుతూందా యేమి
టి? నేనూ శాస్త్రం చూచాను. మా పెద్ద మేనమా
మకూతురు కోర్టు మునసబుగారికి, శిభారస్జేశి యె



న్నో అబద్ధాలు సుబద్ధాలుగానూ సుబద్ధాలు అబ
ద్ధాలుగానూ చేయించింది — [సభలో నవ్వు]. అం
థా న్యాయం దగలడితే యిది కలియుగమే కాదు.
కారణాలమాట కట్టిపెట్టి, పెద్దదాన్ని నే జెప్పేది కా
స్త చెవిని బెట్టండి. ముక్కుపచ్చలారని పిల్లలు మీ
కేం దెలుసు? ముక్కుకు సూటిగా చూసుకుంటారు-
వెనకటి సౌఖ్యం చూసుకోరు. యీకాలప్పిల్లలు
మరీ పదహారేళ్లకే ముశిలాళ్లయి పోతున్నార్గదా,
పెళ్లిళ్లు రద్దుచేసుకోవడంకన్న తెలివితక్కువేమ
న్నా వుంటుందా చెప్పండి. మీ పిచ్చాలోచనలు
కట్టిపెట్టి నేజెప్పేది వినండి— వుభయులకూ న్యాయ
మైనమాట చెబుతాను. అసలు మీర్రెండాలోచ
న్లు పెట్టుగున్నారుగాని వక్కటేచాల్ను. అది మీ
బుద్ధికి తోచనేలేదు. దానితో అన్ని రోగాలు కుది
రి అన్ని కష్టాలూ తీరిపోతాయి. మొగాళ్లు యెంత
మంది పెళ్లాలను చేసుకుంటే యేంబోయింది వొద్ద
నావద్దు కద్దనావద్దు పెళ్లిళ్లు రద్దుజేసుకోవడం తల
పెట్టావద్దు - ఆడవాళ్లుకూడా యిష్టమొచ్చినంత
మందిని కట్టుకోవచ్చునని యేర్పరుచుకుంటే దాని
తో రోగం తక్కినకుదురుతుంది — [సభలో నవ్వు].

మీరు నవ్వుతున్నారు గాని దానివల్లొచ్చే లాభం చూచుకోలేదు. మొగాడు పెళ్లామ్మీద పెళ్లాన్ని కట్టుకోవడమేమి, ఆడది మొగుడుండగా యింకోణ్ణి గట్టుకోకపోవడమేమి - అన్యాయం నాకు జెప్పండి. [తిరుగా సభలో నవ్వు]. చట్టం చట్టం అంటారు, ముందర దీనికి చట్టం యేర్పాటు చేయించండి. [తిరుగా నవ్వు]. దాన్తో అన్ని చిక్కులూ తీరిపోతాయి. [సభలో మఱిమఱి నవ్వు]. మీరు విన్నారో లేదో ఆడ మలియాళంలో అదేపద్ధతిట. అక్కడ వెభిచారమే లేదుట! వెధవ్వాళ్లే లేరుట! — [సభలో విరామము లేక నవ్వు]. మీరూరికే నవ్వుతూంటే యిక నా మొహం నేజెప్పేదేమిటి? చెప్పీ యేంఫలం? యే చట్టం యేర్పడ్డా అనుభవించేవాళ్లు మీరుగాని నేను గానుగదా —

[అని క్రింది సభ్యులలోకి బోవ నుద్యుక్తురాలగును. సభలో చప్పట్లు.]

రుక్మి॥ — [వెంకాయమ్మ చేయిపట్టుకొని]— అవ్వగారూ! ఇచ్చట గూర్చుండుడు.

[అని తనప్రక్క కుర్చీపై గూర్చుండబెట్టును.

సరో॥ — ప్రస్తుత విషయమును గూర్చి ప్రసంగింపగోరి మఱి నలువురు సభ్యులు తమ పేర్లంపియున్నారు.—



[మణిబంధమున గడియారమును చూచి] — ఇప్పుడు రెండున్నరయైనది. ఇట విరమించి మఱలమూడు గంటలకు సభగూడుదము.

[అందఱు నిష్క్రమింతురు.]

రంగము ౪. — చెన్నపట్టణము

ఆనందంపంతులు ఇల్లు, మిద్దెవసారా.

ప్రవేశము :— వాణీబాయి (సోఫామీద గూర్చుండి టోపీయల్లుచు), సుందరశాస్త్రి (చేతబుస్తకముతో.)

——: o :——

సుంద॥ — చదివి చదివి మావారికందరికి వినిపించితిని.

వాణీ॥ — ఈస్తోత్రపాఠమున జెడిపోవుదునని భయమొదవుచున్నది.

సుంద॥ — అంతపున్నెము నే జేసికొన్నగదా?

వాణీ॥ — [చిఱునవ్వుతో] — చెడిపోవుటయు సంతోషమా!

సుంద॥ — కాదా? స్నేహితురాలిని జెఱుపుటకన్న ——

వాణీ॥ — సరిసరి! చంద్రాబాయియున్న, మాటకు పది మాటలు బనులుచెప్పును. ఆదివారమువరకుండుమని యెంత బలవంతముచేసినను నిలువదయ్యె.

సుంద॥ — నిన్న నేవచ్చుట యెఱిగి పారిపోయెను గాబోలు.

వాణీ॥ — చదివిన జాణ, యామె భయపడునది కాదు.

సుంద॥ — ఔనౌ నిది కలికాలము, పురుషులే భయపడ వలయును!

వాణీ॥ — ఎవరికి?

సుంద॥ — స్త్రీలకు.

వాణీ॥ — స్త్రీలేమి పెద్దపులులా? ఎవరిని మ్రింగిరి?

సుంద॥ — మ్రింగిన జంతయే యుండదు.

వాణీ॥ — మఱి వారివిషయమున నింత శ్రమంపడి పిన్నలు బెద్దలుగూడ ఏల సభలు సేయుచున్నారు?

సుంద॥ — అదియొక వెఱ్ఱి.

వాణీ॥ — దానివలన రాగలముప్పు ముందుగ దెలిసికోన జాలరు గాబోలు?

సుంద॥ — నాఁపుట్టివానికి తెలిసేయున్నది.

వాణీ॥ — ఇంక విచారమేల?

సుంద॥ — రాగలది వచ్చువరకు విచారమెకదా?

వాణీః — వేసవి సెలవుల కింటికిబోయిన నన్ని విచారములు తీరును.

సుంద॥ — వాణివి, నీవాక్కు వాస్తవమె కావచ్చును.

వాణీ॥ — ఇంక మూడువారములే కదా?



సుంద॥ — మూడు వారములుగూడ లేదు. ముప్పదవ తేది శుక్రవారమునాడే పయనమై రమ్మని మాతండ్రిగారు మఱిమఱి చెప్పిరి.

వాణీ॥ — వివాహము నిశ్చయించుట కయ్యుండును.

సుంద॥ — నిశ్చయమయ్యే యున్నది.

వాణీ॥ — ఔనౌను. ఇపుడు పోయినదే వివాహము నిమిత్తమని తలచితిమి. పెండ్లికొడుకు వచ్చుననియు మా తలిదండ్రులతోడ నంటిని.

సుంద॥ — నిజమే పల్కితివి. కాని, వాణీబాయిరాక పెండిలి యౌనని యెట్లు తలంచితివి?

వాణీ॥ — ఏమో, యే సందర్భమునందెట్లో?—అయ్యో అల్లిక తప్పినది.

సుంద॥ — ధ్యానమెచ్చటనో నిల్పిన తప్పదా?

వాణీ॥ — ఇచ్చటనే నిల్పితిని.

సుంద॥ — అప్పుడు తప్పనే తప్పదు.

వాణీ॥ — అప్పుడును తప్పుట కలదు.

సుంద॥ — తప్పదు, తప్పదు.

వాణీ॥ — నిశ్చయమా?

సుంద॥ — నిశ్చయమే! — [అని వాణీబాయి గడ్డము చేతితో నంటి] — కాలేజి వేళయైనది, పోవలయు. [అని పోవుచున్నాడు.

వాణీ॥ — అబ్బబ్బా — అ-అ-అ! * * — [సోఫామీద నెఱిగి].

ఉ॥ ఆటగఁబన్ని నాఁబదుకు నందఱకుం బ్రకటించియిప్పుడి। చోఁటనె స్వర్గసౌఖ్యమును జూపిన చందము సేసితౌర యే। నాఁటి యఘంబుఁ దీఱిచి కొానంగ విధించితో యిట్టులయ్యెయో। ఏటికిమేటి కోర్కు లుదయించి ననుంబొరిగొంటదైవమా!

[తెఱ దింపవలయును.]



# చతుర్థాంకము.

—:o:—

రంగము ౧. — చెన్నపట్టణము, కాలేజిహాస్టెల్.

ప్రవేశము:— కుశాగ్రాం, శర్మ, ప్రసాదం.

—○:o:○—

కుశా॥ — ఇదుగోనోయి శర్మ! ప్రసాదం యిదుగోనోయి! జనరంజనిలో మహాసొగసుగా యేకాడోయి అర్బత్నట్ దివాళానుగురించి, చదువుతా వినండోయి!

శర్మ — కాలేజివేళైంది, యిప్పుడెక్కడోయి?

కుశా॥ — యెంతశేపోయి? ఒకనిముషం — [జేబుగడియారంతీసిచూచి] — యింకా కావల్సినంతకైముంది - కాస్తకూచోండోయి, చదువుతాను. * * * * * * *


" అర్బతునాటు క్షౌరము. "

క్షువరం చేస్తూవున్నట్టు యీ బొమ్మ చూడండోయి మంగలకత్తి కూడాను! [చూచి నవ్వుదురు

చదువుతా వినండి. * * *

„ తిరుపతి క్షౌరము అనుమాట అందరును వినియున్నారు. ఏడుకొండల వెంకటరమణస్వామికి దినదినమును సిగ్రమొక్కులు చెల్లించువారనేకులుందురు గావున అక్కడి మంగలులు చక్కగ క్షౌరముచేయక బరబర బరికి యేమూలనైన గొంచెము మొరికో మోడో విడిచిపెట్టుట సుప్రసిద్ధము. అర్బతునాటుక్షౌర మట్టిది కాదు. అది సీమకత్తితో చేయబడు అడుగంటిన సంపూర్ణ క్షౌరము. [శర్మ, ప్రసాదం నవ్వుదురు.] — మోడులుండవు సరేకదా మఱిమొలచుటకు కుదుళ్లుగూడ నిలిచియుండవు. భళిరే! ఎంత సొంపైన క్షౌరము! ఒక్క నిముషములో ఎన్ని వేలమందికి! అర్బతునాటు క్షౌరమను మాట యికమీద నీదేశములో వాడుకలోనికి రాదగినది. కవీశ్వరులుగూడ ప్రయోగించుటకు యోగ్యమైనది. నిఘంటులో చేర్చుకొన వచ్చును — [నవ్వుదురు.]







మదరాసులోని అర్బతునాటు కంపెనీవారును వారి హేడ్డుకంపెనీయగు లండను పట్టణములోని మెకుఫిడేను కంపెనీవారును తలుపులుమూసి దివాలాడప్పుగొట్టి నేటికి రెండువారములైనది. మెకుఫిడేక్ దొరవారు అవమానపు బ్రతుకు బ్రతుకనొల్లక రైలు పట్టాల కడ్డముగ బండుకొని అమరపురి కరిగిరట. అయ్యోపాపము! అర్బతునాటుదొర ధైర్యముగ నిలువబడి అరవభాషలోను అకౌంటులోను అసాధ్య ప్రజ్ఞగలవారు గావున, ఆరు, (6) పత్తు (10), ఎట్టు (8) — ఆరు, పది, కలిపిన ఎనిమిది యగునని లెక్క చెప్పుచున్నారు! నిజమే. ఆరు కోట్ల రూపాయలు పది సంవత్సరములనుండి విచ్చలవిడి వెచ్చము సేయగా ఎనిమిదివేల కుటుంబములు కూలిపోయి ఘూల్లున ఘోషిల్లుచున్నవి!— (షేమ్! షేమ్!) — దేవులు, భూదేవులు, వర్తకులు, లాయర్లు, ఉద్యోగస్థులు, గొప్పవారు, కొద్దివారు, విధవలు, సధవలు — ఓహో ఎన్నెన్ని తరగతులవారి మహాప్రళయములో చేరియున్నారు! ఇది నీరులేని యుప్పెన. నిప్పులేనిమంట — కడుపుమంట.

ఈ కడుపుమంటకు మాత్ర వైకుంఠయాత్రతక్క వేరేమున్నది?

ఈశ్వరసృష్టిలో నిజముగా కీడన్నదేయుండదు. ఉన్నను, దానివలనగూడ ఏదోమేలుండును. క్షామము, కలరా, ప్లేగు, అగ్నిబాధ, జలప్రళయములు, భూకంపములు మున్నగు దైవసంకల్పములవలన అప్పటప్పటికి కొంతవరకు ప్రజానాశము లేకున్న నరవరులొండొరుల మెక్క నారంభింపరా? తహశ్శీల్దారుగారి చావు శిరస్తాదారుగారికి సంతోషమా విచారమా? చెప్పనేల? ఒకకంట నీరు, రెండవకంట పన్నీరు! ఆర్బతునాటు దెబ్బకు అందరు అల్లోయని ఏడ్చుచున్నారనుమాట వట్టిమాట. సొమ్ము కోల్పోయిన యెనిమిదివేల కుటుంబములవారికిని నిజమైనదుఃఖము. వారిబంధుమిత్రులకును దుఃఖమే. కాని తక్కినవారిలో అనేకులదుఃఖము దొంగదుఃఖము — కన్నీరు తుడుచునట్టి దుఃఖము. కొందరికి వెలుపట దుఃఖము లోపల సంతోషము.

ఈమాట అబద్ధమా? ప్రతిధనవంతునకును శత్రువు లుందురుగదా! ఆపత్కాలమున అప్పడిగి లేదనిపించుకొన్నవారు నుందురు. కొందరు తాము



తినక ఒరులకు బెట్టక ఆస్తితాకట్టుమీదనైన అప్పియ్యక ఆర్బతునటుకంపెనీ అయిదువడ్డీ హాయియని కలధనమెల్ల వారి తెల్లటోపిలో గ్రుమ్మరించి కూర్చుండియున్నారు. అట్టివారికిప్పుడు హాయిగదా! పాడండి, అందరికీ జోలపాడండి!" —
నీవు పాడవోయి. [అని శర్మచేతికి పత్రికనిచ్చును.

జోలపాట.

శర్మ — ఉళుదుళు దుళుదుళు దుళుదుళుదు హాయీ।
ఉన్నదంతా ఆరుబాతునోట్లో పోయీ॥
ఇల్లమ్మిపొలమమ్మి - యీనాములమ్మి।
ఇల్లాలు నగలమ్మి - యీశ్వరునిరమ్మి॥ ఉళు॥
అమ్మసంపాదించె - అయిదు పదివేలు।
అయ్యబ్యాంకిలోదాచె - అయ్యోతలవ్రాలు
కొద్ది ఉద్యోగాన - కొల్లగొనుటాయె।
కూతురుపేరిట దాచి - కోల్పోవుటాయె। ఉళు॥
దొరను ద్రోహముచేసి - దోచినసొమ్ము।
తుడిచిపెట్టుకుపోయె - దోషపుసొమ్ము। ఉళు॥
(చప్పట్లు.)

అర్బతునాటు దివాలాలో అధికముగా ద్రవ్యములు గోల్పోయినవారందరు దుఃఖసాగరమున మునిగి

యున్నారనుమాట బూటకము. చిన్నయ్య శెట్టి గారిమాట విన్నారా? వారికిప్పుడు చిన్న మెత్తుబంగారును చేతలేక, శెట్టిగారు మాత్రము మిగిలియున్నారు. ఆర్బత్నాటుదివాలాలో తనసొమ్ముపోయినదని ఆయన యెంతమాత్రము నమ్మజాలడు. చీనా బజారులో చిన్ని యోడ యొకటి కొని తెచ్చి దాని తనయింటి జలధారనీటవిడిచి, వెంట పరువిడుచు, అదిగో అర్బతునాటువారి సరకుల యోడ వచ్చుచున్నది, అందరికిని గొప్పలాభము రాగలదు - అని అరచుచు ఆనందమును పొందుచున్నాడట!

ఇంకొకవింత వినుండి. నమస్కారాల నరసింగ రావుగారు తనసొమ్ము పోయినందుకై సంతోషభరితుడై యున్నాడట! అయన స్నేహితుడు పరాశర మూర్తి చెప్పుచున్నాడు. ఈ నరసింగరావుగారు స్వప్రయోజకత్వమువలన సర్కారులో గొప్పయుద్యోగము చేసి యిప్పుడు పించను అనుభవించుచున్నాడు. ఉద్యోగదశలో దాదాపు లక్షరూపాయలు నిలువజేసి వృద్ధిపరచియున్నాడు. సంతానము లేదు. స్వానుభవము తక్కువ. ఒకరికి పెట్టుటయు పూజ్యము. కాని చాలా సత్పురుషుడు."



ప్రసా॥ — అరెరే! మన వెంకట్రామయ్య మాటోయి!

కుశా॥ — పరాశరమూర్తంటే తెలిసిందా? మన వేద వ్యాసరావు!

శర్మ — నువ్వు చదవ్వోయి. [అని ప్రసాదంచేతికి పత్రికనిచ్చును.

ప్రసా॥ — "అప్పుడప్పుడు నరశింగరావుగారికిని పరాశర మూర్తికిని స్నేహ సంభాషణలు జరుగుచుండును. * * బోలెడు వడ్డీకూడా వస్తూవుందే - యేల దండిగా ఖర్చుచేసుకొని సుఖపడరాదు? — అని యడిగిన — మనమేమి రాజులమా, జమీందార్లమా? యింతకంటె యెక్కువ ఖర్చుచేసుకొని అనుభవించేదేమిటి? యెక్కువ తింటే వ్యాధులు తెచ్చుకొని వైద్యులవాత పొయ్యడమే గాని మరేమీ లేదు - అని పంతులుగారు జవాబు చెప్పును. * * వకగుర్రపుబండైనా కొనుక్కోరాదా, నీకంటె తక్కువ జీతం తెచ్చుకొనేవాళ్లకే వున్నదే?—యన్నచో — వాళ్లకేమి మహారాజు బిడ్డలు. యిన్నాళ్లులేనిది యిప్పుడు నాకు గుర్రపుబండెందుకు! పింఛనుకాలం కూడా సమీపించింది. పైగా కచేరీ పదిబారల దూరమైనాలేదు. నేనేమి పుట్టుభోగినా నడవలేక పోవడానికి? అంతగా యెప్పుడైనా నడవలేకపోతే జ

ట్కా బండి సిద్ధంగానే వున్నది — అని బదులు సెప్పును. పోసి, వంటబ్రాహ్మణ్ణయినా వుంచుకోరాదా? — యన్న — సరే ఆక్షోభంతా వెనుక మామరదలు బతికున్నప్పుడు అనుభవించాను చాలును. ఇంట్లో బిడ్డలా పాపలా నావక్కడికి యింత వండి పెట్టలేదా యేమిటి, పెండ్లాము? ముసలిదా — వంటచేయడము అలవాటు లేదా — మహారాజు కూతురా? — యనును * * అయితే యెవరినైనా వకపిల్లవాణ్ణి యెందుకు పెంచుకోవు? — అని యడిగిన — సరిసరి! కన్నకొడుకులే యీ కాలంలో తండ్రికియెదురు తిరుగుతున్నారు, యిక పెంపుడుకొడుకులా రక్షించేది! వీడెప్పుడు చచ్చునా వీడిసొమ్మెప్పుడు చేతికివచ్చునా అనే ఆలోచనతప్ప వేరే ఆలోచన వుండదు. ఆ వెనక జనకతండ్రివచ్చి గార్డియన్‌గా చేరెనా చెప్పవలశిందేమున్నది? పెంపా! హూఁ! చాలుచాలు! — నని పలుకును. * * అట్లాగైతే వకసత్రమైనా కట్టించు, లేదా యేదైనా ధర్మంచేయి, నీ పేరు భూమిమీద శాశ్వతంగా నిలిచి వుంటుంది — యన్నచో — ఒహోహోహో! నా పేరు నాతోనే మాసిపోతే మరీ మంచిది. మనమెంత? మనసొమ్మెం



త! నాటుకోటశెట్లకంటె యెక్కువ ధర్మాలు చెయ్యగలమా యేమిటి? వాళ్లుకట్టించిన సత్రాలే దిగేదిక్కు లేక బాడిగెలకిస్తూవున్నారు. మనసొమ్మైదైనా వర్తకంలో లాటుగా కొట్టుకొచ్చినసొమ్మా, లేకుంటే దివాళాలో దాచుకున్నసొమ్మా-ధర్మంకింద ఖర్చుపెట్టడానికి? — అని పలుకును * * పోసి, యినాళ్లనుంచి నీతో స్నేహంచేస్తాను, నాకైనా పదివేలిస్తూ - నీపేరు చెప్పుకుని పిల్లలూ మేమూ సుఖపడుతాము. పిల్లదాని పెళ్లికూడా సమీపిస్తున్నది, వెయ్యి రూపాయిలు కుమ్మరిస్తేగాని యెక్కడా పెళ్లికొడుకు దొరికేటట్టు లేదు—అని వేడికొన్న — నిశ్చయంగా యిస్తే నీకియ్యనేవచ్చును. కాని, చూస్తూ చూస్తూ యివ్వడానికి మనసొప్పదే యేమి చేస్తును? అని విచారముద్రోప బలుకును. * * [నవ్వు] * * మరి నీసొమ్మంతా యెవరికిచ్చి పోతావు, వూరికే వడ్డీతో పెరుగుతూవున్నదే యెవరి పేరట విల్లురాశి పోతావు? — అని యెత్తిపొడిచిన — అదే తెలక తన్నుకుంటూవున్నాను. ఆ విచారం తప్ప నిశ్చయంగా నాకింకో విచారమే లేదు — అని పలుకును. * * [నవ్వు].

ఇప్పుడు అర్బనాటువారి దివాల పుణ్యాన నరసింగరావు పంతులుగారి విచారము తీరినది. ఇన్ని దినములనుండి తేల్పజాలని విషయము చప్పున తేలినది! —[నవ్వు]— పంతులుగారు పరమానందభరితులై యున్నారు. బ్రతికియున్నంతవరకు నాకునా పించనే చాలును ఆటు పిమ్మట నా పెండ్లానికి నగలే చాలునని చెప్పుచు, చిన్ననాడు నేర్చుకొన్న నీతిపద్యము పఠించుచు ఎల్లప్పుడు నవ్వుచుండును.

కం॥ ఏలా దాచెదరర్థము,
లేలాయర్థులకుఁ బెట్ట, కేలాకుడువక్ ?
తూలక నిలువదు సిరి, పెను
గాలింగంపించు దీపకళికయుఁ బోలెక్

శర్మ— స్ప్లెండిడ్! పోదాంరండి, టయిమైంది!

[అందఱు నిష్క్రమింతురు.]

రంగము ౨. — చెన్నపట్టణము.

భజగోవింద మఠము.

ప్రవేశము :— భజగోవింద స్వాములవారు.

—:o:—

భజ॥ — ఆర్బతునాటు గోలవలన ఈ పదియారుదినములనుండి దేశమంతయు గందరగోళముగనున్నది. మ



ఠము చెల్లాచెదరైనది! శిష్యులు సికార్లుమఱిగి పాఠమునకు రాకయున్నారు. నిముస నిముసము వింత వార్తలు దెలియుచున్నవి. స్వాములవారిని దూరుచుండిన దుర్మార్గుల కొంపలు కూలినవి - మాకు పరమానందముగ నున్నది. కాని, మా భక్తులకుగూడ పెక్కండ్రకు పెద్దదెబ్బతగిలినది. చిన్ననాడె మన యుపదేశమ్మును పొందిన భక్తురాలు తుళశమ్మ సొమ్మంతయు మునిగిపోవుటచే నాయమ మడుగున మునిగి ప్రాణములు గోల్పోయెనట. ఆపె పిచ్చి కొమరుడును తల్లిని గట్టిగ బట్టుకొని కడముట్టెనట. పిల్లడి యాభరణములతోడ బారిపోయెనట! నాటగోలె ప్రియభక్తుడు దామోదరుడు మంచముపై బడి నేడో రేపో యను స్థితికి వచ్చియున్నాడట.

ప్రవేశము - దశముడు.

కట్టా! యెట్టి దుర్వార్తలు! —ఏమిరా, పంచమ! యేమి వార్తలు?

దశ॥ — మహాస్వామి! నేను పంచముండగాను, దశముండను.

భజ॥ — దశముండ వేసరి, యేమి వార్తలు?

దశ॥ — భక్తుడు మహీపతి హైదరాబాదునుండి బొం

బాయి కరగియున్నాడట. ఆ చిన్నది పాటకునిదో డ్కొని యచ్చటికి బోయినట్టు వర్తమానము.

భజ॥ — ఈడువచ్చిన పిల్లలకు పోకిరి ముండకొడుకుల చేత పాట చెప్పింపరాదని జ్ఞానములేక పోయెను! ఇది దామోదరుడు చేసినపని. మన మఠమున శిష్యురాలుగ జేరునని తలచుచుంటిని. హాం! కూర్చుండుము. పఠనమైన ముగింతము. తక్కిన శిష్యులెక్కడ?

దశ॥ — ఒక్కరొక్కరు రాగలరు. [అని కూర్చుండును.

భజ॥ — కానిమ్ము. * * *

శ్లో॥ భజగోవిందం భజగోవిందం।
గోవిందంభజ మూఢమతే।
సంప్రాప్తే సన్నిహితేకాలే।
నహినహి రక్షతి డుకృఙ్కరణే॥

దశ॥ — తో॥ భజగోవిందం భజగోవిందం -
పరమమంత్రమిది మూఢమతీ। హరి।
భజనమొండె యవసానమందుఁ గా -
పాడఁగలది యోమందమతీ॥

ఇద్దరు—భజగోవిందం.........మూఢమతే॥



[☞ ఈ రంగమున గల భజగోవింద శ్లోకములును తోహరాలును తోడి, మాళవగౌళ, బౌళి, కాంభోజి, ముఖారి, నాట, బిలహరి, బ్యాగు మున్నగు రాగముల మార్చి మార్చి సంకీర్తనము సేయవలయును. ప్రదర్శనమున వీనిలో గొన్ని వదలినను వదలివేయ వచ్చును.]

భజ॥—శ్లో॥ మూఢ జహీహి ధనాగమతృష్ణాం।
కురు సద్బుద్ధిం మనసి వితృష్ణాం।
యల్లభసే నిజకర్మోపాత్తం।
విత్తం తేన వినోదయచిత్తం॥ ౧

దశ॥ — తో॥ విత్తసమార్జన విధములు వెదకకు -
వెడఁగా! పురాకృతమువలనఁ। నీకు।
విత్తమెంత లభియించు దానితోఁ -
వేడ్కఁగనుచు సుఖియింపవలెఁ॥ ౧

ఇద్దరు — భజగోవిందం.........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ నారీస్తనభరనాభీదేశం।
దృష్ట్వా మాగా మోహావేశం।
ఏతన్మాంసవసాదివికారం।
మనసి విచింతయ వారం వారం॥ ౨

దశ॥ — తో॥ పువ్వుబోండ్ల స్తనపుష్టిం గనికని -
యువ్విళ్లూరకు మోహముతోఁ। అవి।
క్రొవ్వుకండలని గుర్తెంగి మదిఁ -
గోర్కె నడంచు మసహ్యముతోఁ॥ ౨

ఇద్దఱు — భజగోవిందం.........మూఢమతే॥

ప్రవేశము — నవముడు.

నవ॥ — మహాస్వామి! భక్తుడు దామోదరుడు నిన్నటి రాత్రి ముక్తి చెందెనట. మహీపతికి తంతివార్త వచ్చినదని యతని శిష్యరాలు చెప్పెను.

భజ॥ — హరి హరీ! ఎంతటి దుర్వార్త వింటిమి! * * కూర్చుందుము.

శ్లో॥ నళినీదళగతజల మతితరళం।
తద్వజ్జీవిత మతిశయ చపలం।
విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం।
లోకం శోకహతంచ సమస్తం॥ ౩

నవ॥ — తో॥ సరోజనీదళగతజలబిందువు -
చపలమునుమి జీవితము కదన్।బహు।
దురవస్థాపీడితము ప్రపంచము -
దుఃఖమయము పరికింపంగన్॥ ౩

అందఱు — భజగోవిందం.........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ యావద్విత్తోపార్జనసక్త।
స్తావన్నిజపరివారో రక్తః।
పశ్చాజ్జీవతి జర్ఝరదేహే।
వార్తాంకోపి నపృచ్ఛతిగేహే॥ ౪



దశ॥ — తో॥ గడన గల్గినపు డింట నందఱును -
మడుగులొత్తుదుర యడుగులకున్। తన।
గడనయుడిగి ముసలితనమునఁ బడఁ -
గడకురారు పిల్చిననొకడున్॥ ౪

అందఱు — భజగోవిందం.........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ యావత్పవనో నివసతి దేహే।
తావత్పృచ్ఛతి కుశలం గేహే।
గతవతి వాయౌ దేహాపాయే।
భార్యా బిభ్యతి తస్మిన్కాయే॥ ౫

నవ॥ — తో॥ ఉసురునిలిచి యున్నంతకాల మర -
యుచుందు రందఱుఁ గుశలమ్మున్। ఆ।
యుసురుపోయి దేహము చల్లారఁగ।
నులుకును దారయు దరి నిల్వన్॥ ౫

అందఱు — భజగోవిందం.........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ అర్థమనర్థం భావయ నిత్యం।
నాస్తి తత స్సుఖలేశ స్సత్యం।
పుత్రాదపి ధనభాజాం భీతిః।
సర్వత్రైషావిహితారీతిః॥ ౬

దశ॥ — తో॥ అర్థమనర్థము లేశము సుఖదా -
యకముగాదు నిజమరయంగన్। భువి।

సర్థవంతులకు ననుంగు పుత్రుల -
యందును భీతిగదా యెచటన్ ॥ ౬

అందఱు — భజగోవిందం.........మూఢమతే ॥

ప్రవేశము :— సప్తముడు, అష్టముడు.

అష్ట॥ — మహాస్వామి! ప్రథముండు ద్వితీయను వో డ్కాని గుంటూరుపురమున కరిగి యచ్చట స్వకీయముగ మఠము స్థాపించియున్నట్లు వర్తమానము.

సప్త॥ — నేను నట్లేవింటిని.

భజ॥— అక్కటకటా! ప్రథముం డధముండయ్యె, నియ్యది కలికాల మహిమగాక యేమని తలంపవచ్చు?

శ్లో॥ బాలస్తావత్క్రీడాసక్త ।
స్తరుణస్తావత్తరుణీసక్తః ।
వృద్ధస్తావచ్చింతాసక్తః ।
పరేబ్రహ్మణికోపినసక్తః ॥ ౭

సప్త॥ — తే॥ ఆటలపై నాసక్తి బాల్యమున -
బోటులపైఁదమి యౌవనమం । దా ।
రాటపుఁజింతలు వృద్ధత్వమునఁ బ -
రబ్రహ్మనిరతి యెపుడమరున్ ॥ ౭

అందఱు — భజగోవిందం.........మూఢమతే॥



భజ॥ — శ్లో॥ కాతేకాంతా కస్తేపుత్ర ।
స్సంసారోయమతీవవిచిత్రః ।
కస్యత్వంవా కుతఆయాత ।
స్తత్వం చింతయ తదిహభ్రాతః ॥ ౮

అష్ట॥ — తే॥ సతియెవ్వతె నీసుతుఁడెవ్వఁడు సం -
సారబంధనము వింతసుమా । నీ ।
పితకు నీ వెవఁడ వెక్కడివాఁడవు -
విచారించి తత్వము గనుమా ॥ ౮

అందఱు — భజగోవిందం..........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం ।
నిస్సంగత్వే నిర్మోహత్వం ।
నిర్మోహత్వే నిశ్చలతత్వం ।
నిశ్చలతత్వే జీవన్ముక్తిః ॥ ౯

నవ॥ — తే॥ సత్సాంగత్యము లభియింపఁగఁ బరి -
జనగోష్ఠి యసహ్యముదోచున్ । మో ।
-హావ్యామోహము విడి తత్వము దెలియును
ఒప్పును మోక్షం బలుచేతన్ ॥ ౯

అందఱు — భజగోవిందం......మూఢమతే॥

భజ॥ — శ్లో॥ వయసిగతే కః కామవికారః ।
శుష్కేనీరే కః కాసారః ।

క్షీణేవిత్తే కః పరివారః।
జ్ఞాతే తత్వే కస్సంసారః॥ ౧౦

దశ॥ — తో॥ ప్రాయముడిగి మదనాగ్ని యెక్కడిది -
తోయములింకి తటాకమ్మున్! ఆ।
దాయముడిగి పరిజన మెక్కడఁ ద -
త్వమ్ముదెలిసి సంసారమ్మున్॥ ౧౦

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

ప్రవేశము :— పంచముఖు.

భజ॥ — అహో పంచమ! ఏమి వర్తమానము దెచ్చితివి?

పంచ॥ — భోగరాజువారి చిన్నవాఁడు మన మతమున జేర వలెనని కోరుచున్నాడు.

భజ॥ — సొమ్ము గోల్పోయిన పిమ్మట నిప్పుడు కన్నులు కనుపడెను గాబోలు! ప్రస్తుతము మన మతమున గ్రొత్తశిష్యుల జేర్చికొనజాలము.

శ్లో॥ మాకురు ధనజనయౌవనగర్వం।
హరతి నిమేషాత్కాలస్సర్వం।
మాయామయ మిదమఖిలం హిత్వా।
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా॥ ౧౧

పంచ॥ — తో॥ భోగభాగ్యములు యౌవనమును గని
బొర్లఁబడకుమా! అవి స్థిరమా। వై!



రాగివగుచు సర్వము విడిచి పర -
బ్రహ్మము నారసి కనుగొనుమా॥ ౧౧

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ దినయామిన్యౌ సాయంప్రాతః।
శిశిరవసంతౌ పునరాయాతః।
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః।
తదపి నముంచత్యాశా వాయుః॥ ౧౨

సప్త॥ — తో॥ రేయిపవలు మఱి రేపులు మాపులు
ఋతువు లిట్లు కాలము దిరుగున్। భువి।
నాయువుఁ బఱచు నదేమిపాపమో -
ఆశాభూతము విడదు నరున్॥ ౧౨

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ కింతే కాంతా ధనగతచింతా।
వాతుల కిం తవ నాస్తి నియంతా।
త్రిజగతి సజ్జనసంగతిరేకా।
భవతి భవార్ణవతరణే నౌకా॥ ౧౩

అష్ట॥ — తో॥ వారిక ధనచింతను బడి తప్పో -
ప్పారయక ప్రవర్తింపకుమా। సం।
సారసాగరముఁ దాటఁగ సజ్జన -
సహవాసంబే నావ సుమా॥ ౧౩

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ జటిలో ముండీ లుంఛిత కేశః।
కాషాయాంబర బహుకృత వేషః।
పశ్యన్నపిచ నపశ్యతి మూఢో।
హ్యుదరనిమిత్తో బహుకృత వేషః॥ ౧౪

నవ॥ — తో॥ ధరనెందఱో జోగులు జడదారులు-
తలబోడులు కాషాయధరుల్ । పరి।
పరివేసమ్ములు గాసమ్మునకే -
బ్రహ్మముం గనంగలరే మూఢుల్ ॥ ౧౪

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ అంగంగళితం పలితంముండం।
దశనవిహీనంజాతంతుండం।
వృద్ధోయాతిగృహీత్వాదండం।
తదపి నముంచత్యాశాపిండం॥ ౧౫

దశ॥ — తో॥ పీడును దేహమ్మున బిగి దంతము -
లూడును వాడును కేశమ్ముల్ । మఱి।
మూడుకాళ్లముదుసలియు నగున్ విడి -
పోవునె యాశాపాశమ్ముల్॥ ౧౫

అందఱు — భజగోవిందం........మూఢమతే॥



ప్రవేశము :— చతుర్థి.

చతు॥ — మహాస్వామీ! తృతీయుడు పష్ఠిని దోడ్కొని కోవెలపురమునకు పయనమైపోయెను. నన్నుగూడ రమ్మని యెంతో వేడికొనియెంగాని నే నిష్టపడనైతిని. అచ్చటనే పదుగురుశిష్యురాండ్ర జేర్చికొని వేదాంత సమాజము స్థాపింపవలెనని యుద్దేశించి యున్నాడు.

భజ॥ — వాని వేదాంతము వల్ల కాడైరి! స్వామిద్రోహి, వాని పాతకమె వానిని జెఱచును. చతుర్థీ! నీసత్ప్రవర్తనమును మెచ్చి నీ కిటుపై ప్రథమత్వ మిచ్చితిని - నాదండను గూర్చుండుము.

చతు॥ — మహాస్వాముల ప్రసాదము! చెంతగూర్చుండును.

భజ॥ — శ్లో॥ అగ్రేవహ్నిః పృష్ఠేభానుః।
రాత్రౌ చుబుక సమర్పితజానుః।
కరతలభిక్ష స్తరుతలవాసః।
తదపి నముంచత్యాశాపాశః॥ ౧౬

చతు॥ — తో॥ ఆతపశీతమ్ముల కోర్చి తపం -
బహర్నిశలు తరుమూలమునన్ । సం।
ప్రీతి నెఱపు కరతల భిక్షుకుఁడును -
బీడితుఁడా శాపాశమునన్॥ ౧౬

అందఱు — భజగోవిందం........మూఢమతే ॥

భజ॥ — శ్లో॥ కురుతే గంగాసాగరగమనం ।
ప్రతపరిపాలన మథవాదానం ।
జ్ఞానవిహీనస్సర్వమతేన ।
ముక్తిం నభజతి జన్మశతేన ॥ ౧౭

పంచ॥ — తే॥ తీర్థయాత్రలు వ్రతమ్ములు సల్పినం -
దివిరి దానధర్మము లిడినఁ । పర ।
మార్థజ్ఞానము గలుగక మోక్షం -
బబ్బదు పో శతజన్మములఁ ॥ ౧౭

అందఱు — భజగోవిందం........మూఢమతే ।

భజ॥ — శ్లో॥ సురమందిరతరుమూలనివాసః ।
శయ్యాభూతల మజినంవాసః ।
సర్వపరిగ్రహభోగత్యాగః ।
కస్యసుఖం నకరోతి విరాగః ॥ ౧౮

సప్త॥ — తే॥ నేలపాన్పు తరుమూలమ్ములు దే -
వాలయములు వాసస్థలముల్ । మఱి ।
తోలుచేలము — విరాగులు భోగవి -
దూరు లహా! నిత్యానందుల్ ॥ ౧౮

అందఱు — భజగోవిందం........మూఢమతే ॥



భజ॥ — శ్లో॥ యోగరతోవా భోగరతోవా ।
సంగరతోవా సంగవిహీనః ।
యస్య బ్రహ్మణి రమతే చిత్తం ।
నందతి నందతి నందత్యేవ ॥ ౧౯

అష్ట॥ — తే॥ జ్ఞానయోగి యజ్ఞానభోగి పరి -
జనరక్తుండు విరక్తుండుఁ । ఏ ।
వానిచిత్తము పరబ్రహ్మాలయం ।
బానరుఁ డానందముఁ గాంచుఁ ॥ ౧౯

అందఱు — భజగోవిందం........మూఢమతే ॥

భజ॥ — శ్లో॥ భగవద్గీతా కించిదధీతా ।
గంగాజలలవకణికా పీతా ।
నకృదపి యేన మురారిసమర్చా ।
క్రియతే తస్య యమేపి నచర్చా ॥ ౨౦

నవ॥ — తే॥ ఇంచుకేని గీతాపఠనముఁ గా -
వించుఁ ద్రావు గంగాజలముఁ । అ ।
ర్చించు మురారి నొకప్పుడే నెవఁడు -
చేరఁ డతఁడు యముచర్చలలోఁ ॥ ౨౦

అందఱు — భజగోవిందం........మూఢమతే ॥

భజ॥ — శ్లో॥ పునరపిజననం పునరపిమరణం ।
పునరపిజననీజఠరేశయనం ।

ఇహసంసారే బహుదుస్తారే।
కృపయాऽపారే పాహిమురారే॥ ౨౧

దశ॥ — తో॥ మఱి మఱి పుట్టుట మఱిగిట్టుట మఱి-
మాతృగర్భమున బొరలుటయున్। ఈ।
తెలుఁగుగదా సంసారగమన మిది -
తీర్పఁగ వేఁడుము గోవిందున్॥ ౨౧

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — మత్ప్రియ శిష్యులారా! ఇక నీ ఛండాలపట్టణమున మనమునిలిచి ప్రయోజనము లేదు. మన మతమును గౌరవించి, మనలకు భిక్షలు సేయువారును తిరిపెమెత్తినను పిడికెడు బిచ్చము పెట్టువారును గానంబడరు. అన్నదాన సమాజము లెన్నియో యున్నవిగాని యవి కన్ను కాలు లేనివారికిగాని మన యట్టి భగవద్భక్తులకును వేదాంతపరులకును నిరుపయోగములు. ముందు భజగోవింద సంకీర్తనము ముగియనిండు. పిమ్మట శ్రీవేంకటేశ్వర స్వాములు రాత్రి నాకు ప్రసాదించిన స్వప్నము దెలుపుదును.

చతు॥ — మహాస్వాములతోడ మనవిచేయ మఱచితిని. తిరుపతి వేంకటేశ్వరులు గోదావరీతీరమున గుడిలో వెలయుచున్నట్లు కలగంటిని.



భజ॥ — ఆహా! ఏమి విచిత్రము! పఠనము ముగియనిండు.

భజ॥ — శ్లో॥ రథ్యాకర్పట విరచితకంథః।
పుణ్యాపుణ్య వివర్జితపంథాః।
యోగీ యోగనియోజితచిత్తో।
రమతే బాలోన్మత్తవదేవ॥ ౨౨

పంచ॥ — తో॥ పేలికలను జేలముగాఁ గూర్చును -
విడుచును బుణ్యాపుణ్యములన్।
బాలునిగతి నున్మత్తుని భంగినిఁ -
బరమయోగి యానందించున్॥ ౨౨

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ కస్త్వం కోహం కుత ఆయాతః।
కామే జననీ కోమే తాతః।
ఇతిపరిభావయ నిజసంసారం।
సర్వం త్యక్త్వా స్వప్న విచారం॥ ౨౩

సప్త॥ — తో॥ నీవు నేను మఱి తల్లితండ్రి యే -
నెలవువార లెవ్వారు వీరల్। ఈ।
భావ మరసి స్వప్న భ్రాంతులు విడి -
వంచింపుము భవబంధమ్ముల్॥ ౨౩

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ త్వయిమయి సర్వత్రైకోవిష్ణుః।
వ్యర్థంకుప్యసి మయ్యసహిష్ణుః।
భవ సమచిత్తస్సర్వత్రత్వం।
వాంఛస్య చిరాద్యదివిష్ణుత్వం॥ ౮

అష్ట॥ — తే॥ ఒకటేసుమి బ్రహ్మము సర్వత్ర మ-
ఱొకఁడని నేనని తలఁపకుమా। భువి।
సకలభూతముల సమబుద్ధి నరసి-
సదయుఁడవై మోక్షము గనుమా॥ ౮

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ కామం క్రోధం లోభం మోహం।
త్యక్త్వాత్మానం పశ్యవిమోహం।
ఆత్మజ్ఞానవిహీనామూఢాః।
తే పచ్యంతే నరకనిగూఢాః॥ ౯

నవ॥ — తే॥ కామము క్రోధము లోభము మోహముఁ-
గడ తేల్చి కనుము పరమాత్మన్। విను।
పామరులగు తత్త్వాంధులకును బెను-
బాధలు తప్పవు నరకమునన్॥ ౯

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — శ్లో॥ గేయం గీతా నామ సహస్రం।
ధ్యేయం శ్రీపతిరూప మజస్రం।



నేయం సజ్జనసంగత మనిశం।
దేయం దీనజనాయచ విత్తం॥ ౧౦

దశ॥ — తే॥ పరపూరుష సహవాసము ధర్మము-
భగవద్గీతా పఠనమ్మున్। శ్రీ।
మురారినామ సురూప ధ్యానము-
ముక్తికి సోపానమ్ములగున్॥ ౧౦

అందఱు — భజగోవిందం........మూఢమతే॥

భజ॥ — ఇంక నా స్వప్నవిషయమును దెల్పెద వినుండు. శ్రీ వేంకటేశ్వరస్వాములవారి సొమ్ముగూడ ఈ ఆర్బతునాఁటు ప్రళయమున దుడుచుకొని పోయినమాట మీచెవులబడినది గదా?

శిష్యులు — వింటిమి, వింటిమి.

భజ॥ — ఇంక న య్యేడుగొండలవాఁడా వేడికొండల నడుమ నుండజాలడట. గోదావరీతీరమున కరిగి యచ్చో నొక యాలయమును మఠమును దిబ్బెము నేర్పరచి ప్రపంచమున బ్రకటింపుమని నాకాజ్ఞ యొసంగిరి.

శిష్యులు — ఓహో! యెట్టి సువార్త!

భజ॥ — ధవళేశ్వరమున స్నానపు రేవులో నొక చిన్ని సువర్ణ విగ్రహరూపమున నాకు ప్రత్యక్షమగునట్లును తెలిపిరి. ఉన్నవారమున్నట్టే మన మచటికి పయన

మైపోవలయును. వేంకటేశ్వరులకృప యుండినచో మన కేమి కొఱంత?

చతు॥ — మనుషుల సొమ్ముతోడనె గుళ్లును గోపురములును గట్టించవచ్చుగదా!

భజ॥ — రండు, పోవుదము. ఈమఠమున మన ఋణము తీరినది!

అందఱు — భజగోవిందం........మూఢమతే ॥

[నిష్క్రమింతురు.

రంగము 3. — చెన్నపట్టణము మహీపతి సాని యిల్లు.

ప్రవేశము :—మహీపతి.

—:o:—

మహీ॥ — విర్తాగా అయిదరాబాదా అంతా అల్లాడి చస్తిని. బొంబాయిలో చుట్టి చుట్టి నాపని సుడుగాడైంది. ఆ పాడుపోయిన పట్నంలో మనమాటే తెలియదు. అడిగేదానికి బదులుచెప్పే దిక్కేకానం. బొంబాయికి పోయిందానికి యీ ప్యాస్ పోర్టుదా లాబం! వృర్ణే! వొంఖ లాబమా! ఇప్పుడు కాశికి పోయిదా తీరవలా. అక్కడ కనిపెట్టేది ముక్కాముప్వోసం నిచ్చయమని తలుస్తాను. ముందే కాశికి పోవలాంటే యీ దరిద్రంపట్టినముండ యీపక్క



చూచేది వాశిఅనింది. లంజను తిట్టేదానికి నాబుద్ధియేమైంది? అంతా శెనిగాడు చేశేపనిదా - కడాను మేలనేది యెట్లావుణ్ణో? * * * అడాడా! దినం నూర్రూపా సెలవుచేశినా పది సమత్సరం నిలుచును? గ్రామం అమ్మించిందే తప్పు. అంతమట్టుగు టాకరు పాపులో నలబయి వేలకు నగలుతీయించింది మంచిదాయెను. హీనం యిరవై వేలకైనా వాళ్లే యెత్తుకుంటారు. మొదులు కండ్లపడితే మీందటి కార్యం చేతిలోనే వుంది. పాటనా పాడా, ఆ లంజా కొడుకు రత్తెయ్య కేప్మారి అని నాడే తలిస్తిని. యీలోగా యిట్లా కాలిపొయ్యేది ముందు యేంగా తెలిసేది? * * వొంఖచోటనా వొంఖమూలనా యీగోళ? దేశమంతా బూకంపంమాదిరి గెజగెజ వడికి పోయింది. నాడే యీ పీడవానకూడా పట్టింది. గుంటలన్నీ నిండింది - సుకంగాపడి చచ్చేదానికి! యిప్పట్లో అదీవొంఖమేలే - దుక్కం తీరిపోతుంది! శేలుకూడా తెగిపోతే యిఖచెప్పవలిశింది లేదు. దాంల్లో యీ సీ ఆర్ నమ్మేది శుద్ధమోసం. అమా వాశైతేఅయింది, నేడు పయనమయ్యేదే వాశి - ప్రాణంపూడిస్తే కష్టమే తీరిపోతుంది. * * ఇంక

మీద గుంటూరుకు పోవలిశింది లేదు - అదీమే లే అని పెట్టుకో. హాఁ! పట్టితెచ్చేదానికి మహీపతి పోయింది తెలిశీ యింతగాభరానా! వొకిటికి నాల్గు బుడ్లు కొట్టుడిస్తే విచారం పూడ్చునా? పుసుకే పూడ్చింది! పోనీ, పీడ వదిలింది! * * అడాడా! యీ కాలంలో యవరినీ నమ్మేదానికి లేదు. పేరు సాములాహూ-వాయంతా అబద్దాలే! నేవొచ్చేలోపలే గెంతేశినాడు, వీడిపాడేమో చిక్కబోతుందని! అక్కడ లింగంగారిచాత వీడికి జోడుదెబ్బలుదా ప్రాప్తి. ఇంక రాజమండ్రీలో నిలవనేవొద్దు-నేరుగా కాశికిపొయ్యేదే వాశి. * * దూరాబారం! తిరుగా యెన్ని దినాలకో? లంజయినా ఆలుగానే పేరు తెచ్చుకునింది—రొండొకమాట మాటాడేశి పోతేదా మనసుకు సుకం! [అని లోనికి బోవును.

---

రంగము ౪. — ఆనందంపంతులు ఇల్లు - మిద్దెబయలు.

ప్రవేశము :— వాణీబాయి.

——:o:——

వాణీ॥ — ఈ నిండుచందురుడు శత్రువో మిత్రమో తెలియకున్నదిగదా! మూడునాల్గు మాసములనుండి



నన్నిట్లే బాధించుచున్నవాడు. ఈ జాబు పున్నమనాడే వచ్చుట యెంత విచిత్రము! నేను మూడవ తేది గదా? —[జాబు విప్పిచూచి]— వ్రాసినది — జూను I-వ తేది. * * * *

ఎన్నెన్ని సార్లు చదువుకొందును! చదువజదువ సంతోషమును సంతాపమును గూడ దుర్భరమగుచున్నవి. ఔరా! ఎదుట నొక్కనాడుగూడ మనసు విప్పి మాటాడని వాడు ఎంత స్పష్టముగ, ఎంత ధైర్యముగ, నిర్భయముగ వ్రాసెను! ఇట్లు వ్రాయుటకు నానోట నేమిమాటలు జాఱెను? * * అయ్యో, యేమి వెఱ్ఱి! మనసు దెలియుటకు మాటలు వలయునా? * * * "బందరునుండి పదునెనిమిదవ తేదినాడు పయనమై— * * "ముగియువరకు బరమరహస్యముగనుంచవలయు. * * * "మిన్నుమన్నొక్కటైనను వెనుదీయక యీ తరుణమున— * * "దీనికి ప్రత్యుత్తర మంపవలదు." * * అబ్బా! గుండె రాయి చేసికొనవలయుగదా! చట్టముగోల తుదముట్టకమున్నె యిట్లు సంప్రాప్తమై— * * అబ్బబ్బా! అంతయు స్వప్నావస్థగ

నున్నది! ఒడలు గడగడ వడకి దిగులుపుట్టుచున్నది! బందరునుండి పదునెనిమిదవ తేది — * * కాని, వ్యవధియున్నదిగదా, యీ లోపల ధైర్యము పూనవలయు. దైవమా! నీబిడ్డను గాపాడుము. చంద్రమా! వందనము గొనుము.

[అని లోనికి బోవుచున్నది.]

# పంచమాంకము

—:o:—

రంగము ౧. — చెన్నపట్టణము, ఒక యింటివాకిలి.

ప్రవేశము:— గురవడు, వెంకి.

—:o:—

గుర॥ — ఆదెంత్కు శెప్తనేవు, యింటే గెంజి లోనికి మోతుందంటేయి? రోమ రోమ రోమా! పొగోడికన్నా ఆ సావొద్దేయి. ఇగ్గో! యిద్నాడేయి - వోలఅయ్యోరికాలీడా శెయ్యాడా యింకోయ్యోరికి తలేండా మొండెమూండా. వోదొరాయ్న మెడేమో - యిగ్గో! — [వెంకి తలపట్టుకొని త్రిప్పుచు] — యిట్టతిరిగి మోయిందేయి!

వెంకి — [మెడవదిలించికొని] — యేంగాచారమే - మెడిరిశే వంటేయి!

గుర॥ — ఆముంగలబండి లుండోళ్లేమో అప్పళ్ళప్పళ్ళయి — పళ్లాణోళ్లంటా గురుతుందం [illegible] యిచ్చి నెన్క బల్లేమో - శిని శిని యుక్క [illegible] యి స్నూడే - హిం [illegible] మోయిందె! [illegible]

వెంకి — ఆ కుప్పల [illegible] మొందూరు శేసాటుందాతో?

గుర|| — బొంగుమొంతుడికే తెలియాలి. వోరూ లేరంటా శెపుతుండాడు. శనోరం - ఆదోరం - సోమోరం - యింకా బేస్తోరానికీ ఆకుప్ప లెగిశేనంటేయి? దాని కాకాడి బల్లే యింకా అన్నీ లెగనెత్తలేదు. యియ్యాల్టికంతా సచ్చినోళ్లు యాభై మందట - కాల్లెయ్యిరిగినోళ్లు ముప్పియ్యారంట - యీడ్సుకొచ్చి జనలాసుపత్రిలో పడేశారు. ఆ శెఫాలుసూస్తే నే బయిమయ్యానేయి! యిసగ్గాను! యీ పొట్ట లోబొంయెక్కలు కొమ్ములాలె మొడ్సుకొళ్ళినోళ్లూ - మునంబకాలె గుప్లు బేటికొళ్ళినోళ్లూ - యీపుర్రె గిలి గుం జెలపటిగ్గక్కినోళ్లూ - దంతా లిట కర్సుకుమొయి నోళ్లూ — శెపితే కల్లోకొచ్చేనేయి! — వో గరిబి ణిల్లాలేమో —

వెంకి — ఆమాటింక శెప్పకేయి! రుక్కినమ్మోరింటోయింటేనే నావొల్లు కంఫరమైంది! పాపం ఆణేమ్మోరింటో వుండాడే, డాగుటేరు సదువు నేరుత్తుండాడు - ఆశివ్వయ్యోరు సచ్చిపొయ్యాడంట - అందరూ శెప్పొగుంటుండారు.

గుర|| — రేల్లోమడంటే? శీ! లేదేయి. రేల్లోసత్తే శెఫమేడేం? పాపం! కుర్రాయినైనా మంచాయినే —



నాకు వుపకోరం శేశాడు, మూడుకాలాలూ సల్లంగా బతగాలి! రోపాదండగట్టి తగిలాలు రుద్దీరుద్దీ యీమోంకాలు నెప్పి తీశిందంటే! ఆశిన్నయ్యోరు వుశితార్గం దై శేశాడే - అమురుతోదెయ్యం - అది రుద్దినాంక గాదంటే నెప్పి సవ్వంగమోయింది? ఆ మారాజంటే సచ్చాడు? - శీ! శీ!

వెంకి|| — యిదేం యెట్టిగోలే - ఆరింటో శెప్పొగుంటుండారంటేనూ? బాదోల్లొండేమో ఆనందయ్యోరికి తంతెంపినారంట - ఆనందయ్యోరు మల్లా తంతిగొట్టుండారంట - యింకా ఆడకీ యీడకీ తంతిమాటాడ్తానే వుండారంట. పాపం! యీ రేల్లోనే సచ్చాడంటుండాను.

గుర|| — శీ! శీ! సావలేదేయి! ఆశిన్నాయిన సచ్చుంటే, యీ బూళోకంలో బొంగుమంతుడే లేడేయి!

వెంకి — యేం యెర్రే యిదీ! సచ్చాడని పబిగ్గా శెపుతుంటేనూ? యియ్యాల్లో రేపో అయ్యోరమ్మోళ్లు బందోర్లుండొచ్చేరంట.

గుర|| — యెన్నయినా శెప్పే - ఆ కుర్రాయిన సావలేదేయి. సస్తే గురవడూ సచ్చాడనుకోయే.

వెంకి॥ — ఛీ! యేంమాటేయి? ఆయిన సానే లేదు బతక
నియ్యే, వోరొద్దున్నారు? గురవడు సచ్చాడనుకో
వాలంట! గురవడుసస్తే యెంకి సావదంటే?

గుర॥ — కాదే - ఆశిన్ని మారాజుసస్తే నూనేనుండి యేం
పెవ్వోజనమే? నీమాటిన్నేల్నుంచీ మణుచులే
మో బయింగా వుందేయి.

వెంకి — పండక యెంకి డొక్కలో దూర్తే బయిమూ గి
యిమూ అన్నీ పొయ్యాని - లోనికిరాయే!

[అని లేవదీసి లోనికి దోడ్కొనిపోవును.]

రంగము ౨. — చెన్నపట్టణము, కాలేజి హాస్టెల్.

ప్రవేశము :— కుశాల్రాం, శర్మ, ప్రసాదం.

—— : o :——

ప్రసా॥ — శివరాత్రికి ముందు బీచిదగ్గిర చూడడమే - మ
ళ్లా యీ నాలుగైదునెల్లూ కళ్లబణ్ణేలేదు.

కుశా॥— అర్బత్ నట్ గోలైంతర్వాత సెంట్రల్ స్టేషన్
లో నాకోసారి కనపడి యేదో పనిమీద హైద్రా
బాడ్ కు వెళుతున్నానన్నాడు. అక్కణ్ణించొచ్చి
కాశీకెళ్లాట్ట. వెళ్లినవాడువీడిఖర్మంగాలా అక్కణ్ణే
యినా చావక తీరా యింటిదగ్గిరకొచ్చి పాడుచావు
చచ్చాడు! ఫ్రయ్ డేనాడు శవాన్ని ఐడెంటిఫయ్ చేశి



తీసికెళ్లారు. పాపం! ఆ కూతుళ్ల గోల చూస్తే నా
క్కూడా కళ్లనీళ్లొచ్చాయి - జేబులో పదిరూపాయి
లుంటే యిచ్చిపంపాను.

శర్మ॥ — శెట్టిగారికన్నా సుందరశాస్త్రికన్నా గొప్పవా
డా యేమిటి, మనక్కళ్లనీళ్లురావడానికి? మహీపతి
పోతే లోకాని కేమన్నాలోటా? పాపం! సుందర
శాస్త్రి తల్లీ తండ్రీ చెల్లెలూ అందరూ మొన్నటి
దినం వచ్చారు - వాళ్లగోల చూచావుగావు. శవ
మైనా కళ్లబడితే కొంతదుఃఖ నివారణగావుండును.
అది యేకుప్పలో గలిసి పోయిందో యింకా కనపడ
నేలేదు. రేపో యెల్లుండో కర్మ ప్రారంభిస్తారట.
ఆ తల్లి దుఃఖం చెపితే తెలియదు.

కుశా॥ — వట్టి వెఱ్ఱిపప్పలు - మీకు లోకమోటి తెలు
సుంటోయి? వాడు చావా లేదు వల్లకాడూ లేదు,
అంతా వట్టి గోలే. వాడు చస్తే ఆనందంపంతులు
కూతు రెందుకు మాయమౌతుంది? యిద్దరూ మా
ట్లాడుకుని యేదో యెత్తేస్కున్నారు - పెళ్లి చేసు
కొంస్తారు యింకా నామాట చూడండి.

శర్మ॥ — నీదొఖటే వెఱ్ఱిగోల. సుందరశాస్త్రి రైల్లో
చచ్చిపోయినాడని విన్నతర్వాతనే వాణీబాయి

మాయమైంది. యేదన్నా నూతిలోనో సముద్రంలోనో పడి చచ్చిపోయిందని చెప్పుకుంటున్నారు. యింకా యెక్కడా బాడీ కనపడ లేదు.

కుశా॥ — కనపడుతుంది, కనపడుతుంది! యిద్దరి బాడీలూ కలిశే కనపడతాయి!

శర్మ॥ — నీతో యేమిటి, ఫీలింగే లేకుండా మాట్లాడుతావు!

ప్రసా॥ — కాదోయి-తలిదండ్రులకు జాబు రాశి పెట్టి పోయిందటగా — అందరమూ త్వరలో నే కలుసుకుంటాము, విచారపడొద్దనీ?

శర్మ॥ — తన బతుకుమీద విసుగుపుట్టి తలిదండ్రులను విడిచిపోతూన్నట్టు స్పష్టంగానే వ్రాశింది. ఆపేక్ష చేత వాళ్లు అపార్థం చేశి యింకా ఆశ పెట్టుగున్నారు గాని తక్కిన వాళ్లకు సెన్సు పోలేదు. యింకోమాట విన్నావో లేదో - యీ వుత్తరం ఆధారం చేసుకుని వామనశాస్త్రిగారు కూడా కొడుకు బతికున్నాడనే వాదిస్తున్నాట.

ప్రసా॥ — సుందరశాస్త్రి బతికున్నాడనుకోవడం వొట్టి పిచ్చిమాటే — పద్దెనిమిదో తారీఖున బందరునుండి బయిలుదేరాడని తండ్రే చెపుతున్నాడుగా?



శర్మ॥ — నే ననేదేమిటి?

ప్రసా॥ — ఒకవేళ ఆపిల్ల మరెవర్నయినా తీసుకుని పోయిందేమో? యీ కలికాలంలో —

శర్మ — ఛీ ఛీ! ఆమాట నీ నోటెంబడొచ్చింది గాని మరెవ్వరూ అనలేరు.

కుశా॥ — ఆచిన్నది చాలా యెక్కువైందని నే నొప్పుకుంటాను - లేడీస్ మీటింగులో స్పీచ్ చదివితేనే తెలుస్తుంది. అట్టాంటి చిన్నదేమిటి సూయిసైడ్ చేసుకోవడమేమిటి! వట్టి పిచ్చిమాట! అసలు సుందరశాస్త్రి చెన్నపట్టానికి బైలుదేరనే లేదని నా అనుమానం.

శర్మ — ఇది అన్నింటికంటె బాగావుంది! పద్దెనిమిదో తారీఖు శుక్రవారంనాడు రైలెక్కించి పంపానని తండ్రే చెబుతున్నాడుగా?

కుశా॥ — పంపితేనేం? బెజవాడలో దిగి రాజమండ్రికి నూకాడేమో?

శర్మ — సరే — వాణీబాయికూడా అక్కడికే వెళ్లిందను.

కుశా॥ — ఇంకా సందేహమా?

శర్మ — నీమాటెందుకు కాదనాలి, అట్టాగైతే అందరికీ సంతోషమే గా! వాణీబాయి పేరెంటూ సుందర

శాస్త్రి పేరెంట్సూ అంధరూ బ్రహ్మానందం పొంది చచ్చిపోయినవాళ్లు, బ్రతికొచ్చినట్టే సంతోషిస్తారు.

ప్రవేశము - ఒక విద్యార్థి.

1-విద్యా॥ — హేపీ న్యూస్ ! సుందరశాస్త్రి బతికున్నాడు ! నిన్నటిదినం రాజమండ్రిలో వాణీబాయిని పునర్వివాహం చేసుకున్నాట్ట! యిడుగో ఆంధ్రప్రకాశిక స్పెషలిష్యూటో టెలిగ్రాం ! — [అని పేపరు కుశాల్రాం చేతికిచ్చును.]

శర్మ॥ — ఏమి ఆశ్చర్యము !

కుశా॥ — ఇప్పుడేమంటారోయి? — [చదువును] — "రాజమండ్రి- జూను 27. నేటి సాయంత్రము 6 గంటలకు ఈ పురమున వితంతూద్వాహ మందిరమున రావుబహద్దరు శ్రీ వీరేశలింగం పంతులవారి యాజమాన్యము క్రింద 99 - వ స్త్రీ పునర్వివాహము మహోత్సవముతో జరుపబడెను. వరుడు - బందరులో న్యాయవాది వామనశాస్త్రిగారి పుత్రుడు సుందరశాస్త్రి, మెడికల్ స్టూడెంటు, వయస్సు 22. వధువు- చెన్నపట్టణ వాస్తవ్యులు కందుకూరి ఆనందం పంతులుగారి కుమార్తె, వాణీబాయి, వితంతువు, వయస్సు 16. ఇది కేవలము స్వయంవరవివాహ



మహోత్సవ సమయమున పురజనులు దాదాపు నాలుగు వేలమంది వచ్చియుండి పుష్పవర్షము గురిపించిరి. వధూవరులు 30 - వ తేది చెన్నపట్టణమునకు పయనము."

ర్మ — ఆహాహా! యేమిటీవింత! — [అని పేపరుతీసిచూచి] — ప్రపంచమంథా తల్లకిందులైనట్టు తోస్తావున్నది ! మనకే సంతోషంతో వొళ్లు పరవశమైంది- తలిదండ్రుల కెట్లావుంటుందో !

ప్రవేశము :— రోజుచు మఱియొక విద్యార్థి.

2-విద్యా॥ — విన్నారుటోయి ? — ఆనందంపంతులుగారికి ఎక్స్‌ప్రెస్ మెసేజొచ్చింది - రాజమండ్రిలో వాణీబాయికీ సుందరశాస్త్రికీ వివాహం జరిగిందని — గురువారంనా డిక్కడికొస్తారట.

కుశా॥—యిదిగో యిప్పుడే ఆంధ్రప్రకాశికలో టెలిగ్రాం చూచాము. [అని పేపరు చేతికిచ్చును.] సరేగాని, నాకో టితోస్తూంది - మనమంధరం దంపతులను స్టేషన్ వద్ద మీాపై ప్రొసెషన్‌తో యింటికితీసుకొస్తే చాలాబాగుంటుంది.

గ[illegible]లెంట్ ప్రొపోజల్ ! కుశాల్రాంపం[illegible]

నీ పాపాలన్నీ దీనితో పరిహారమోయి!

కుశా॥ — రండోయి! లైబ్రరీహాల్లో మీటింగుచేసి అరేంజమెంట్సును గురించి ఆలోచిద్దాము.

[అందఱు నిష్క్రమింతురు]

---

## రంగము 3. — చెన్నపట్టణము.

ఆనందపంతుల యిల్లు, క్రిందిచావడి.

ప్రవేశము :— సోఫాపై వరుసగా గూర్చుండి — 1. వామనశాస్త్రి, 2. వామనశాస్త్రి భార్య, 3. లలితాబాయి, 4. ఆనందపంతులు, ఇరుప్రక్క కుర్చీలపై కొందఱు స్త్రీపురుషులు, కుశాగ్రాం, ప్రసాదం, శర్మ, విదా...

—:o:—

శర్మ॥ — వీరుగో! పునర్జన్మములు గాంచిన మీ...ం...ు!

ప్రవేశము :— (పుష్పవర్షముతో) ఎదుటినుండి సుందరశాస్త్రి, వాణీబాయి తటాలున తల్లికౌగిటవ్రాలి తండ్రిని వడిచేత దాటును.

సుం॥ — [తండ్రికడకుజని] — వీడు మీ ప్రి...మించు...డు — ఈవిషయమున మాత్రము మీయాజ్ఞనతిక్రమించి ప్రవర్తించినవాడు. మన్నించి దీవవయోను...

[అని పాదములకు నమస్కరించును.]

వామ॥ — పుత్రకా! దీర్ఘాయుష్మంతుడవై వర్ధిల్లుము. మాకు బుత్రికను ... సాధించితివి — పరమసంతోషము. దీని మించిన కానుక యేమున్నదు?



సుం॥ — [తల్లిపాదములకు మ్రొక్కి] — అమ్మా! యిదిగో మీబిడ్డ! — [అని వాణీబాయిచేత నామె పాదములకు నమస్కరింపించును. ఆమెయు నాదరణతో గోడలిం... యెడమప్రక్క గూర్చుండబెట్టి ...) పిదప సుందరశాస్త్రి ఆనందంపంతులుకడ కరిగి] — మామగారూ! మన్నించి దీవించవలయును — [అని పాదములకు మ్రొక్కును]

ఆం॥ — పుత్రుండవై మమ్మానందాబ్ధిని ముంచితివి. పుత్రపౌత్రాభివృద్ధిగ చిరకాలము సుఖియింపుము.

[అని లేవదీసి తన యెడమప్రక్క గూర్చుండ బెట్టికొనును.] (చప్పట్లు.)

శ... ఆహా! యేమీ యద్భుతము — అందరి కానందా
...ప్తి నోట మాటే రాకున్న జనశోకము
నారంభమైన యీ సౌమ్య వత్సరమున నింతటి
...ము సంప్రాప్తమగుట మేటిభాగ్యముగదా!
స్వయంవర వివాహ మెంత సంస్తవనీయము!
కలకాలమున నిట్టిది కన్నులారగనుట —

ప్రవేశము :— కలిపురుషుడు.

కలి॥ — ఓహో! ఎవ్వరిదోసో గలినింద సేయబూనుచున్నారు? కీడునగా... మేలుగలిగెడి యిక్కలియుగమన్నిట మిన్నయని తెలియక నను జుల్కనగబల్కు

ఖరు [illegible] నాల్గు [illegible] మైనవ పద్య
పఠనానికి తల్లడిల్లెడి [illegible] సావగ్గురు చేయుము
కలంపరా ప్రజానాశనమునకు వగతు కెకాని పద్యప
[illegible]నము గాదగు. [illegible] [illegible]లుసంగక [illegible]
[illegible]లు [illegible]? చెప్పు [illegible] [illegible]
[illegible]కనియత్రిప్పము [illegible] [illegible] మా[illegible]
[illegible]? [illegible] [illegible] [illegible]
ముగ్గై, నిం[illegible] నన్ను దూరెదరు?
[illegible]తుండు సుందరు; [illegible] [illegible]
[illegible] [illegible] ప్రశాంతమైన పవిత్రత
[illegible]త్ర; మహావిచిత్ర [illegible] క్షేత్రియు [illegible]
[illegible] [illegible] మార్గదర్శనై [illegible]
[illegible] [illegible] వసుంధర నిట్లు ప్రశస్తిగాంచుగా

[illegible]

పాదు॥ — [illegible]తయు నల [illegible] [illegible] [illegible]
[illegible] శ్రీ [illegible] [illegible] కృప — ఆ త్రిపురసుంద[illegible]
[illegible]గ్రహము! [[illegible]]

[illegible] 21
సంపూర్ణము.

END OF
TITLE